తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

ఆదివారం 11.01.2026 | సంపుటి :12 సంచిక : 173 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698





# నిరంతరం నేర్చుకోవడమే విజయ రహస్యం



## నేను డాక్టర్‌ను కాదు.. సోషల్ డాక్టర్‌ను..

- వైద్యులు సామాజిక బాధ్యత మరవొద్దు
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలి
- కానీ.. ప్రజల నాడి పట్టుకోవడం మరవొద్దు
- ఫెలోస్ ఇండియా కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు.. వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలరని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ.. సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని సీఎం

మిగతా 2లో..

"నేను వైద్యుడిని కాదు కానీ నేనూ డాక్టర్‌నే సోషల్ డాక్టర్‌ను. లైఫ్ సైన్సెస్, ఫార్మా ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోంది. హెల్త్ కేర్ ఆవిష్కరణ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోంది. మనుషులు, సమాజంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ప్రభుత్వ పాలసీలు మెరుగు కోసం వైద్యులతో కలిసి పనిచేయడానికి మేం సిద్ధం. వైద్యులు అధునాతన సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాలి. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో మనం భాగస్వాములం అవుదాం. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు మనం కలిసి పని చేద్దాం. విద్యార్థులకు సీపీఆర్ నేర్పేందుకు ముందుకు వస్తే చాలా మంది ప్రాణాలను కాపాడగలం. క్వాలిటీ ఆఫ్ హెల్త్‌కేర్ కోసం అందరూ కృషి చేయాలి. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమం కావాలి - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులు

# తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర సాయమందించండి

- పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి
- రాష్ట్రంలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి
- ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి
- హైదరాబాద్‌లో ఐఐఎ ఏర్పాఉటకు సహకరించండి
- మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయ నౌరాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదిం పులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నమ్ముతున్నానని భట్టి అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌బిఆర్‌ఎం పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల

మిగతా 2లో..

# సంక్రాంతికి సొంతూరికి ఆంధ్రోళ్లు..



### రద్దీకి అనుగుణంగా మరిన్ని రైళ్లు

హైదరాబాద్(జనంసాక్షి): సంక్రాంతి పండుగను ఆనందంగా తమ సొంత ఊర్లలో జరుపుకునేందుకు నగరవాసులు భారీ సంఖ్యలో ప్లలెలకు క్యూకడుతున్నారు. దీంతో టోల్ విజయవాడ వైపు వెళ్లే రోడ్లు ట్రాఫిక్ తో కిటకిటలాడుతున్నాయి.ఎవరైనా ఈ సిరప్ నియోగిస్తుంటే తక్షణమే

మిగతా 2లో..

# మేడారం జాతరలో భక్తులకు తక్షణ సేవలు అందించాలి

- జాతరలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా మెడికల్ క్యాంపులు
- వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



హైదరాబాద్(జనంసాక్షి):మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.


మిగతా 2లో..

## భూ భారతి రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు

### విచారణకు లోకాయుక్త ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలపై విచారణకు లోకాయుక్త ఆదేశించింది. సుమోటోగా కేసు నమోదు చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. భూభారతి చట్టాన్ని వాడుకుని ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. జనగామ జిల్లా కేంద్రంలో ఒకే రోజు రూ.8 లక్షల రూపాయల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పక్కదారి పట్టించిన ఘటన బయటకు రావడంతో లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. భూ భారతిలో జరిగే కుంభకోణానికి సీసీఎల్‌ఏ

మిగతా 2లో..



# రేటింగ్ కోసం దుష్ప్రచారాలు ఆపండి



## మహిళా ఐఏఎస్‌పై అసత్యవార్తలు దురదృష్టకరం

- సినిమా టికెట్ ధరల పెంపునకు నేను అనుమతి ఇవ్వలేదు
- ఆ ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశాను: మంత్రి కోమటిరెడ్డి
- హైదరాబాద్-విజయవాడ హైవేపై ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో గతంలోనూ, ప్రస్తుతం సినిమా టికెట్ ధరలు పెంచేందుకు తాను ఎప్పుడూ అనుమతి ఇవ్వలేదని తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన పలు అంశాలపై విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా వస్తున్న సినిమా టికెట్ ధరల పెంపు అంశంపై విలేకరులు ఆయన్ని ప్రశ్నించారు. ఇందుకు ఆయన సమాధానమిస్తూ సినీ ఇండస్ట్రీని పట్టించుకోవడం మానేశానని తెలిపారు."సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేశాను. 'పుష్ప2' తర్వాత బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరలను పెంచమని నా వద్దకు రావొద్దని చెబుతూనే ఉన్నా. ఆ మధ్య వచ్చిన రెండు సినిమాలు, తాజాగా వచ్చిన సినిమా, సంక్రాంతికి రాబోయే చిత్రాలకు సంబంధించి ఏ ఫైలూ నా దగ్గర రాలేదు. అప్లికేషన్ పెట్టుకోవద్దని నేనే చెబుతున్నా. నన్ను ఎవరూ కలవడం లేదు. సంధ్య థియేటర్ ఘటనలో ఒక మహిళ చనిపోయింది. ఎందుకు పరిష్మన్ ఇచ్చానా?అనిపించింది. సంఘటన జరిగిన వెంటనే ఆస్పత్రి

మిగతా 2లో..

## మహిళా ఐఏఎస్‌లపై తప్పుడు కథనాలు తగవు

- ఇలాంటి కథనాలతో ఆత్మస్థైర్యం దెబ్బతీయొద్దు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు

2లో..

## ఆల్మంట్‌కిడ్ సిరప్ విషపూరితమైనది

- తక్షణం వినియోగాన్ని ఆపివేయండి
- తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్

హైదరాబాద్(జనంసాక్షి):ఆల్మంట్ కిడ్ సిరప్ వినియోగాన్ని నిలిపివేయాలని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశించింది. సిరప్‌లో ఇథలీన్ గ్లైకాల్ కలుషితమై విషపూరితమైనట్లు గుర్తించారు. ఈ మేరకు కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి హెచ్చరిక అందింది. ఇది ఎవరివద్దనైనా ఉంటే.. వాడకం, విక్రయాలు నిలిపివేయాలని సూచించింది. దీంతో తెలంగాణ డ్రగ్స్

మిగతా 2లో..





# హైడ్రా మరో విజయం

- మియాపూర్‌లో భారీ ఆపరేషన్
- రూ.3వేల కోట్లకుపైగా విలువ చేసే ప్రభుత్వ భూమి స్వాధీనం



మియాపూర్‌లో హైడ్రా శనివారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ విలేజ్ మక్తా మహబూబ్ పేట సర్వే నంబరు 44లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ. 3 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

12లో..

# పుతిన్‌పై సైనికచర్య ఉండదు



- ఆయన నాకు మంచి మిత్రుడు
- ఎన్నో ఏళ్లుగా మా ఇద్దరి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి
- కానీ రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఎంతో అమాయకులు చనిపోతున్నారు
- ఇప్పటి వరకు ఎనిమిది యుద్ధాలను ఆపేశా: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):వెనెజువెలా దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం ఆకస్మికంగా బంధించిన ఘటన అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఆ పరిణామం తర్వాత, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై కూడా అమెరికా ఇలాంటి సైనిక చర్య చేపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఇటీవల డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన మీడియా సమావేశంలో యూఎస్ మీడియా ప్రతినిధులు కీలక ప్రశ్నలు సంధించారు. మదురో మాదిరిగానే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కూడా భవిష్యత్తులో బంధించేందుకు అమెరికా సైనిక చర్యలకు దిగుతుందా? అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ స్పందిస్తూ, ఎన్నో ఏళ్లుగా తనకు పుతిన్‌తో మంచి పరిచయం, స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

మిగతా 2లో..

## గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం చేసుకునితీరతాం

- మరోసారి ట్రంప్ హెచ్చరిక
- మేం అమెరికన్లుగా ఉండాలనుకోవడం లేదు
- గ్రీన్‌లాండ్ రాజకీయ పార్టీల ప్రకటన

2లో..

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

### జనసేన

హైదరాబాద్(జనంసాక్షి): రాబోయే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే ప్రారంభించినట్లు ఆ పార్టీ వెల్లడించింది. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నప్పటికీ సాధ్యమైనన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పోటీ

మిగతా 2లో..

# హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

## అమెరికా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం




వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ తాజాగా వెల్లడించింది. కొత్త రేట్స్ మార్చ్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. హెచ్-1బీ, ఎల్-1 సహా పలు రకాల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును చార్జ్ చేస్తుంటుంది. హెచ్-1బీ లాంటి వీసాల విషయంలో గతంలో 2,805 డాలర్లుగా ఉన్న ప్రీమియం ఫీజు ప్రస్తుతం 2,965కి పెరిగింది. విదేశీ ఉద్యోగుల వీసా దరఖాస్తు పరిశీలనను వేగవంతం చేసేందుకు అమెరికా సంస్థలు ఈ ఫీజును చెల్లిస్తుంటాయి. ఇక ఎఫ్-1, జే-1వంటి వీసాల ప్రీమియం ఫీజు కూడా 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెరిగింది. 2023 జూన్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ పేర్కొంది. జాబ్స్ మారే వారు, వీసాలను రెన్యూవల్ చేసుకునే విదేశస్తులపై ఈ పెంపు భారం పడనుంది. ఫీజు పెంపుతో వచ్చే అదనపు నిధులతో తమ

మిగతా 9లో..

# మేడారం జాతరలో భక్తులకు తక్షణ సేవలు అందించాలి

చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఃజాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ ? మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు. గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించా మన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

# సంక్రాంతికి సొంతూరికి ఆంధ్రోళ్లు..

నిలిపేయాలని టీజీసీఏ సూచనలు చేసింది. అలాగే సిరప్ వినియోగ సమాచారాన్ని సమీప డ్రగ్ కంట్రోల్ అధికారికి ఇవ్వాలని సూచించింది. పిల్లలకు వాడే సిరప్ కావడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇథిలీన్ వల్ల కిడ్నీ సమస్యలు, న్యూరాలజికల్ డ్యామేజ్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పిల్లల సిరప్‌లలో ఇలాంటి కలుషితాలు గుర్తిస్తుడడం వల్ల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి రద్దీ దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపనుంది. హైదరాబాద్-విజయవాడ మధ్య మరో 10 సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్ వివరాలను దక్షిణ మధ్య రైల్వే కొంచెంసేపటి క్రితం ప్రకటించింది. ఛైర్ కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఛైర్ కార్ బోగీల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కల్పించారు. రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైలులో సగానికి పైగా జనరల్ బోగీల ఏర్పాటు చేయడం విశేషం. పండగకు ముందు, తర్వాతి రోజుల్లో ఈ ప్రత్యేక రైళ్లు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తాయి.ఈనెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6.10 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు సంక్రాంతి ప్రత్యేక రైళ్లు ఈనెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి సంక్రాంతి పండుగ వేళ ఇప్పటికే నడుస్తున్న 150కిపైగా అదనపు ట్రైన్స్‌కు ఇవి అదనం. అయితే, ఇవాళ ప్రకటించిన ప్రత్యేక రైళ్లు.. కేవలం విజయవాడ వరకు మాత్రమే నడుపుతున్నారు. ఇప్పటికే నడుస్తున్న సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్ మాత్రం నర్సాపురం, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మచిలీపట్నం, నాందేడ్ వరకూ నడుస్తున్నాయి.ప్రత్యేక రైళ్ల నిర్వహణ విషయంలోనూ దక్షిణ మధ్య రైల్వే శాఖ జాగ్రత్తలు తీసుకుంది. చాలా ట్రైన్స్‌ను చర్లపల్లి నుంచి బయల్దేరేలా షెడ్యూల్ చేసింది. దీంతో పునర్నిర్మాణంలో ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై భారం పడకుండా జాగ్రత్త పడింది. ఒక్క చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచే కాకుండా కొన్ని రైళ్లు బేగంపేట్, హైటెక్ సిటీ, లింగంపల్లి నుంచీ ఎక్కేలా లాన్ చేసింది.

# సోమ్‌నాథ్ ఆలయంలో ప్రధాని మోడీ ప్రత్యేకపూజలు

**సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో ప్రాల్గొననున్న మోడీ**

**అహ్మదాబాద్(జనంసాక్షి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాజ్‌కోట్‌లోని హీరసర్ విమానాశ్రయానికి శనివారంనాడు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి కుంవర్జీ బావలియా, రాజ్‌కోట్ మేయర్ తదితరులు ప్రధాని సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సోమనాథ్‌కు ప్రధాని బయలుదేరారు. ప్రధాని తన పర్యటనలో ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొనున్నారు. అనంతరం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు.సోమనాథ్ ఆలయంపై 1026లో గజనీ మహ్మద్ దాడి చేసి విధ్వంసం చేశాడు. పలువురు విదేశీ పాలకులు కూడా ఆలయంపై దాడి చేసి దోచుకున్నారు. అప్పట్నించి ఆలయ పునరుద్ధరణ పనులతో సోమనాథ్ ఆలయం తన వైభవాన్ని చాటుకుంటూనే ఉంది. అయితే మొదటిసారి జరిగిన దురాగతానికి వెయ్యేళ్లు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈనెల 8 నుంచి 11 వరకూ వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది సాధువులు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆలయ ఆవరణలో జరిగే 72 గంటల ఓంకార (క్షప) ఉచ్ఛరణ కార్యక్రమంలో పాల్గొనున్నారు. సాయంత్రం ఉత్సవాల్లో భాగంగా డ్రోన్ షో, మంత్ర పఠనం ప్రత్యేక ఆకర్షణలు కానున్నారు.సర్దార్ పటేల్ సారథ్యంలో 1951లో ఆలయ పునర్మిర్మాణం జరిగి భక్తుల సందర్శన కోసం తలుపులు తెరుచుకున్నారు. 2026లో 75వ వసంతానికి చేరుకోవడంతో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 'భారతీయ నాగరికత అజేయ సంకల్పం, బలానికి గొప్ప నిదర్శనం సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం. మన ఆధ్యాత్మిక సంప్రదాయానికి శక్తివంతమైన చిహ్నం. సంపూర్ణ విశ్వాసం, ఉత్సుకత, భక్తితో యావద్దేశం స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను జరుపుకొంటోంది' అని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.సోమనాథ్ ఉత్సవాల్లో భాగంగా జనవరి 11వ తేదీ ఉదయం 9.45 గంటలకు జరిగే శౌర్యయాత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనున్నారు. సోమనాథ్ ఆలయాన్ని శతాబ్దాలుగా కాపాడుకుంటున్న యోధుల సంస్మరణగా ఈ శౌర్యయాత్ర నిర్వహిస్తున్నారు.

# నిరంతరం నేర్చుకోవడమే విజయ రహస్యం



వ్యాఖ్యానించారు. వైద్యులు ప్రజలు, సమాజంపై తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని.. అయితే, ప్రజల నాడి పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం సూచిం చారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని సీఎం అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోం దన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

**అప్‌గ్రేడ్ అయినా.. ప్రజల నాడి పట్టుకోవడం మరవొద్దు: సీఎం రేవంత్**

లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్‌కేర్ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫెలోస్ ఇండియా సదస్సులో సీఎం మాట్లాడుతూ.. "సమాజంపై మీ బాధ్యతను ఎప్పటికీ మరిచిపోవద్దు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వైద్యులు అధునాతన సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకోవాలి.. కానీ ప్రజల నాడిని పట్టుకోవడం మరిచిపోవద్దు" అని తెలిపారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర సాయం అందించండి

వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎంఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.




# భూ భారతి రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు

టెక్నికల్ టీమ్ సహకరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ భూ పరిపాలన శాఖ చీఫ్ కమిషనర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ, మీ సేవ కమిషనర్, జనగామ జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

# ఆల్మంట్‌కిడ్ సిరప్ విషపూరితమైనది

కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరిక నోటీసు జారీ చేసింది. పిల్లలకు వాడే సిరప్ కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

చేస్తున్నట్లు పేర్కొంది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న జనసైనికులు, వీర మహిళలు ఈ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని జనసేన పార్టీ పిలుపు నిచ్చింది.

# యూపీలో దారుణ ఘటన

- దళిత మహిళ హత్య..కూతురు కిడ్నాప్
- రంగంలోకి దిగిన పోలీస్ బృందాలు

**లక్నో(జనంసాక్షి):** ఒక యువకుడు దళిత మహిళను హత్య చేశాడు. ఆమె కుమార్తెను కిడ్నాప్ చేశాడు. ఈ సంఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో యువతిని కాపాడి నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జనవరి 8న కప్సద్ గ్రామానికి చెందిన దళిత మహిళ, 20 ఏళ్ల కుమార్తె కలిసి నడుస్తూ తమ పొలానికి వెళ్తున్నారు. స్థానిక వైద్యుడి వద్ద కాంపౌండర్‌గా పనిచేసే 22 ఏళ్ల పారస్ కాలువ గట్టు వద్ద ఆ మహిళలను అడ్డుకున్నారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ప్రతిఘటించిన ఆమె తల్లిపై కొడవలితో దాడి చేశాడు. యువతిని కిడ్నాప్ చేసి పారిపోయాడు. కాగా, గాయపడిన దళిత మహిళ అరుపులు విన్న స్థానికులు అక్కడకు చేరుకున్నారు. ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. దీంతో ఆ గ్రామంలోని దళిత కుటుంబాలు ఆగ్రహంతో రగిలిపోయాయి. భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఆమె కుమార్తెను రక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు, అధికారులు, రాజకీయ నేతల హామీతో నిరసన విరమించారు. దళిత మహిళ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మరోవైపు నిందితుడు పారస్‌కు మరికొందరు వ్యక్తులు సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కిడ్నాపైన యువతిని కాపాడేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. అయితే సీఎం ఆదిత్య నాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలైన బీఎస్పీ, ఎస్పీ, కాంగ్రెస్ మండిపడ్డాయి. నిందితులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించాయి.

# అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలి

**అజిత్ దోభాల్ కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ యువతనుద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని వారికి సూచించారు. ప్రతీకారం మంచిది కాదని.. దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం మన సరిహద్దుల వద్దే కాకుండా.. దేశంపై గతంలో జరిగిన అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని పుణికి పుచ్చుకోవాలన్నారు.చరిత్రలో ఇతర దేశాలు మనపై దాడులు చేసి ఆలయాలు, గ్రామాలను ధ్వంసం చేసినప్పటికీ మన పూర్వీకులు మాత్రం ఏ దేశ ప్రజలకూ ఎటువంటి హాని చేయలేదని అజిత్ డోభాల్ పేర్కొన్నారు. వారి నుంచి పాఠాలు నేర్చుకొని మనం కూడా ఇతరులను ఇబ్బందిపెట్టకుండా ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో నడవాలంటే సరైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. నాయకత్వం గొప్పదనాన్ని తెలుపుతూ.. "ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు భయపడను.. కానీ సింహం నేతృత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతాను" అని ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ అన్న మాటలను గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.

# రేటింగ్ కోసం దుష్ప్రచారాలు ఆపండి

వాళ్లు, డీఎం హెచ్‌వో తదితరులతో మాట్లాడి, ప్రతీక్ ఫౌండేషన్ తరఫున రూ.25లక్షల చెక్ ఇచ్చాను. అప్పటికి నిర్మాత కూడా ఎవర్ని పంపలేదు. ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదల కావాలంటే ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. ప్రమాదంలో గాయపడిన అబ్బాయిని పెంచి, చది విస్తానని ఆ తండ్రికి హామీ కూడా ఇచ్చాను"ఇక తెలం గాణలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు పెంచబోమని ఆ మరుసటి రోజే అసెంబ్లీలో చెప్పాను. ఆ మాటకు కట్టుబడి ఇప్పటి వరకూ ఒక్క సంతకం కూడా పెట్టలేదు. నల్గొండకు సంబంధించిన అభివృద్ధి పనులు చూసుకుంటూ, వాటిని సమీక్షించుకుంటూ రాత్రే వచ్చాను. నేను సినిమా పరిశ్రమపై దృష్టి పెట్టదలుచుకోలేదు. సమస్యలు పరిష్కరించాలని కార్మికులు వస్తే, పేద కళాకారుల విషయంలో మాత్రమే నేను జోక్యం చేసుకున్నా. అంతే తప్ప, రేట్లు, బెనిఫిట్‌లకు సంబంధించి ఎలాంటి సంబంధం లేదు. టికెట్ ధరల పెంపు గురించి వస్తున్న జీవోలకు నాకు ఎలాంటి సంబంధం లేదు" అని అన్నారు.

**మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం దురదృష్టకరం**

హైదరాబాద్: మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఖండించారు. ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా రాతలు రాయొద్దని మంత్రి హితవు పలికారు. మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు.'నా జిల్లాలోనే కాదు.. చాలా జిల్లాల్లో కలెక్టర్ల బదిలీ జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుంది. అధికారుల మీద అభాండాలు వేయడం సరికాదు. రేటింగ్‌లు, వ్యూస్ కోసం అవాస్తవాలు రాయడం సరికాదు. ఛానళ్ల మధ్య పోటీ కోసం మహిళా అధికారులను ఇబ్బంది పెట్టొద్దు. మంత్రులపైనే కాదు.. సీఎంపైనా దుష్ప్రచారం చేస్తున్నారు' అని కోమటిరెడ్డి అన్నారు.

**హైదరాబాద్-విజయవాడ హైవేపై ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం**

సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వంతెనల నిర్మాణం జరుగుతున్న చోట యంత్రాలు కూడా తొలగించినట్లు తెలిపారు. ఈ అంశంపై మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు."నేషనల్ హైవేల డైరెక్టర్‌తో ఇప్పటికే మాట్లాడాను. టోల్‌ప్లాజాల వద్ద రద్దీ పెరిగితే టోల్ వసూలు లేకుండా పంపించాలని చెప్పాం. రోడ్లపై వాహనాలు ఆగిపోతే.. వెంటనే తొలగించేందుకు హైవేపై క్రేన్లు సిద్ధంగా ఉంచాం" అని మంత్రి తెలిపారు.

# మహిళా ఐఏఎస్‌లపై తప్పుడు కథనాలు తగవు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమ వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నించారు. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిదని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్. 'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు

# పుతిన్‌పై సైనికచర్య ఉండదు

**ఎనిమిది యుద్ధాలను ఆపేశా**

అయితే ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధం విషయంలో పుతిన్ వైఖరిపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ యుద్ధం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా సైనికులు పెద్ద సంఖ్యలో మరణిస్తున్నారు. ఈ పరిస్థితి నన్ను తీవ్రంగా కలిచివేస్తోంది" అని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను ఆపినట్లు ట్రంప్ మరోసారి గుర్తు చేశారు.

**ఆ ప్రయత్నాలు కొనసాగిస్తూనే!**

అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాత్రం ఇప్పటివరకు విజయం సాధించలేకపోతున్నానని చెప్పారు. "ఈ యుద్ధాన్ని ఆపడం చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ దీన్ని ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుతిన్‌పై సైనిక చర్యలు చేపడతారా అనే ప్రశ్నకు ట్రంప్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు.పుతిన్‌ను బంధించేందుకు లేదా రష్యాపై సైనిక చర్యలకు దిగే ఆలోచన తనకు లేదని తేల్చి చెప్పారు. అయితే ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు దిశగా రష్యాపై రాజకీయ, దౌత్యపరమైన ఒత్తిడి మాత్రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ అరెస్టు అంశాన్ని ప్రస్తావించారు. "నియంతలను ఇలాగే ఎదుర్కోవడం సాధ్యమైతే, అలాంటి వారి విషయంలో ఏం చేయాలో అమెరికాకు బాగా తెలుసు" అంటూ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ వ్యాఖ్యలు పుతిన్‌ను ఉద్దేశించి చేసినవేనని అంతర్జాతీయ రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై దాడుల పరంపరను కొనసాగిస్తున్న పుతిన్‌ను కూడా ట్రంప్ ఇదే తరహాలో హ్యాండిల్ చేయాలని ఆయన సూచించినట్లుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర అసంతృప్తి**

ఒకవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో స్నేహం ఉందని చెబుతూనే, మరోవైపు ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేయడం గమనార్హం. అలాగే సైనిక చర్యలు కాకుండా, దౌత్య మార్గాల్లోనే రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురో అరెస్టు ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరలేపగా, పుతిన్‌పై కూడా ఇలాంటి చర్యలు ఉంటాయా అనే ప్రశ్నలకు ట్రంప్ ఇప్పుడు ఇచ్చిన సమాధానం స్పష్టతనిచ్చినట్లైంది.

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం చేసుకునితీరతాం

**వాషింగ్టన్(జనంసాక్షి):** అక్కడి ప్రజలకు నచ్చినా నచ్చకపోయినా.. గ్రీన్‌లాండ్‌ను ఎట్టిపరిస్థితుల్లో స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఏ మాత్రం వెనకడుగు వేసినా ఆ ప్రాంతాన్ని రష్యా లేదా చైనా స్వాధీనం చేసుకుంటాయని ఆరోపించారు. రష్యా, చైనా అమెరికాకు పొరుగుదేశాల్లాగా ఉండటం తనకేమాత్రం ఇష్టం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చల ద్వారా గ్రీన్‌లాండ్‌ను పొందాలని అనుకున్నాం. కానీ అది సాధ్యం కాలేదు. కాబట్టే కఠిన మార్గాలను అనుసరించాల్సి వస్తోంది. గ్రీన్‌లాండ్ చుట్టూ ఉన్న జలాల్లో ఇప్పటికే చైనా, రష్యా తమ నౌకలను మోహరించి ఉన్నాయి. అమెరికా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోకపోతే ఆ పనిని చైనా, రష్యాలు చేస్తాయి. అందువల్లే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి కఠిన మార్గాలను ఎంచుకోవడానికైనా మేం సిద్ధంగా ఉన్నాం. అమెరికాకు గ్రీన్‌లాండ్ వ్యూహా త్మకంగా, రక్షణపరంగా కీలకమైంది.రక్షణ పరంగా కీలకమైంది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణ అవసరం. దీనిపై మరింత లోతుగా చర్చలు జరపడానికి గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నేతలతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ అవుతారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**మేం అమెరికన్లుగా ఉండాలనుకోవడం లేదు**

వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్ట్ తర్వాత గ్రీన్‌లాండ్ పేరు వార్తల్లో ఎక్కువగా వినిపిస్తోంది. దానిని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమనుకుంటే సైనిక ఆప్షన్‌ను పరిశీలిస్తామని ఆయన యంత్రాంగం ఇప్పటికే పేర్కొంది. ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్ రాజకీయపార్టీలు ఒక్కతాటిపైకి వచ్చాయి. తాము అమెరికన్లుగా ఉండాలనుకోవడం లేదని, తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం తమ చేతుల్లోనే ఉందని స్పష్టం చేశాయి. దానికి సంబంధించిన ప్రకటనపై ఆ పార్టీల నేతలు సంతకాలు చేశారు. గ్రీన్‌లాండ్ భవిష్యత్తును ఈ ద్వీప ప్రజలే నిర్ణయిస్తారని వెల్లడించారు. గ్రీన్‌లాండ్ గురించి ఇంకో 20 రోజుల్లో మాట్లాడదామంటూ ఒకసారి.. అక్కడి ప్రజలు ఇష్టపడినా, పడకపోయినా ఆ ద్వీపం విషయంలో ఒక నిర్ణయం తీసుకోబోతున్నామని మరోసారి.. ట్రంప్ ఇలా వరుసగా హెచ్చరికలు చేస్తున్నారు. గ్రీన్‌లాండ్ చుట్టూ ఉన్న జలాల్లో ఇప్పటికే చైనా, రష్యా తమ నౌకలను మోహరించి ఉన్నాయని.. అమెరికా దానిని స్వాధీనం చేసుకోకపోతే ఆ పనిని చైనా, రష్యాలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అందువల్లే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి కఠిన మార్గాలు ఎంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే అక్కడి ప్రజలకు డబ్బును ఎరగా వేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



## పెప్సీ -2026 క్యాలెండర్ ఆవిష్కరించిన రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెరికకుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) 2026 క్యాలెండర్ ఈరోజు ఉమ్మడి వరంగల్ జిల్లా పేప్సీ అధ్యక్షులు ఆక రాధాకృష్ణ ఆధ్వర్యంలో ములుగు జిల్లా క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన కులాలకు అండగా నిలిచిందని ఇందులో భాగంగానే పెరికకుల వెనుకబడితనాన్ని గుర్తించి, ఆర్థిక పరిపుష్టి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ సందర్భంగా కులవృత్తి విధ్వంసమై, ఆర్థికంగా చతికెలబడ్డ కులానికి పెరికకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆక రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి సురేందర్, పూజారి సమ్మయ్య, ఎర్రం గారి సురేష్ శానం నిర్మల, తదితర నాయకులు పాల్గొన్నారు

## జాగృతి ఖతార్ చైర్ పర్సన్‌కు నారీ శక్తి అవార్డు

- దోహాలో నిర్వహించిన ప్రవాస భారతీయ దివస్ అవార్డు ప్రదానం చేసిన ఎంబసీ అధికారులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** గల్ఫ్ కార్మికులకు అందిస్తున్న సేవలకు గాను ప్రవాస భారతీయురాలు, జాగృతి ఖతార్ అడ్వైజరీ చైర్ పర్సన్ నందిని అబ్బగౌని ప్రతిష్ఠాత్మక నారీ శక్తి సమ్మాన్ అవార్డుకు ఎంపికైంది. ఖతార్ లోని భారతీయ దౌత్య కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవాసీ భారతీయ దివస్ దోహాలోని ఐసీసీ అశోక హాల్‌లో జరిగింది. ప్రవాసీ భారతీయ దివస్‌ను ప్రతి సంవత్సరం ప్రవాస భారతీయుల సేవలను గుర్తిస్తూ జరుపుకుంటారు. ఈ ఏడాది వేడుకల్లో మహిళల శక్తి అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. భారతీయ సమాజానికి సేవలందిస్తున్న నందిని అబ్బగౌని ని నారి శక్తి సమ్మాన్ పురస్కారానికి ఎంపిక చేసింది భారత ఎంబసి. ఖతార్‌లో భారతీయ సమాజానికి ఆమె చేసిన విశిష్ట సేవలకు ఈ గౌరవం లభించింది. భారతీయ సంస్కృతి పరిరక్షణలో ఆమె పాత్ర ప్రశంసనీయం అన్నారు ఖాతార్ లోని భారత ఎంబసి అధికారులు. భారత్--ఖతార్ మైత్రిని బలోపేతం చేయడంలో ఆమె కృషిని గుర్తించామన్నారు. పురస్కారం పొందడం పట్ల నందిని ని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అభినందించారు. కతోర్ లోని దోహ నగరంలోని ఐసీసీ అశోకా హాల్ లో జరిగినఈ కార్యక్రమానికి భారతీయ దౌత్య కార్యాలయ అధికారులు, వివిధ రాష్ట్రాల సంఘాల నాయకులు, ప్రముఖులు హాజరయ్యారు. మహిళా సాధికారతకు ఈ వేడుక ప్రతీకగా నిలిచింది. ప్రవాసీ భారతీయ దివస్ 2026 వేడుకలు ప్రవాస భారతీయుల ఐక్యతను చాటాయి.

## విజయ్ వాహనాన్ని సీజ్ చేసిన సిబిఐ

- కరూర్ తొక్కిసలాట ఘటనలో చర్యలు



**న్యూఢిల్లీ, జనవరి 10 (జనంసాక్షి) :** తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట ఘటనకు బాధ్యులను గుర్తించేందుకు చేపట్టిన దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. నటుడు, రాజకీయనేత, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ప్రచార వాహనాన్ని సీబీఐ సీజ్ చేసింది. ప్రచార వాహనం డ్రైవర్ సైతం సీబీఐ అధికారుల ముందు హాజరయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 27న వేలుసామిపురంలో జరిగిన టీవీకే ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఇప్పటికే టీవీకే ఆఫీస్ బేరర్లను న్యూఢిల్లీలోని సీబీఐ హెడ్‌కార్వర్టర్‌లో అధికారులు ప్రశ్నించారు. జనవరి 12న తమ ముందు హాజరుకావాలని విజయ్‌కు సైతం సమన్లు పంపారు. కాగా, కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలను విజయ్ అక్టోబర్ 27న మహాబలిపురంలోని ఒక రిసార్ట్‌లో కలుసుకున్నారు. కరూర్ కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల చొప్పున సాయం అందిస్తామని, గాయపడిన వారికి రూ.2 లక్షలు సాయం చేస్తామని టీవీకే పలుమార్లు ప్రకటించింది. చెప్పిన విధంగానే 39 కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున మొత్తం 7.8 కోట్లు పంపించినట్టు టీవీకే సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది. రోవైపు, తొక్కిసలాట ఘటన అనంతరం సెప్టెంబర్ 28న శాంతిభద్రతల విభాగం ఏడీజీపీ డేవిడ్సన్ మాట్లాడుతూ, సమాచారం అందిన వెంటనే సుమారు 10 అంబులెన్స్‌లను అమరావతి ఆసుపత్రి నుంచి వెంటనే రంగంలోకి దింపామన్నారు. ర్యాలీకి 10,000 మంది వస్తారని అంచనా వేసినప్పటికీ సుమారు మూడు రెట్లుగా 27,000 మంది వచ్చారని, ఏడు గంటలు ఆలస్యంగా సభావేదిక వద్దకు విజయ్ రావడం వల్లే జనం చూసేందుకు ఎగబడి తొక్కిసలాట జరిగిందని పోలీసులు ఆరోపించారు.

# 3 హాస్పిటళ్లు.. 30 మెడికల్ క్యాంపులు

- మేడారంలో వైద్య సేవల కోసం ఏర్పాటు
- జాతరకు వెళ్లే రూట్లలో మరో 42 క్యాంపులు
- 35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష



**ములుగు బ్యూరో,జనవరి10 (జనంసాక్షి) :** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

### 50 పడకల ప్రధాన హాస్పిటల్

జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### ఎనిమిది రూట్లలో క్యాంపులు

వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ (జుఅ-తీశీట్‌వ) మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ - మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### 3,199 మందితో వైద్య సైన్యం

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు.

### అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు

గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

### మందుల కొరత రాకూడదు

చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్అబశ్రీశ్రీ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

## ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వకపోతే భూపోరాటాలు

- ఉద్యమకారులతో ఆత్మీయ సమ్మేళనంలో జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ అన్నారు. ముఖ్యంగా ఉద్యమకారులకు ఇస్తానన్న 250 గజాల భూమిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాగృతి కార్యాలయంలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారులతో ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇస్తానన్న 250 గజాల స్థలం విషయంలో ఇప్పటికే కవితక్క కరీంనగర్ లో భూపోరాటం ప్రారంభించారని గుర్తు చేశారు. మిగతా జిల్లాల్లో కూడా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఉద్యమకారులు గుర్తించాలని కోరారు. తప్పకుండా కవితక్క గారు ఆయా ప్రాంతానికి వచ్చి భూపోరాటం చేసి ఉద్యమకారులకు స్థలాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటారన్నారు. అదే విధంగా ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో కవితక్క గారు చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు జరిగిన అన్యాయన్నే ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందని రూప్ సింగ్ మండిపడ్డారు. ఉద్యమకారుల సమస్యల విషయంలో రాష్ట్రంలోని అన్ని ఉద్యమకారుల సంఘాలతో కలిసి జాగృతి పనిచేస్తుందన్నారు. తెలంగాణలో ఉద్యమంలో పాల్గొని ఆగమైన యూనివర్సిటీ విద్యార్థులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఉద్యమకారులు కోరారు. తప్పకుండా వారందరికీ కవితక్క గారు అండగా ఉంటారని రూప్ సింగ్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి స్టేట్ సెక్రటరీ అనిల్ కుమార్, మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. మల్లేశ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమారస్వామి, తెలంగాణ ఉద్యమాలు - మన తెలంగాణ తొలి దశ మలి దశ ఉద్యమకారుల జేఏసీ వైస్ ప్రెసిడెంట్ సాజిదా బేగం, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు గుండా యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షురాలు భోగె పద్మ, తెలంగాణ ఉద్యమ నాయకులు కె. జానకీ రెడ్డి, కుతాడి రవికుమార్, ప్రసన్న, ధనలక్ష్మీ, వనజ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియా వైభవానికి తన వంతు కృషి

- సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

**మంచిర్యాల, జనవరి10 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఏరియా వైభవానికి తన వంతు కృషి చేస్తున్నానని సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. త్వరలో ఖైరిగూడా ఓపెన్ కాస్ట్ మూసివేతకు గురవుతుండగా అంతలోపే నూతన ప్రాజెక్టులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు. మహావీర్ ఖని ఓపెన్ కాస్ట్ ప్రతిపాదిత ప్రాంతాలను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డితో కలిసి శనివారం ఎంవీకే-1, 2, 3, 5, 6 మూసివేసిన గనుల ప్రాంతాలను, మాదారం టౌన్ షిప్, నర్సాపూర్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ ఏర్పాటుకు వస్తున్న అడ్డంకులు, అనుకూల అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన ప్రాజెక్టులతోనే ఏరియాకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఓపెన్ కాస్ట్‌ల ఏర్పాటుకు అందరూ సహకరించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలో ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని, సాధ్యమైనంతవరకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, నాణ్యమైన బొగ్గు వెలికి తీసేందుకు అందరూ సమన్వయంతో సహకరించాలన్నారు. ఈ సందర్భంగా మొదటిసారి మాదారానికి వచ్చిన డైరెక్టర్ ను నాయకులు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ కుష్ణపెల్లి లక్ష్మణ్, ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, నాయకులు పుట్ట శ్రీనివాస్, తోట శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. డైరెక్టర్ వెంట ప్రాజెక్టు మేనేజర్ మహేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

**తిరుమల, జనవరి 10 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి దర్శనం అనంతరం బయటికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని తలసాని ఆకాంక్ష వెలిబుచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశారు.

## పంజాగుట్ట ఆలయంలో బండి పూజలు

- మోడీ గోత్నామాలతో అర్చన



**హైదరాబాద్, జనవరి 10 (జనంసాక్షి) :** పంజాగుట్టలో ఉన్న శ్రీదుర్గా భవాని ఆయలంలో కొలువైన దుర్గామల్లేశ్వర స్వామిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోత్రనామాలతో ఆయన అర్చన చేయించారు. ఆలయ కమిటీ కేంద్ర మంత్రిని శాలువాతో సన్మానించింది. ఆలయంలో కొలువైన దుర్గాభవాని అమ్మవారు, మేధా దక్షిణామూర్తి స్వామిని కూడా ఆయన దర్శించుకుని పూజలు చేశారు. కేంద్ర మంత్రిని పూలమాల, శాలువాతో ఆలయ కమిటీ సత్కరించింది. సుమారు 15 నిమిషాల పాటు శ్రీదుర్గాభవాని ఆలయంలో కేంద్ర మంత్రి గడిపారు. సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి వెయ్యేళ్లు అయిన సందర్భంగా బీజేపీ పార్టీ సోమనాథ్ స్వాభిమాన్ పర్వం నిర్వహిస్తోంది. వెయ్యేళ్లు ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఆ ఆలయం ఇప్పటికీ సగర్వంగా, వైభవోపేతంగా నిలబడింది. అయితే ఆలయ పునర్ నిర్మాణం చేపట్టి 75 ఏళ్లు అవుతున్నది. 1951లో ఆ ఆలయాన్ని రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో భక్తుల కోసం తెరిచారు.

# ఉద్యోగాల పేరిట భారీ మోసం

- ముఠా గుట్టురట్టు.. పట్టుబడ్డ ప్రధాన నిందితుడు
- ఐదుగురిపై ఆదిలాబాద్ వన్ టౌన్‌లో కేసు, ముగ్గురి అరెస్ట్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఠాను శనివారం జిల్లా పోలీసులు వారి గుట్టు రట్టు చేసి అరెస్టు చేసి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సమావేశం నిర్వహించి పలు విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా ూ జట్టబోయిన మధు కిరణ్ 45 సీఈవో ఆఫ్ అనంత ఈ సొల్యూషన్ మరియు విద్యాథన్ ఆర్గనైజేషన్ సభ్యుడు, నివాసం గీరమాజీపేట వరంగల్ ప్రస్తుతం మేడిపల్లి హైదరాబాద్ ూ2 మాదాసి సుధాకర్ 48 వెంకటాపూరి గ్రామం, జఫెర్ గడ్ మండలం హనుమకొండ జిల్లా ప్రస్తుతం బోడుప్పల్, హైదరాబాద్ ూ3 నిమ్మని సతీష్ 42 కళ్యాణ్ నగర్ గోదావరిఖని. ూ4 సుజాత ఠాకూర్, హైదరాబాద్, ఇంకా ూ5 లావణ్య, అల్వాల్, హైదరాబాద్. పరారీలో ఉన్నారన్నారు. అదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన భారీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జెట్టబోయిన మధు కిరణ్ 45 , బిజినెస్ సీ ఈ ఓ అనంత ఈ సొల్యూషన్, నివాసం: గీరమాజిపేట, వరంగల్ ప్రస్తుతం మేడిపల్లి, హైదరాబాద్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు 2013లో అనంత ఈ సొల్యూషను పేరిట కంపెనీని స్థాపించి, ఔట్సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇస్తామని చెప్పేవాడని, అనంతరం 2023లో సుజాత ఠాకూర్, నామిని సతీష్, లావణ్యలతో కలిసి "విద్యాధాన్ ఆర్గనైజర్సు అనే సొసైటీని రిజిస్టర్ చేసి, కేంద్ర ప్రభుత్వ విద్యాంజలి 2.0 స్కీమ్ డబ్బులు దుర్వినియోగం చేయాలని, కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సి ఎస్ ఆర్ నిధులను కాజేయాలనే దురుద్దేశంతో, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని అబద్ధాలు చెప్పి నిరుద్యోగులను నమ్మబలికి, నకిలీ ఉద్యోగాలను వివిధ ప్రభుత్వ పాఠశాలలో మరియు కళాశాలలో వచ్చేలా చేసినట్లు విచారణలో తేలిందన్నారు.

అదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ఉమ్మడి వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో ఏజెంట్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ1,00,000 నుండి రూ. 2,50,000 వరకు వసూలు చేసి, నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వడం జరిగింది. మొత్తం వందల సంఖ్యలో నిరుద్యోగులను మోసం చేసినట్లు నిందితుడు ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఈ ముఠా రాష్ట్రవ్యాప్తంగా 240 దాదాపు మంది అభ్యర్థులను మోసం చేయడం జరిగిందని తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాలలో నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లతో ఉద్యోగాలు కల్పించి వారికి మూడు నెలలు వేతనం అందించిన తర్వాత వేతనం అందకపోయేసరికి బాధితులు వివిధ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వీరికి సహకరించిన ఏజెంట్లుగా ఉన్నటువంటి రాహుల్, కోవా విటల్ బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి లపై ఇదివరకే పల్స్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకొని ఇంకా ఎవరి పాత్ర ఉన్నదని అంశంపై విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు.

### జిల్లా ఎస్పీ విజ్ఞప్తి

ప్రజలు ఉద్యోగాల పేరుతో మోసం చేసే మూట సభ్యులను, డబ్బులు అడిగే ముఠాలను నమ్మవద్దని, అప్రమత్తతో వ్యవహరించాలని, డబ్బులతో ప్రభుత్వ ఉద్యోగాలు రావని కష్టపడి పరీక్షల ద్వారా ఉద్యోగాలను సాధించాలని తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసే వారిపై, నకిలీ ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం కఠినమైన చర్యలతో వ్యవహరిస్తుందని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్ మరియు ఐటీ కోర్ ఆర్ఎస్ఐ బి గోపికృష్ణ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్సైలు గోపికృష్ణ, నాగనాథ్, అశోక్ సిబ్బంది త్రిశూల్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, Balla Krishnaswami S/o Arjaiah, resident of H.No. 3-189, Nallakunta, Venkatapur Mandal, Mulugu District, Telangana-506345, have changed the name of my minor son from BALLA MANI S/o BALLA KRISHNA SWAMY (aged 14 years, student) to **BALLA MALLIKARJUN S/o BALLA KRISHNA SWAMY** vide affidavit dated 06-01-2026 sworn before Notary Public at Hanamkonda, Warangal District. The change is to correct wrong entry in Aadhaar Card due to parental mistake. Hence forth, he shall be known as BALLA MALLIKARJUN for all purposes.

# ఇది న్యాయవ్యవస్థ నైతిక పతనం

జనమే సాక్షి

**'నేరస్తుడుగా నిరూపించబడేవరకూ ప్రతి నిందితుడినీ నిర్దోషిగానే భావించాలి', "ట్టం ఎదుట అందరూ సమానులే", "సాధారణంగా బెయిల్, అసాధారణ స్థితిలో మాత్రమే జైలు" అనేవి భారత న్యాయ తత్వశాస్త్రంలో మౌలిక భావనలు. కాని నరేంద్ర మోడీ - అమిత్ షాల పాలనలో భారత న్యాయ వ్యవస్థ తన మార్గదర్శక మౌలిక సూత్రాలను మరిచిపోతున్నట్టున్నది. పాలకవర్గాల, పాలక పక్షాల ఒడిలో, పదవిలో ఉన్నప్పుడూ పదవీ విరమణానంతరమూ విలాసాలకూ సకల సౌకర్యాలకూ లొంగిపోతూ ప్రభుత్వాల, ప్రాసిక్యూషన్ ల మాటలనే చిలకపలుకులుగా వల్లించడమే తన బాధ్యత అనుకుంటున్నట్టుంది.**

పైన చెప్పిన మూడు సూత్రాలూ కేవలం భారత న్యాయ తత్వశాస్త్రం కనిపెట్టినవి కావు, అవి సహజ న్యాయసూత్రాలు, భారత న్యాయ వ్యవస్థకు మూలమైన బ్రిటిష్ న్యాయవ్యవస్థ కూడా ఎంతో కొంత అనుసరించిన సూత్రాలు. ఏ వ్యక్తి మీదనైనా ఎప్పుడైనా ప్రాసిక్యూషన్ ఏ ఆరోపణ అయినా చేయవచ్చు. కాని రాగద్వేషాలు లేవని చూపుకోవడానికి, ఆ ఆరోపణలను నిస్సందేహమైన సాక్ష్యాధారాలతో, చట్టం నిర్దేశించిన పద్ధతిలో నిరూపించాలని ఆ న్యాయసూత్రం చెపుతుంది. అలా నిరూపణ జరగనంతవరకూ ఆ ఆరోపణ అబద్ధమనే అనుకోవలసి ఉంటుంది. ఉమర్ ఖాలిద్, షార్జిల్ ఇమామ్ ల విషయంలోనైతే వారి మీద చేసిన ఆరోపణలు అబద్ధమని, ప్రాసిక్యూషన్ దగ్గర వాటిని నిస్సందేహంగా నిరూపించే సాక్ష్యాధారాలేవీ లేవని గడిచిన ఐదు సంవత్సరాలలో అనేకసార్లు అట్టడుగు న్యాయస్థానం నుంచి సర్వోన్నత న్యాయస్థానం దాకా తేటతెల్లమయింది. అయినా విచారణ ప్రారంభమే కాలేదు. కాని సర్వోన్నత న్యాయమూర్తులు వారిద్దరూ కీలక కుట్రదారులని ప్రాసిక్యూషన్ చెప్పిన మాటను యథతథంగా వల్లె వేశారు.

ఇదే కేసులో వారి సహ నిందితులు అయిదుగురిని బెయిల్ మీద విడుదల చేస్తూ, వీరిని వేరుగా చూడాలని, వీరే సూత్రధారులని కూడా న్యాయమూర్తులు అన్నారు. వారు సూత్రధారులని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తున్నది. ఆ ఆరోపణకు ఒక్కటంటే ఒక్క సాక్ష్యమూ ఆధారమూ లేదు. అయినా సర్వోన్నత న్యాయమూర్తులు ఆ మాటను చిలకపలుకుల్లా పునరుక్తం చేసి, అందువల్ల మిగిలిన అయిదుగురికి బెయిల్ ఇచ్చినా ఈ ఇద్దరికీ ఇవ్వడానికి వీలు లేదన్నారు. జస్టిస్ వి ఆర్ కృష్ణయ్యర్ 1977లో ఇచ్చిన ఒక తీర్పులో ఏ నిందితుడికైనా బెయిల్ సాధారణంగా ఇవ్వాలని, అసాధారణ స్థితిలో మాత్రమే బెయిల్ నిరాకరించి జైలుకు పంపాలని ఒక మౌలిక సూత్రం తయారు చేశారు. ఆ తర్వాత కాలంలో వచ్చిన క్రూరమైన చట్టాలు, మరీ ముఖ్యంగా చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) లాంటివి ఆ మౌలిక సూత్రానికి తూట్లు పొడిచి ఉండవచ్చు. కాని అయిదుగురికి వర్తించిన సూత్రం, అదే కేసులో ఇద్దరికి వర్తించకపోవడం రాజ్యాంగం అధికరణం 14 చెప్పిన చట్టం ఎదుట అందరూ సమానమే అనే సూత్రానికి వ్యతిరేకమని కూడ సర్వోన్నత న్యాయమూర్తులకు అనిపించలేదు.

ఉమర్ ఖాలిద్, షార్జిల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరణ అనేది ఈ ప్రత్యేకమైన కేసులో ఇద్దరు న్యాయమూర్తులు తీసుకున్న న్యాయ నిర్ణయం కాదు. ఇది భారత న్యాయవ్యవస్థలో జరుగుతున్న ఒక లోతైన మార్పుకు, పతనానికి ప్రతీక. కేసు విచారణ మొదలుకాకముందే, నేరం రుజువు కాకముందే, సంవత్సరాల తరబడి జైలులో ఉంచడం ఇప్పుడు "న్యాయ ప్రక్రియ"గా ప్రచారం పొందుతున్నది. ప్రక్రియే శిక్షగా మారుతున్నది. పందొమ్మిదేళ్ళ ఇలా జైలు నిర్బంధం అనుభవించి, చివరికి నేరం రుజువు కాక నిర్దోషిగా విడుదల అయినవారు కూడా ఉన్నారంటే, మన న్యాయవ్యవస్థ ఎంత మొరటుగా, అన్యాయంగా, మానవీయ స్పందనలు లేనిదిగా, కొన్ని వర్గాల నిందితుల పట్ల, ముఖ్యంగా ముస్లింల పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నదో స్పష్టమవుతుంది.

ముప్పై ఎనిమిది సంవత్సరాల ఉమర్ ఖాలిద్ ఆరు సంవత్సరాలుగా జైలులో ఉన్న జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ చరిత్ర శాఖ నుంచి డాక్టరేట్ పొందిన పరిశోధక విద్యార్థి. పౌరసత్వ సవరణ చట్టానికి, జాతీయ పౌర జాబితాకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళన సందర్భంగా దేశంలో ఎన్నో చోట్లకు తిరిగి ఉపన్యాసాలు ఇచ్చి, బహుళ జనాదరణ పొందిన విద్యార్థి నాయకుడు. ముప్పై ఏడు సంవత్సరాల షార్జిల్ ఇమామ్ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చరిత్ర పరిశోధకుడు. ఇప్పుడు ఏ ఢిల్లీ అల్లర్ల కేసులో ఆయనను నిందితుడుగా చూపుతున్నాడో, ఆ అల్లర్లు జరిగిన 2020 ఫిబ్రవరి 23-26ల్లో ఆయన జైలులోనే ఉన్నాడు. అల్లర్లు జరిగిన ప్రాంతాల్లోనే లేడు. సిఎఎ ఎన్ ఆర్ సి ఉద్యమంలో ఉపన్యాసాల కోసం ఆయనను నెల ముందే, జనవరి 28న అరెస్టు చేసి జైలుకు పంపించారు.



ఢిల్లీ అల్లర్ల కేసుల్లో విచారణ ఇప్పటివరకు పూర్తి కాలేదు. వేల పేజీల చార్జ్ షీట్లు తయారు చేశారు. వందలాది మంది సాక్షుల పేర్లు రాశారు. అనేక స్థాయిల్లో కోర్టులో ఆ సాక్ష్యాధారాలు అబద్ధాలు అనీ, కూట సృష్టి అనీ రుజువైంది. ఉమర్ ఖాలిద్ మీద ఆరోపణల్లో ప్రధానమైన సాక్ష్యంగా చెపుతున్న ఉపన్యాసం ఆయన ఢిల్లీ అల్లర్లకు ముందు, ఢిల్లీకి 1500 కిమీ దూరంలో మహారాష్ట్రలో 2020 ఫిబ్రవరి 17న ఇచ్చినది. ఆ ఉపన్యాసంలో, ప్రాసిక్యూషన్ సమర్పించిన వీడియో రికార్డ్ ఆధారం ప్రకారమే, ఆయన మహాత్మా గాంధీ ఉపయోగించిన ఆయుధాలనే సిఎఎ ఎన్ ఆర్ సి ఆందోళనలో కూడా వాడాలని అన్నాడు. ఆ ఆయుధాలు అహింస, పౌర శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ అని వివరంగా కూడా చెప్పాడు. ఆ మాటలు నేరం అనీ, కుట్ర అనీ ఆరోపించడానికి ప్రాసిక్యూషన్ కు కనీసం సిగ్గు లేదు. అది ప్రాథమికంగా (ప్రైమాఫసీ) నేరమే అని సర్వోన్నత న్యాయమూర్తులు కూడా అనడమే హాస్యాస్పదం.

ఈ ఢిల్లీ అల్లర్ల కేసులో నిందితులందరూ ఒక్కొక్కరు కొన్ని డజన్ల సార్లు బెయిల్ దరఖాస్తులు పెట్టుకొని తిరస్కరణకు గురయ్యారు. విచారణ మరింత దూరమవుతున్నది. ఇలా చూస్తే, విచారణ పూర్తయ్యేలోపు వీరు గడిపే జైలు జీవితం, నేరం రుజువైతే పడే శిక్షను కూడా మించిపోయే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది.

మరొక పక్క భారతీయ జనతా పార్టీ నాయకుడు కపిల్ మిశ్రా ఫిబ్రవరి 22-23ల్లో ఇచ్చిన ఉపన్యాసాలు, హత్యాకాండకు రెచ్చగొట్టే నినాదాలు పత్రికల్లో, టెలివిజన్ ఛానళ్లలో నమోదు అయినా, వేలాది మంది సాక్షులు ఉన్నా ఆయన మీద కేసులు లేవు. ఆయన ఇప్పుడు ఢిల్లీ మంత్రి. ఇంతకీ ఢిల్లీ అల్లర్లలో 53 మంది చనిపోగా హతులలో ముప్పాతిక భాగం ముస్లింలేనంటే దాడులు ఎవరు ఎవరి మీద చేశారో అర్థమవుతుంది. కాని ఢిల్లీ పోలీసులు, అంటే అమిత్ షా కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ కింద కింద నేరుగా పని చేసే ఢిల్లీ పోలీసులు, కేసులలో ఎక్కువభాగం ముస్లింల మీద, సిఎఎ ఎన్ ఆర్ సి ఆందోళనల్లో పాల్గొన్నవారి మీద పెట్టారు. తీవ్రవాద నేరం కింద ఢిల్లీ అల్లర్ల గురించి 18 మంది మీద కేసు పెట్టగా అందులో 16 మంది ముస్లింలే.

ఉమర్ ఖాలిద్, షార్జిల్ ఇమామ్ ల మీద జరుగుతున్నది "శిక్షకు ముందే శిక్ష", విచారణా ప్రక్రియే శిక్ష. న్యాయశాస్త్రం ప్రకారం ఇది ఎంతమాత్రమూ అంగీకారయోగ్యం కాదు. కాని నరేంద్ర మోడీ అమిత్ షా పాలనలో మొత్తం దేశమే తలకిందులుగా సాగుతున్నది గనుక కోర్టులు కూడా అంగీకరిస్తున్నాయి.

సర్వోన్నత న్యాయస్థానమే అటువంటి అన్యాయం చేస్తున్నప్పుడు కింది న్యాయస్థానాల నుంచి వచ్చిన వ్యాఖ్యల గురించి చెప్పనే అక్కర్లేదు. "ప్రాసిక్యూషన్ కథనం ప్రాథమికంగా నమ్మదగినదిగా కనిపిస్తోంది", "ఈ దశలో సాక్ష్యాలను లోతుగా పరిశీలించలేం" వంటి వ్యాఖ్యలు పదేపదే వినిపిస్తున్నాయి. అంటే నిజం ఏదో తెలుసుకోవడం కోర్టు పని కాదు అన్నట్లుగా, ప్రాసిక్యూషన్ చెప్పినదే ఎటువంటి విచారణ లేకుండా నిజమని నమ్ముతున్నట్టుగా న్యాయ తర్కం తయారైంది.

ఇంకా హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే ఉమర్ ఖాలిద్‌పై హింసకు ప్రత్యక్ష పిలుపు ఇచ్చిన ప్రసంగం లేదని ఒకవైపు ఒప్పుకుంటూనే, "విస్తృత కుట్ర" అనే అస్పష్ట పదంతో బెయిల్‌ను తిరస్కరించడం. ఈ "విస్తృత కుట్ర"కు సరిహద్దులే లేవు. ఎవరు ఇందులో ఉన్నారు? ఎలా ఉన్నారు? ఎప్పుడు చేశారు? - ఇవన్నీ కోర్టు ప్రశ్నించదు. ప్రశ్నిస్తే "విచారణ సమయంలో చూస్తాం" అంటారు. కాని విచారణ మొదలవడమే లేదు. విచారణ జరిగి కేసు కొట్టుడు పోయి, నిర్దోషిగా విడుదలయ్యేదాకా జైలులో మగ్గిపోవలసిందే.

సుప్రీం కోర్టు దశకు వచ్చేసరికి పరిస్థితి మరింత విచిత్రంగా మారింది. ఒకవైపు సుప్రీం కోర్టే "బెయిల్ సాధారణం, జైలు మినహాయింపు" అని పదేపదే చెప్పింది. మరోవైపు, ఇదే కోర్టు కిందస్థాయి కోర్టులు చేసిన బెయిల్ నిరాకరణలను సరిదిద్దడానికి వెనుకాడింది. "ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదు", "హైకోర్టులోనే చూసుకోండి" వంటి వ్యాఖ్యలతో సరిపెట్టింది. న్యాయం ఉందని చెప్పవలసిన అగ్రస్థానం, న్యాయం జరగకపోయినా చేతులు దులుపుకుంది.

షార్జిల్ ఇమామ్ విషయంలో కూడా ఇదే ద్వంద్వత్వం. ఆయనపై పెట్టిన కేసుల్లో కొన్నిటిలో ఇప్పటికే బెయిల్ వచ్చింది. కాని ఒక కేసులో బెయిల్ రాకపోవడంతో మొత్తం స్వేచ్ఛ నిరాకరించబడింది. అంటే ఒక కేసు సరిపోకపోతే మరొక కేసు. న్యాయవ్యవస్థ ఈ "కేసుల చిక్కుముడి" పద్ధతిని ప్రశ్నించకుండా అంగీకరిస్తున్నది.

ఇంకా విచిత్రంగా, రక్షిత సాక్షుల (ఊపా చట్టం కింద ఇది సాక్షులను బహిరంగపరచని ఒక దొంగ ఎత్తుగడ) సాక్ష్యాలు పూర్తయ్యాక, లేదా ఇంకొక ఏడాది తర్వాత మళ్లీ బెయిల్ దరఖాస్తు పెట్టుకోవచ్చునని సర్వోన్నత న్యాయస్థానం ఉచిత సలహా ఇచ్చింది. అంటే ఐదున్నరేళ్లు, ఆరేళ్లు జైలులో అక్రమ నిర్బంధంలో ఉన్నవారు మరొక ఏడాది అలాగే కొనసాగాలని అత్యంత అమానవీయంగా ప్రకటించింది. ఇది న్యాయ ప్రక్రియ ఆలస్యం, తాత్సారం మాత్రమే కాదు. ఇది ఆలస్యాన్ని ఆయుధంగా మార్చడం. కేసు సాగదీయడమే శిక్షగా మారుతున్నది. న్యాయస్థానాలు ఈ వాస్తవాన్ని గుర్తించకపోవడం కాదు, గుర్తించి కూడా అంగీకరించకపోవడం అసలు సమస్య.

ఇలాంటి సందర్భాల్లో న్యాయవ్యవస్థ తన చరిత్రను గుర్తుచేసుకోవాలి. అత్యవసర పరిస్థితి సమయంలో "వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కు కాదు" అని ఇచ్చిన దుర్మార్గమైన తీర్పు అవమానం న్యాయవ్యవస్థను ఎలా వెంటాడిందో, ఇప్పటి మౌనం, పతనం కూడా రేపటి చరిత్రలో అలాగే అవమానకరంగా నమోదు అవుతాయి. ఉమర్ ఖాలిద్, షార్జిల్ ఇమామ్‌లు జైలులో ఉన్నంతకాలం అది కేవలం ఇద్దరు వ్యక్తులు స్వేచ్ఛ కోల్పోవడం మాత్రమే కాదు. అది దేశ ప్రజాస్వామ్యానికి విధించిన శిక్ష. ఈ న్యాయ నమూనా కొనసాగితే, రేపు ఏ భిన్నాభిప్రాయమైనా "కుట్ర" అవుతుంది. అప్పుడు కోర్టులు చివరి ఆశ కాదు, అధికార దమన నీతికి చట్టబద్ధ ముద్ర వేసే సంస్థలుగా మాత్రమే మిగులుతాయి.



ఎన్ వేణుగోపాల్
ఎడిటర్, వీక్షణం

# మట్టి మన జీవితం
# నాగరికత నిలకడకు మౌలిక ఆధారం

మట్టి మన జీవనానికి మూలాధారం. మానవుడు భూమిపై స్థిరపడిన నాటినుంచి జీవన నిర్వహణకు అవసరమైన ఆహారం, వస్త్రం, నివాసం అన్నీ మట్టిపైనే ఆధారపడి ఉన్నాయి. భూమి ఉపరితలంపై కనిపించే పలుచని మట్టి పొర లేకపోతే పంటలు పండేవి కావు. అడవులు పెరగవు. జీవజాలం వికసించదు. అందువల్ల మట్టి లేకుండా మానవ నాగరికత ఉనికే అసాధ్యం అని చెప్పవచ్చు.

మట్టి ఒక జడ పదార్థంగా చూడడం మానవ తప్పిదం. వాస్తవానికి మట్టి జీవంతో నిండిన సహజ వ్యవస్థ. మట్టిలో సూక్ష్మ జీవులు, కీటకాలు, శిలీంద్రాలు విస్తారంగా ఉంటాయి. ఒక గ్రాము సారవంతమైన మట్టిలో కోట్ల సంఖ్యలో సూక్ష్మ జీవులు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి ఆకులు, పంట అవశేషాలు, సేంద్రీయ పదార్థాలను కుళ్లించి పోషక ద్రవ్యాలుగా మారుస్తాయి. ఈ ప్రక్రియ నిరంతరం సాగినప్పుడే మట్టి సారవంతంగా ఉంటుంది.

ప్రపంచ ఆహార ఉత్పత్తిలో సుమారు 95% మట్టిపై ఆధారపడి ఉంది. ఈ గణాంకం మట్టి ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేస్తుంది. మట్టిసార తగ్గిన ప్రాంతాలలో పంట దిగుబడి వేగంగా పడిపోతుంది. 1950 తరువాత అధిక దిగుబడుల కోసం విస్తృతంగా రసాయన ఎరువులు వాడటం ప్రారంభమైంది. దీని ఫలితంగా ప్రారంభ దశలో దిగుబడులు పెరిగినా క్రమంగా మట్టి జీవశక్తి తగ్గింది. 2000 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 33% భూములు మధ్యస్థ స్థాయి నుంచి తీవ్రమైన మట్టిక్షీణతకు గురయ్యాయి. ప్రతి సంవత్సరం సుమారు 24 బిలియన్ టన్నుల పైమట్టి కొట్టుకుపోతున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. ఈ పైమట్టి వేల సంవత్సరాల్లో ఏర్పడిన సారవంతమైన పొర. ఇది కొట్టుకుపోతే తిరిగి ఏర్పడేందుకు శతాబ్దాలు పడుతుంది. మట్టినష్టం అనేది తక్షణమే కనిపించని విపత్తు. దీని ప్రభావాలు క్రమంగా ఆహార కొరతగా మారుతాయి. చరిత్రలో నాగరికతల ఎదుగుదల మట్టితో నేరుగా ముడిపడి ఉంది. నదీ లోయలలో ఏర్పడిన ప్రాచీన నాగరికతలు మట్టిసార కారణంగా అభివృద్ధి చెందాయి. కాలక్రమంలో అధిక సాగు, నీటి దుర్వినియోగం, అడవుల నరుకుడు వల్ల మట్టిసార తగ్గింది. వ్యవసాయం బలహీనమైంది. ఆర్థిక వ్యవస్థలు కూలిపోయాయి. ఈ పరిణామాలు మట్టిసంరక్షణ ఎంత కీలకమో తెలియజేస్తాయి. మట్టి నీటి నిర్వహణలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సారవంతమైన మట్టి వర్షపు నీటిని లోపలికి గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. సేంద్రీయ పదార్థం ఎక్కువగా ఉన్న మట్టిలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం సుమారు 20% వరకు పెరుగుతుంది. ఇది కరవు పరిస్థితుల్లో పంటలను కాపాడుతుంది. మట్టి పాడైపోతే నీరు వేగంగా పారిపోతుంది. వరదలు పెరుగుతాయి. భూగర్భ జల మట్టం తగ్గుతుంది. పర్యావరణ సమతుల్యత కూడా మట్టిపై ఆధారపడి ఉంది. భూమిపై ఉన్న జీవ వైవిధ్యంలో సుమారు 25% జీవజాలం మట్టిలోనే నివసిస్తుంది. ఈ జీవజాలం పోషక చక్రాన్ని నియంత్రిస్తుంది. మొక్కల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మట్టిలో జీవ వైవిధ్యం తగ్గితే మొత్తం ప్రకృతి వ్యవస్థ బలహీనమవుతుంది.

మట్టి వాతావరణ నియంత్రణలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. భూమిపై ఉన్న కార్బన్ నిల్వల్లో మట్టి ప్రధాన భాగాన్ని కలిగి ఉంటుంది. మట్టిలో నిల్వ ఉన్న కార్బన్ పరిమాణం వాయుమండలంలో ఉన్న కార్బన్ కంటే ఎక్కువ. మట్టిసార తగ్గినప్పుడు ఈ కార్బన్ వాయుమండలంలోకి విడుదలవుతుంది. ఇది వాతావరణ మార్పులను వేగవంతం చేస్తుంది. సరైన మట్టిసంరక్షణ ద్వారా ప్రతి హెక్టారుకు సంవత్సరానికి సుమారు 0.5 నుంచి 1.5 టన్నుల కార్బన్ నిల్వ చేయవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

మానవ కార్యకలాపాలు మట్టిపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. అడవుల తొలగింపు వల్ల మట్టి రక్షణ పొర నశిస్తుంది. పరిశ్రమల వ్యర్థాలు మట్టిని విషపూరితంగా మారుస్తున్నాయి. పట్టణ విస్తరణ కారణంగా వ్యవసాయ భూములు కాంక్రీట్ అడవులుగా మారుతున్నాయి. నీటిపారుదలలో లోపాల వల్ల ఉప్పు మట్టులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 20% సాగుభూములు ఉప్పుదనం సమస్యతో బాధపడుతున్నాయి.

కలుషితమైన మట్టి మానవ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. మట్టిలోకి చేరిన భార లోహాలు పంటల ద్వారా ఆహార గొలుసులోకి ప్రవేశిస్తాయి. దీర్ఘకాలిక వినియోగం వల్ల అనేక వ్యాధులు ఏర్పడుతున్నాయి. అందువల్ల మట్టి సంరక్షణ అనేది ఆహార భద్రతతో పాటు ప్రజారోగ్య భద్రతకు కూడా సంబంధించిన అంశం. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో మట్టి కీలక పాత్ర పోషిస్తుంది. పంట మార్పిడి విధానం మట్టిలో పోషకాల సమతుల్యతను కాపాడుతుంది. సేంద్రీయ ఎరువుల వినియోగం మట్టి జీవశక్తిని పెంచుతుంది. భూమిని అధికంగా దున్నకుండా ఉండటం మట్టి నిర్మాణాన్ని కాపాడుతుంది. చెట్లు నాటడం ద్వారా మట్టి కొట్టుకుపోకుండా అడ్డుకోవచ్చు. ఈ చర్యల ద్వారా దీర్ఘకాలంలో దిగుబడులు సుమారు 20% నుంచి 60% వరకు పెరిగే అవకాశాలు



ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాలలో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మట్టిసంరక్షణకు అనుకూలంగా ఉన్నాయి. ఆధునిక విజ్ఞానంతో ఈ పద్ధతులను కలిపి అమలు చేస్తే మట్టిని దీర్ఘకాలం కాపాడుకోవచ్చు. ప్రభుత్వ విధానాలు మట్టిని పునరుత్పాదక వనరుగా కాక పరిమిత వనరుగా గుర్తించాలి. అప్పుడే సమగ్ర సంరక్షణ సాధ్యమవుతుంది.

2. ముగింపుగా చెప్పాలంటే మట్టి కేవలం భూమి ఉపరితలం కాదు. అది జీవనానికి ఆధారం. ఆహారం, నీరు, వాతావరణ సమతుల్యత, జీవ వైవిధ్యం అన్నీ మట్టితో ముడిపడి ఉన్నాయి. మట్టిని నిర్లక్ష్యం చేస్తే మానవ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. మట్టిని గౌరవించి కాపాడినప్పుడే నాగరికత నిలబడుతుంది. అందుకే మట్టి మన జీవితం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. సమగ్రంగా పరిశీలిస్తే మట్టి మానవ జీవనానికి ప్రాథమిక ఆధారం అనే సత్యం మరింత స్పష్టంగా అవగతమవుతుంది. భూమిపై జీవం ఉద్భవించిన నాటినుంచి మట్టితో జీవానికి విడదీయరాని సంబంధం కొనసాగుతోంది. ఆహారం పుట్టేది మట్టిలోనే. నీరు నిల్వయ్యేది మట్టిలోనే. జీవజాలం ఆశ్రయం పొందేది మట్టిలోనే. ఈ మౌలిక వాస్తవాన్ని విస్మరించిన ప్రతిసారి మానవ సమాజం తీవ్రమైన సంక్షోభాలను ఎదుర్కొన్నది.

చరిత్రలో అనేక నాగరికతలు శిఖరస్థాయికి చేరిన తర్వాత క్రమంగా క్షీణించాయి. ఈ క్షీణత వెనుక ప్రధాన కారణంగా మట్టిసార నాశనం కనిపిస్తుంది. వ్యవసాయం బలహీనమైతే ఆహార ఉత్పత్తి తగ్గింది. ఆహార కొరత ఏర్పడింది. సామాజిక అస్థిరత పెరిగింది. ఈ పరిణామ క్రమం మానవ చరిత్రలో ఎన్నోసార్లు పునరావృతమైంది. ఇది మట్టిని నిర్లక్ష్యం చేయడం ఎంత ప్రమాదకరమో తెలియజేస్తుంది. ఆధునిక కాలంలో మానవుడు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ఎంతో పురోగతి సాధించాడు. అయినప్పటికీ మట్టిపై ఆధారపడే జీవన సత్యాన్ని మార్చలేకపోయాడు. అధిక దిగుబడుల ఆశతో మట్టిపై చేసిన అనేక ప్రయోగాలు తాత్కాలిక లాభాలను ఇచ్చాయి. దీర్ఘకాలంలో మాత్రం మట్టి జీవశక్తి తగ్గిపోయింది. 1950 తరువాత సాగు విస్తరణ వేగంగా పెరిగింది. 2000 నాటికి ప్రపంచవ్యాప్తంగా మట్టిక్షీణత సమస్య తీవ్రమైన స్థాయికి చేరింది. ఈ కాలంలో సుమారు 33% భూములు ఉత్పాదక శక్తిని కోల్పోయాయి.

మట్టిక్షీణత ప్రభావాలు ఒక ప్రాంతానికే పరిమితం కావు. ఇవి ప్రపంచ ఆహార భద్రతపై ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ జనాభా పెరుగుతున్న కొద్దీ ఆహార అవసరాలు కూడా పెరుగుతున్నాయి. ఈ అవసరాలను తీర్చాలంటే మట్టిసారను కాపాడుకోవడం తప్పనిసరి. పైమట్టి ఏర్పడటానికి వేల సంవత్సరాలు పడుతుంటే అది కొట్టుకుపోవడానికి కొన్ని గంటలే సరిపోతున్నాయి. ఈ అసమతుల్యత మానవ భవిష్యత్తుకు హెచ్చరికగా నిలుస్తోంది. మట్టి వాతావరణ మార్పులతో కూడా గాఢంగా అనుసంధానమై ఉంది. మట్టిలో నిల్వ ఉన్న కార్బన్ పరిమాణం వాయుమండలంలో ఉన్నదానికంటే ఎక్కువ. మట్టిని కాపాడితే ఈ కార్బన్ భూమిలోనే నిల్వ ఉంటుంది. మట్టిని నాశనం చేస్తే అదే కార్బన్ వాయుమండలంలోకి విడుదలవుతుంది. ఇది ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమవుతుంది. అందువల్ల మట్టిసంరక్షణ వాతావరణ స్థిరత్వానికి కూడా కీలకంగా మారింది. నీటి భద్రత విషయంలో కూడా మట్టిపాత్ర అత్యంత ప్రాముఖ్యమైనది. సారవంతమైన మట్టి వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో మొక్కలకు అందిస్తుంది. సేంద్రీయ పదార్థం అధికంగా ఉన్న మట్టి కరవు పరిస్థితులను తట్టుకునే శక్తిని కలిగి ఉంటుంది. మట్టిసార తగ్గిన ప్రాంతాలలో వరదలు తరచుగా సంభవిస్తున్నాయి. భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. ఈ సమస్యలు మట్టిని రక్షించకుండా పరిష్కరించలేము. పర్యావరణ సమతుల్యతకు మట్టి ఆధారం. భూమిపై ఉన్న జీవ వైవిధ్యంలో సుమారు 25% మట్టిలోనే నివసిస్తుంది. ఈ జీవజాలం లేకుండా పోషక చక్రం సాగదు. మొక్కల ఆరోగ్యం దెబ్బతింటుంది. పంటలపై వ్యాధుల ప్రభావం పెరుగుతుంది. చివరికి మానవ ఆహార వ్యవస్థ బలహీనమవుతుంది. కాబట్టి మట్టిని కాపాడటం అంటే మొత్తం జీవవ్యవస్థను కాపాడటమే.

మానవ ఆరోగ్యంతో కూడా మట్టికి గాఢమైన సంబంధం ఉంది. కలుషితమైన మట్టిలో పండిన ఆహారం ద్వారా విషపదార్థాలు మానవ శరీరంలోకి చేరుతున్నాయి. దీర్ఘకాలంలో ఇది అనేక వ్యాధులకు కారణమవుతోంది. ఆహార భద్రత అనేది కేవలం ఉత్పత్తి పరిమాణానికి సంబంధించిన అంశం కాదు. అది మట్టిశుద్ధితో ముడిపడి ఉన్న అంశం. శుద్ధమైన మట్టి ఉన్నప్పుడే శుద్ధమైన ఆహారం లభిస్తుంది. భవిష్యత్తు తరాల జీవన భద్రత కోసం మట్టిని కాపాడటం మానవ బాధ్యత. ఇది కేవలం రైతుల బాధ్యతగా చూడకూడదు. సమాజంలోని ప్రతి వ్యక్తి పాత్ర ఇందులో ఉంది. వినియోగపు అలవాట్లు, ఆహార ఎంపికలు, పర్యావరణంపై చూపే దృష్టి మట్టిసంరక్షణపై ప్రభావం చూపుతాయి. ప్రభుత్వ విధానాలు మట్టిని పరిమిత వనరుగా గుర్తించి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. సంప్రదాయ జ్ఞానం మట్టిసంరక్షణలో అమూల్యమైనది. తరతరాలుగా రైతులు అనుసరించిన పద్ధతులు ప్రకృతితో అనుసంధానమై ఉన్నాయి. ఆధునిక విజ్ఞానంతో ఈ జ్ఞానాన్ని సమన్వయం చేసినప్పుడు స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుంది. పంట మార్పిడి, సేంద్రీయ పదార్థాల వినియోగం, చెట్ల సంరక్షణ వంటి చర్యలు మట్టికి జీవాన్ని తిరిగి ఇస్తాయి.

మానవుడు ప్రకృతికి అధిపతి అనే భావన నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. మట్టి మన ఆధీనంలో ఉన్న వనరు కాదు. అది మన జీవనానికి ఆధారం. ఈ అవగాహన సమాజంలో విస్తరించినప్పుడే మట్టిసంరక్షణ ఉద్యమంగా మారుతుంది. ఉద్యమంగా మారినప్పుడే దీర్ఘకాలిక మార్పు సాధ్యమవుతుంది. ఒక విషయం స్పష్టంగా చెప్పవచ్చు. మట్టిని కాపాడితే జీవితం నిలబడుతుంది. మట్టిని నాశనం చేస్తే నాగరికతే కూలిపోతుంది. ఆహారం, నీరు, వాతావరణ స్థిరత్వం, జీవ వైవిధ్యం అన్నీ మట్టిపై ఆధారపడి ఉన్నాయి. ఈ సత్యాన్ని అంగీకరించి ఆచరణలో పెట్టినప్పుడే మానవ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. అందుకే మట్టి కేవలం భూమి కాదు. మట్టి మన జీవితం అనే మాట శాస్త్రీయ సత్యంగా నిలుస్తుంది.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ప్రజల మనిషి ఫజల్ రెహమాన్



పాత్రికేయ మిత్రుడు, ప్రతిపక్షం పత్రిక సంపాదకులు మహమ్మద్ ఫజల్ రెహమాన్ మరణం తీరనిలోటు. ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను వాస్తవ దృష్టి కోణంలో వ్యక్తికరిస్తున్న పత్రిక ప్రతిపక్షం. ఇటీవల బీసీ ఉద్యమం, దళిత, బహుజనుల సమస్యలపై నేను రాసిన అనేక ఆర్టికల్స్ తమ పత్రిక వేదిక ద్వారా ప్రచురించారు. అట్టడుగు అణగారిన వర్గాలకోసం పోరాడిన అజ్ఞాత హీరోలుగా మిగిలిన అనేకమంది మహనీయుల పోరాటాలపై నేను రాసిన వ్యాసాలను ప్రచురించి బహుజన వారసత్వ చైతన్యానికి ఆయువై నిలిచారు. ఈ విషయాలపై నేను రాసిన పలు ఆర్టికల్ పై రెహమాన్ గారు సామాజిక న్యాయ పోరాటాలకు మద్దతునివ్వాల్సిన ఆవశ్యకతను ఇటీవల నాతో మాట్లాడుతూరు. తన అనారోగ్య సమస్యను కూడా పంచుకున్నారు. డాక్టర్ విశారదన్ మహారాజ్, ఐఏఎస్ టీ చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి పోరాట అవసరాన్ని నొక్కి చెప్పారు. నేను రాస్తున్న పూలే, అంబేద్కర్ హక్కుల ఉద్యమాలు, దళిత , బహుజనుల పోరాట వీరుల గాథలు నేటికీ అవసరమని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ కు చెందిన రెహమాన్ గారు అనేక పత్రికలలో జర్నలిస్టుగా సేవలందించారు. ఈ పోరు గడ్డపై అణచివేయబడిన వర్గాల స్వరమైనాడు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో డబ్బు, అధికారంతో ఆధిపత్య కులాలు రాజకీయాలను ప్రతిపక్షమై ప్రశ్నించాడు. 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీ కులాల హక్కుల అణచివేతపై తన పత్రిక ద్వారా అభిముఖ పోరాటం చేశాడు. అసమాన సమాజంలో సమానత్వ సాధనకై నిలిచిన ప్రజాస్వామ్యక వాది. సాంప్రదాయ ఆధిపత్యం బావాజాల పత్రికలకు భిన్నంగా పీడిత వర్గాల పక్షాన నిలిచిన మహమ్మద్ ఫజల్ రెహమాన్ గారికి బాధతప్త హృదయాలతో అక్షర నివాలి. ఆయన కోరుకొన్న సమానత్వం, సామాజిక న్యాయం కొరకై ప్రతిపక్షం ప్రజల పక్షాన అక్షర గొంతుకై నిలవాలని, బాధ్యతాయుతంగా మెదులుతూ, విశ్వసనీయతను చాటుకోవాలని ఆశిస్తూ...



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7989579428

## స్థిత ప్రజ్ఞుడు

నీతికి నిర్వచనం లాల్ బహదూర్
జాతికి రత్నం శాస్త్రి
శాస్త్రి కులం కాదు
కష్టపడి చదివి సాధించిన పట్టా..
నిస్వార్థ స్వభావి నిరుపేద
కుటుంబం
భరతమాత కన్న
ఆణిముత్యం
మితభాషి ఆచరణల ఋషి
మతసామరస్య లౌకిక
శేముషి
పొట్టివాడే కాదు
కార్యదక్షతలో గట్టి వాడు
ప్రపంచం మెచ్చిన వాడు
తాష్కెంట్ ఒప్పంద ధీరుడు
సంధి కూర్చి అస్తమించాడు

దేశానికి వెన్నెముకలు //జై జువాన్
జై కిసాన్//
సందేశమిచ్చిన ఘనుడు
నిత్య నూతన ఉవాచకుడు
నిజమైన నాయకుడు మచ్చలేని
సూర్యుడు
చిరునగవుల చంద్రుడు ప్రేమరథ
సారథుడు
వీరుడు చతురుడు
అజాత శత్రువు అందరికిమిత్రువు
ధనానికి లొంగని వాడు ధర్మాన్ని
వీడని ఇనుడు
ధర్మపత్ని లలితా శాస్త్రి ఆర్యుడు
అకుంఠిత దీక్షా తత్పరుడు
వసుదైక కుటుంబ రక్షకుడు
నెహ్రూ నచ్చిన హితుడు
ప్రజల మనము దోచిన
పురుషోత్తముడు
గాంధీ , శాస్త్రి ఇరువురి
జయంతులు
భరతమాత ప్రసాదించిన పసిడి
వెలుగులు
భారతదేశ నిజ పాలకుడు
పాలితుల సేవకుడు
స్థిత ప్రజ్ఞుడికి నివాళులు

నమిలకొండ నాగేశ్వర్ రావు
మేడ్చల్
8688553470

# క్రమశిక్షణతో కూడిన విద్య వేద విద్య

• చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**మొయినాబాద్, జనవరి 10 (జనంసాక్షి) :** వేద పాఠశాలతో విద్యార్థులు వేధ విజ్ఞానంతో పాటు కంప్యూటర్ విద్య, ఇంగ్లీష్ బోధన నేర్చుకోవడం ఆదర్శనీయమని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ ఎస్పి స్నేహ మెహూలు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూ పరిధిలో గల జేబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గాయత్రీ వేధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాయత్రీ సంస్కృతిక వేధ విద్యాలయం సేవా సధన్ విద్యా కార్యాలయాన్ని చైర్మన్ పురుషోత్తం లాలా ఆధ్వర్యంలో వేధ పాఠశాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధులుగా ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ ఎస్పి స్నేహ మొహులు పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించి. వేధ పాఠశాలలో చేరిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. వేధ పాఠశాలలో చదివే విద్యార్థులకు వేధాలు పల్లించడంతో పాటు వేధాల విజ్ఞాన విధానం పెంపొందుతుందని అందులో భక్తి భావన కలిగి ఉంటుందని, క్రమ శిక్షణతో కూడిన వేధ విద్యా అని సూచించారు. వేధం బుద్ధితో కూడిన విజ్ఞానం అని అన్నారు. వేధ పాఠశాలలో కేవలం విద్యా విజ్ఞానమే కాకుండా ఆరోగ్యానికి సంబంధించిన వ్యాయామ కార్యక్రమాలతో పాటు క్రమ శిక్షణ నేర్పించడం జరుగుతుందన్నారు. వేధ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్న చైర్మన్ పురుషోత్తం లాలా, కమిటి సభ్యులను అభినందించారు. గాయత్రీ మాత దేవాలయ ఆవరణలో వేధ పాఠశాల ప్రారంభం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నరు. ఈ పాఠశాలలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందని వేధ పాఠశాల చైర్మన్ పురుషోత్తం లాలా అన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు విజ్ఞానవంతులుగా తీర్చిదిదడమే తన లక్ష్యమన్నారు. అనంతరం చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్వామినాథ్ దేవాలయాలన్ని కూల్చివేసి వెయ్యి వంద సంవత్సరాలు గడించిందని స్వామినాథ్ దేవాలయాన్ని ప్రస్తుతం నరేంద్రమోడీ ఈ రోజు శనివారం పూజలు నిర్వహించి దేవాలయ నిర్మాణానికి వేధపండితులతో పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం వేధ పాఠశాలలో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేధ పాఠశాల చైర్మన్ పురుషోత్తం లాలా, కమిటీ సభ్యులు సురేందర్ సింగ్ చౌదరి, పండిత్ రితేష్ శర్మ, ప్రదీప్తిరెడ్డి, హరిగోవింద్ ప్రసాద్, సంజయ్ అగర్వాల్, ఆశిష్ శర్మ, అక్షయ్ శర్మ, కమిటీ సభ్యులతో పాటు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కంజర్ల ప్రకాష్, గోపాల్ రెడ్డి, మోర నర్సింహ్మారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్ లు ఎల్లని వెంకటేష్ గౌడ్, మాణిక్యం, అంజన్ కుమార్ గౌడ్, రత్నం, చంద్రశేఖర్ రెడ్డి, అత్తపురం శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సీఎం సహాయనిధి పేదలకు గొప్ప వరం

• కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి




**నిజాంపేట్, జనవరి 10 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ పరిధిలోని మధుర నగర్ కు చెందిన సి. రాజ్య లక్ష్మ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేక కుటుంబ సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,00,000/-ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 2,00,000/- (రెండు లక్షల రూపాయలు ) ఈ మేరకు శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి- మంజూరి పత్రాలను బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదిరెడ్డి కి లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు, ప్రశాంత్ రెడ్డి, కొలన్ విక్రమ్ రెడ్డి, నవీన్ కుమార్, రాజ్ సుర పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్-అత్తాపూర్ సర్కిళ్ల విలీనం వద్దు

**రాజేంద్రనగర్, జనవరి 10 (జనంసాక్షి) :** జిహెచ్ఎంసి డివిజన్ల డీలిమిటేషన్ ప్రక్రియలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను ప్రస్తుతం ఉన్న సైబరాబాద్ కమిషనరేట్‌లోనే ఉంచాలని, హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం డైరీ ఫార్మ్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ రాజేంద్రనగర్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది. సర్కిళ్లను జిహెచ్ఎంసిలో కలిపితే రాజేంద్రనగర్ నియోజకవర్గం అస్తిత్వం కోల్పోయి రాజకీయ, అభివృద్ధి, ఆర్థిక నష్టాలు చవిచూడాల్సి వస్తుందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా నిలబడి నియోజకవర్గాన్ని కాపాడుకోవాలని కార్తీక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు పాల్గొని విలీనానికి వ్యతిరేకంగా ఘాటైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చివరికి రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను హైదరాబాద్‌లో విలీనం చేయవద్దని స్పష్టమైన తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పుస్తకాల నర్సింగ్ రావు, చలసాని విష్ణుమూర్తి, నర్సింహ రెడ్డి, ఎస్. వెంకటేష్, సుభాన్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, రాజు, నయీం, గుంటి రాజ కుమార్, మగని శివ, శ్రీధర్, ఎండి ముక్రం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లి అభివృద్ధే ధ్యేయం



**కొమురవెల్లి, జనవరి 10 (జనం సాక్షి) :** కొమురవెల్లి మండలకేంద్రంను మరింత అభివృద్ధి చేసుకుందామని జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. కొమురవెల్లి సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వాడ వాడ తిరుగుతూ గ్రామలో వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరించుకుందామని గ్రామానికి సరిపడా నిధులు కూడా త్వరలోనే మంజూరు చేపిస్తానని అన్నారు. ఈసారి కొమురవెల్లి గ్రామం యువతకు సర్పంచిగా పట్టం కట్టిందని అన్నారు. కొమురవెల్లి గాంధీ దగ్గర మురికి కాలువ సమస్యను సంబంధిత అధికారులకు చెప్పి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధానంగా సిసి రోడ్లు త్వరలోనే మంజూరు చేయిస్తామని కొమురవెల్లి గ్రామ ముఖ చిత్రాన్ని మారుద్దామని అన్నారు. నూతనంగా గెలిచిన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ను పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. క్రికెటర్లతో కరాచలనం చేసి యువకులను ప్రోత్సహించాడు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిద్దప్ప, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షలు గిసా బిక్షపతి, బి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి,కొమురవెల్లి గ్రామ ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, వార్డు మెంబర్లు గజ్జె వెంకటేష్,సార్ల నవనీత, గజ్జె లావణ్య, అశోక్,మహాదేవుని శశిధర్, కడమంచి మల్లేశం, పలు గ్రామల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సిరి ఎంక్లేవ్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**నిజాంపేట్, జనవరి 10 (జనంసాక్షి) :** జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి "సిరి ఎంక్లేమ లో శనివారం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని కమ్యూనిటీ హాల్, పార్కు అభివృద్ధితో పాటు కాలనీకి అనుకోని ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతున్న అక్రమ డంపింగ్ పై కాలనీ వాసులు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలోని పార్కు తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఖాళీ స్థలంలో అక్రమ చెత్త డంపింగ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే అక్రమంగా చెత్త డంపింగ్ కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరి ఎంక్లేవ్ అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షులు రవి, జనరల్ సెక్రటరీ మధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విఘ్నేష్ రెడ్డి, ట్రెజరర్ ప్రతీక్, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు పెద్దిరెడ్డి సుజాత,రాఘవేంద్రరావు, రవి కిరణ్,జ్యోతి నర్సింహా రెడ్డి, కోలన్ మీనా సునీల్ రెడ్డి, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు బిక్షపతి, సాంబశివరెడ్డి, మల్లేష్, ముత్యాలు, జస్వంత్, ప్రవీణ్, బొబ్బ శ్రీనివాస్, సతీష్ రెడ్డి, విద్య సాగర్, ఎండీ.సలీం, స్వామి,యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బి డివిజన్ కార్యాలయాన్ని చేవెళ్లలో ఏర్పాటు చేయాలి



**చేవెళ్ల, జనవరి 10 (జనంసాక్షి) :** చేవెళ్ల డివిజన్ కార్యాలయాన్ని చేవెళ్ల పట్టణంలోనే ఏర్పాటు చేయాలని భాజపా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాండురంగా రెడ్డి డిమాండ్ చేశారు. చేవెళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...ఆర్అండ్‌బి (రోడ్లు,భవనాలు) చేవెళ్ల డివిజన్‌కు సంబంధించిన ఆర్అండ్‌బి కార్యాలయం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కొనసాగుతుండటంతో స్థానిక ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. చేవెళ్లలో డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రెండేళ్ల క్రితమే రూ.4.50 కోట్లను మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా చేవెళ్లలోని ఆర్అండ్‌బి అతిథిగృహం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో దాని స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు మరో రూ.4.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినా, ఆ పనులు కూడా చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మొత్తంగా రూ.9 కోట్ల నిధులు మంజూరై ఉన్నప్పటికీ అవి వృథగా పడివుండటం ప్రజాధనానికి అన్యాయమన్నారు. నిధులు ఉన్నా ఎందుకు పనులు ప్రారంభించడం లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆర్ అండ్ బి డివిజన్ కార్యాలయం, అతిథిగృహ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించాలని భాజపా తరఫున కోరుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్, చందు, శ్రీకాంత్ రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ జాతీయస్థాయిలో రాణించాలి



**తాండూరు, జనవరి 10 (జనంసాక్షి) :** శ్రీలక్ష్మీ జాతీయస్థాయిలో రాణించాలని ఆర్బిఓఎల్ సీఈఓ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి నివాసంలో అండర్--14 జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన అక్షర స్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థిని శ్రీలక్ష్మీ కులకర్ణిని తాండూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహిస్తూ ఉత్తమ ఆట ప్రదర్శించి అండర్--14 టీమ్ ఇండియాలో స్థానం సంపాదించాలని ఆకాంక్షంచారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీకి శిక్షణ అందించిన కోచ్‌లు పి. రవీందర్ రెడ్డి, గోపాల్‌లను కూడా బిఎస్ఆర్ ఘనంగా అభినందించి వారి సేవలను ప్రశంసించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొంటూ, ఇలాంటి విజయాలు మన ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. అదే విధంగా శ్రీలక్ష్మీకి ప్రోత్సాహంగా బిఎస్ఆర్ కొంత ఆర్థిక సహాయాన్ని అందజేయడంతో పాటు, భవిష్యత్తులోనూ అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని కోచ్‌లు మరియు పాఠశాల సిబ్బందికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్షర స్కూల్ ప్రిన్సిపల్ మోహన్ కృష్ణ గౌడ్ ప్రవీణ్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## విద్యతో పాటు భారతీయ సంస్కృతి విలువలే లక్ష్యం

• డైరెక్టర్ శశిపాల్ రెడ్డి




**చేవెళ్ల, జనవరి 10 (జనంసాక్షి) :** విద్యతో పాటు భారతీయ సంస్కృతి విలువలే లక్ష్యమని డైరెక్టర్ సంస్కృతి పాఠశాల శశిపాల్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామేన వార్డులో ఉన్న సంస్కృతి పాఠశాలలో శనివారం ప్రిన్సిపల్ రెహనా సమక్షంలో సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. భోగిమంటలు, పాలు పొంగించడం ద్వారా పండుగ ఆధ్యాత్మికతను విద్యార్థులకు వివరించారు. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మల అలంకరణతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. గాలిపటాల ఎగరవేత పోటీ ఉత్సాహాన్ని పెంచింది. ఈ సందర్భంగా డైరెక్టర్ శశిపాల్ రెడ్డి మాట్లాడుతూ...విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆర్కా గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా పతంగోత్సవం



**బోడుప్పల్, జనవరి 10 (జనంసాక్షి) :** భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఉప్పల్‌లోని ఆర్కా గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం పతంగోత్సవం పేరిట సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పతంగోత్సవ కార్యక్రమం ఉదయం ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పన్నూరు ప్రభాకర్ భోగి మంటలను వెలిగించి భోగిమంటలతో ప్రారంభమై విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు,గాలిపటాల పోటీల వరకు కొనసాగింది. గంగిరెద్దుల విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినీ-విద్యార్థులు తాము స్వయంగా తయారు చేసిన సంప్రదాయ ఆహార పదార్థాలను స్టాల్స్‌లో విక్రయించారు. అనంతరం కార్యక్రమాలను తిలకించడంతో పాటు గాలిపటాల పోటీల ప్రారంభోత్సవంలో స్వయంగా గాలిపటం ఎగరేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ భవాని,సీనియర్ కోఆర్డినేటర్ విజయ్,అలాగే ఉపాధ్యాయుల కృషి కీలకమని ప్రిన్సిపాల్ ప్రశంసించారు. పాఠశాల ఆవరణలో నెలకొన్న ఉత్సాహభరితాన్ని పాఠశాల చైర్మన్ మాగంటి నరసింహమూర్తి ఆనందం వ్యక్తపరిచారు.

## శంషాబాద్-రాజేంద్రనగర్‌ను సైబరాబాద్‌లో విలీనం చేయాలి



**రాజేంద్రనగర్, జనవరి 10 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లను హైదరాబాద్ పరిధిలో కాకుండా సైబరాబాద్‌లో విలీనం చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ భాజపా కార్యాలయంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లో సగం ప్రాంతాలు సైబరాబాద్ కమిషనరేట్‌లో, మిగిలిన ప్రాంతాలు హైదరాబాద్ కమిషనరేట్‌లో ఉండటంతో పోలీసింగ్, ట్రాఫిక్, అనుమతుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. శంషాబాద్, రాజేంద్రనగర్‌ను పూర్తిగా సైబరాబాద్ పరిధిలోకి తీసుకువస్తే మెరుగైన భద్రత, వేగవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, ఎన్. మల్లారెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, బుర్ర మహాలింగం గౌడ్, కోరాని సదానంద్, మొండ్రా కోమరయ్య తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవ చేస్తా..

• మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు




**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 10 (జనం సాక్షి) :** ప్రాణం ఉన్నంతవరకు ప్రజా సేవ చేస్తా అని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మనసున్న మహారాజు దళపతి డైనమిక్ లీడర్ మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు 60 వ జన్మదిన వేడుకలు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ తోడుపునూరి చంద్ర పాల్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణ ములోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ములో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు సంబరలు జరుపుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్ మాట్లాడుతూ పేదల పెన్నిధి నలుగురి మంచి కోరే నాయకుడు నిత్యం ప్రజల శ్రేయస్సు కోరే నాయకులుఅనీ అన్నారు. మెదక్ పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిట్లం చెరువు కట్ట పై వున్నా దర్గాలొ సార్వ మత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ స్టేడియం నుండి మైనంపల్లి హనుమంతరావు స్వగ్రామం కొరివి పల్లి వరకు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు అంగ రంగ వైభవంగా జరిగింది. మెదక్ నుండి కొరివి పల్లి వరకు భారీ ద్వి చక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వేద పండితులు,పాస్టర్లు, సర్వమత ప్రార్థనల చేసి మైనంపల్లి హనుమంత్ రావుకు ఆశీర్వచనం అంద చేశారు..హనుమంత్ రావు తనయుడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,వారి కుటుంబ సభ్యులు,10 వేల మంది అభిమానులు మధ్య 60 కిలోల కేకు కోసి జన్మ దిన వేడుకలు జరుపుకున్నారు. డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మహేందర్ రెడ్డి మెదక్ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఆవుల గోపాల్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి చౌదరి సుప్రభాతరావు పలువు నేతలు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి

**• డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్**




**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 10 (జనం సాక్షి) :** దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 2005లో యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొస్తే ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో మార్పులు తీసుకొచ్చి ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన ఎన్నో చట్టాలను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. కోవిడ్ సమయంలో ఈ ఉపాధిహామీ పథకం కోట్లాదిమందికి అండగా నిలిచిందన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల గతంలో ప్రజలకు ఏడాదికి 100 రోజుల పని హక్కు ఉండేదని, ఇప్పుడు వీబీజీ రామ్ జీ చట్టం వల్ల కేంద్ర ప్రభుత్వం నోటిపై చేసి బడ్జెట్ కేటాయిస్తేనే ప్రజలకు పని లభిస్తుందన్నారు. ఇప్పుడు ఈ చట్టం కింద కేంద్రం ఎంపిక చేసిన పంచాయతీల్లో మాత్రమే పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు పనులు గ్రామసభ నిర్ణయంపై కాకుండా ఢిల్లీ నిర్ణయంపై ఆధారపడి ఉంటాయని అన్నారు. ఉపాధిహామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 30 వరకు జిల్లాలోని 423 గ్రామాల్లో పర్యటించి ఈ చట్టాన్ని యాదివిదిగా అమలు చేసేలా గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు మహాత్మాగాంధీ జాతీయ ఉపాది హామీ చట్టంలో జరుగుతున్న అన్యాయం గురించి ప్రజలకు తెలియజేయడానికి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలో పర్యటనలు. చేస్తారని, అందులో భాగంగా వచ్చే నెల 8న లక్షమందితో మహబూబ్నగర్ నుంచే సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీజీ ఎంఎఫ్ సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, నాయకులు చంద్రకుమార్ గౌడ్, వినోద్ మార్, ఎన్ పీ.వెంకటేశ్, దుష్యంత్ రెడ్డి, లింగం నాయక్, సీజే బెనహర్, సాయి బాబా, రాములు యాదవ్, రాజేందర్ రెడ్డి, అజ్మత్‌అలీ, ఫయాజ్, శేఖర్ నాయక్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాల ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, జనవరి 10 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ శనివారం నాడు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాల ఉద్యోగుల సంక్షమ సంఘం నాగర్ కర్నూలు జిల్లా వారి 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను క్యాంప్ ఆఫీసులో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యోగులు నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు మంచి సేవలు చేసి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమణారావు, స్థానిక మాజీ కౌన్సిలర్ జక్క రాజకుమార్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమం మాల ఉద్యోగుల సంక్షమ సంఘం జిల్లా అధ్యక్షులు కూన గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి తగిలి వెంకటపతి, కోశాధికారి కోటేశ్వర్, సీనియర్ సభ్యులు కూన శంకరయ్య, ఎమ్మెల్యే ను మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావుని పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల విద్య సంక్షమం సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కందూరి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి మునగాల కురుమయ్య, సామ రమేష్, అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ అధ్యక్షులు తలారి మద్దిలేటి, మాల విద్యా సంక్షమ సొసైటీ జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీనివాసులు, గడ్డం బాలరాజు, గాజుల బాలరాజు, గాజుల సురేష్, గాజుల చెన్నయ్య, కూనకుర్మయ్య, జయన్న, రమేష్, విఆర్ఓ రాములు, లైన్మెన్ శ్రీను, పి ఈ టి యాదయ్య, ఉపాధ్యాయులు శివకుమార్, నరసింహ, జూనియర్ లెక్చరర్ రాములు తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## సిపిఐ శతవసంతాలను విజయవంతం చేయాలి

**• సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్ దశరథ్**



**కొండాపూర్, జనవరి 10 (జనం సాక్షి) :** సిపిఐ పార్టీ శతవసంతాల ముగింపు ఉత్సవాలను ఈనెల 18న ఖమ్మంలో నిర్వహిస్తున్నారని సంగారెడ్డి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చి శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్. దశరథ్ కోరారు. శనివారం సంగారెడ్డి గంజి మైదానంలోని గాంధీ విగ్రహం ముందు సిపిఐ శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను సిపిఐ నేతలతో కలిసి సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.దశరథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి సిహెచ్. దశరథ్ మాట్లాడుతూ 1925 సంవత్సరంలో భారతదేశంలో సిపిఐ పార్టీ ఆవిర్భవించింది అన్నారు. దేశ స్వాతంత్రం కోసం సిపిఐ నేతలు ఎన్నో ఉద్యమాలు త్యాగాలు చేశారని పేర్కొన్నారు. ఆనాటి నుండి నేటి వరకు పేద మధ్యతరగతి ప్రజల కోసం ప్రజా వ్యతిరేక విజ్ఞానాలపై ఎప్పటికప్పుడు అనేక పోరాటాలను చేస్తూ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పేద ప్రజల సమస్యలను పరిష్కరించిన ఘనత సిపిఐ దన్నారు. సిపిఐ శతవసంతాల సభకు సంగారెడ్డి జిల్లాలోని సిపిఐ నాయకులు కార్యకర్తలు అనుబంధం సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, సిపిఐ నాయకులు బాలరాజ్ రవికాంత్, అజీమ్, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే శారీరక, మానసిక ఉల్లాసం

**• ప్రిన్సిపల్ రామకృష్ణ**

**నారాయణపేట, జనవరి 10 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక శారీరక ఉత్సాహం కలిగిస్తాయని నారాయణపేట సాయి కోఆపరేటివ్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వివేక్ ఉత్సవ పేరిట శ్రీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులకు స్థానిక కళాశాల మైదా నంలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడలు ప్రారంభించిన ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లా దుతూ క్రీడలు విద్యార్థులకు శారీరక మానసిక ఉల్లాసాన్ని స్తాయని అన్నారు. ఆరోగ్య వంతమైన శరీరము ఆరోగ్యవంతమైన మనసును కలిగి ఉంటుందని అన్నారు. అలాంటి విద్యార్థులే విద్యా రంగంలో ఎలాంటి సవాలనైనా ఎదుర్కొంటారని అన్నారు. ప్రతి సంవత్సరము ఉమ్మడి జిల్లాలో ఏ జూనియర్ కళాశాల నిర్వహించని విధంగా విద్యార్థుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు. క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఈరోజు క్రీడా మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా ఇండోర్ గేమ్స్ క్యారమ్స్, చెస్, రంగోలి వినోదభరితమైన క్రీడలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడలలో అమ్మాయిలు, అబ్బాయిలు వేరు వేరుగా ఉత్సాహంగా పాల్గొని ఆనందంతో పరవశించారు. కబడ్డీలో బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న భానుప్రియ టీం, మొదటిస్థానంలో ఎమ్. పి సి. ద్వితీయ సంవత్సరము నమ్రత టీం ద్వితీయ స్థానంలోనిలిచింది. అబ్బాయిల విభాగంలో శ్రీకాంత్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల టీం, అకిరా నందన్ సిఇసి మొదటి సంవత్సరం టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఖోఖో విభాగంలో బాలికల విభాగంలో భానుప్రియ టీం ఐశ్వర్య టీంలు అబ్బాయిల విభాగంలో కళ్యాణ్ టీం మొదటి స్థానంలో అచ్యుత్ టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు వై జనార్ధన్ రెడ్డి, శంకర్, శశికుమార్, రఘుపతి రెడ్డి,గరిడి రఘుప తి,వ్యాయామ ఉపాధ్యాయు లు రమణ,లక్ష్మ,హారిక సాదిక్,రవి,అజయ్ కళాశాల బృందం రాజు, రాయుడు, రవిబాబు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



## సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి హిందూ కృషి చేయాలి

**• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య**



**మక్తల్, జనవరి 10 (జనంసాక్షి) :** ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమన తలయం పై 1026వ సంవత్సరంలో గజిని మహమ్మద్ దాడి చేసిన దుర్ఘటన నేటికీ 1000 సంవత్సరాలు గడిచిన సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు దేశంలో ప్రతి హిందూ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలనే పిలుపులో భాగంగా శనివారం మక్తల్ పట్టణ కేంద్రంలో ఉమామహేశ్వరాలయంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన బి.కొండయ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.కొండయ్య మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను వినాశనానికి గజినీ మహమ్మద్ సోమనాథ్ ఆలయం పై దాడి చేసి మన హిందూ వారసత్వంగా వచ్చే ఖనిజ సంపదను దోచుకొని హిందూ మందిరాలను కొల్లగొట్టే సంస్కృతిని ప్రతి హిందూ ఏకకంఠంతో ఖండించి చీకటి రోజుగా గుర్తించాలని అలాగే ఇకపై భవిష్యత్తులో హిందూ దేవాలయాలపై దాడులకు పాడుపడితే సహించేది లేదని హిందూ యువత చూస్తూ ఊరుకోరని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కర్ని స్వామీ, బాల్చేడ్ మల్లికార్జున్, కల్లూరి నాగప్ప, నర్సింహా రెడ్డి, ప్రసన్న బలరాం రెడ్డి, పూల శ్రీను, మండల అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, టౌన్ జనరల్ సెక్రటరీ లు నరేందర్, కుర్వ లింగం, బీజేవైఎం నాయకులు మహేష్ సాగర్, చీరాల రామాధవ్, పికె.నరసింహ, మంజునాథ్, రాజగౌడ్, బ్యాటరీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్స్‌కు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి



**మక్తల్, జనవరి 10 (జనంసాక్షి) :** మక్తల్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం మక్తల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో అధ్యక్షుడు బి.గోపాలం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరిస్తామని అధ్యక్ష కార్యదర్శులు బి.గోపాలం, బి. భాస్కర్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పెన్షనర్స్ కు రావలసిన పెండింగ్లో ఉన్న బెనిఫిట్స్ను అందించాలని కోరారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 42 మంది పెన్షనర్స్ వారికి రావలసిన బెనిఫిట్స్ అందక మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మ శాంతి కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రభుత్వం వెంటనే పెన్షనర్స్ కు రావలసిన ఐదు డిఏలు, కొత్త పిఆర్సి, ఉచిత ఆరోగ్య సేవలు అందించాలన్నారు. పెన్షనర్స్ అందరికీ వారి లైఫ్ పర్సనల్ డీటెయిల్స్ బుక్‌లెట్ కాపిని అధ్యక్ష కార్యదర్శులు అందించారు. పెన్షనర్స్ అందరూ లైఫ్ సర్టిఫికెట్ అందించాలని, ఐటీ ఫార్మ్స్ సబ్మిట్ చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బి. సజ్జన, కోశాధికారి సిద్ధి లింగయ్య, సూర్య ప్రకాష్, అరుణ, సుజాత, విద్యావతి, నర్సమ్మ, సయ్యద్ మూలాన, నారాయణరెడ్డి, రాములు, తిప్పారెడ్డి, సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలను ఆదర్శంగా మార్చాలి



**• ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకయ్య**

**చిలిపిచేడ్, జనవరి 10 (జనంసాక్షి) :** కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలను ఆదర్శంగా మార్చాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య సూచించారు.శనివారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో కౌడిపల్లి మండలంలోని తునికి పోచమ్మ ఆలయం వద్ద బేగరి బాలరాజ్ సమక్షంలో చిలిపిచేడ్ మండల ఎస్సీ,ఎస్టీ సర్పంచులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పేదలకు సంక్షమ పథకాలు అందించడంలో ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. పార్టీలకు అతీతంగా నిధులు సేకరించి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బేగరి యశోద బిక్షపతి, తలారి రాములు, కున్యా, నీలి పాండు, ఆనంద్, మౌనిక గణేష్, సుజాత మంజా, వద్దులే దురియా, కే. సుజాత, జీవుల తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే సహించేది లేదు

**• సోమనాథ ఆలయం ధ్వంసం చేసి వేయి సంవత్సరాలు**
**• శంబులింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు**
**• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్**



**సంగారెడ్డి, జనవరి 10 (జనం సాక్షి) :** హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే సహించేది లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ అన్నారు. సోమనాథ ఆలయం ధ్వంసం చేసి వేయి సంవత్సరాలు అయినా సందర్భంగా ఆలయం తిరిగి నిర్మించబడి పూజలు అందుకుశీటున్న సందర్భంగా ఆలయం నిరంతరం అభివృద్ధి చెందాలని శివాలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని జాతీయ పార్టీ పిలుపు మేరకు శనివారం బీరంగూడ శంబులింగేశ్వరా దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... సోమనాథ ఆలయం వేయి సంవత్సరాల క్రితం మత చందస వాదులచే ధ్వంసం చేయబడిన తర్వాత పునర్మించి పూజలు అందుకోవడం హర్షణీయమన్నారు హిందూ సంస్కృతిని, హిందూ ఆలయాలను ధ్వంసం చేయాలని చూస్తే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. హిందు దేవాలయాల రక్షణ, అభివృద్ధి కి నరేంద్ర మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ బీరంగూడ డివిజన్ కన్వీనర్ ఆగరెడ్డి, కోకోన్వీనర్ రమేశరెడ్డి, రఘు పటేల్, కిరణరెడ్డి, లక్ష్మయ్య, సూర్యకాంత్, బంటు ప్రవీణ్, సారా నవీన్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కోరిన ముబారక్ పూర్ గ్రామ సర్పంచ్ నవీన్



**సంగారెడ్డి టౌన్, జనవరి 10 (జనం సాక్షి) :** సదాశివాపేట మండలంలోని ముబారక్ పూర్ గ్రామంలో త్రాగునిటీ సమస్య పరిష్కరించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ముబారక్‌పూర్ గ్రామసర్పంచ్ నవీన్ గ్రామస్థులతో కలసి సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలోని ఉన్న నీటి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ మంజీరా నది గ్రామానికి దెగ్గరలో ఉన్న త్రాగడానికి నీళ్లుమాత్రం అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకోవచ్చారు. గ్రామంలో డ్రైనేజి, రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధికి తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ లోపు 5 వేల మందికి ఇండ్లు అందించి మాట నిలబెట్టుకుంటా..

**• టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**సదాశివపేట, జనవరి 10 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలోని సిద్దాపురం కాలనీలో ప్రభుత్వ జాగాలో శనివారం నిర్వహించిన సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సిద్దాపూర్ ప్రభుత్వ భూమిలో 5 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానని మాట ఇచ్చానని, అయితే రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో పొజిషన్ చూపించలేకపోయాను అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. మొదటిదశలో సిద్దాపురం ప్రభుత్వ స్థలంలో 2,011 ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా విడతల వారీగా మిగిలిన 3 వేల ఇళ్ల స్థలాలకు ఇక్కడ స్థలం సరిపోని కారణంగా, వెంకటాపురం, నిజాంపూర్ సమీపంలోని ప్రభుత్వ భూమిని అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. అధికారుల పూర్తి నివేదిక వచ్చిన అనంతరం అక్కడ కూడా మిగతా 3 వేల ఇళ్ల స్థలాలను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం డిసెంబరు నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందించి, జాగా పొజిషన్ చూపించి, నివాసానికి అనువుగా అన్ని ఏర్పాట్లు చేయడం నా బాధ్యత అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జూలకంటి ఆంజనేయులు, సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, తాసిల్దార్ బాలరాజ్, మున్సిపల్ కమిషనర్ శివాజీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు, మాజీ కౌన్సిలర్ గుండు రవి, పట్లూరి నాగరాజ్ గౌడ్, పిల్లోడి విశ్వనాథం, లక్ష్మ ప్రసన్న శంకర్ గౌడ్, రాయపాడు రమేష్, వాజిద్, మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నం సుభాష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు గౌడ్, నాయకులు కోడూరి శరత్, విష్ణువర్ధన్ రెడ్డి, సాబీర్, వసీం దాదా, షెజ్జీ,చోటు భాయ్, తుకారాం, కడలి అంజి, హాజీ, లతీఫ్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్ అసోసియేషన్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**ములుగు,జనవరి10(జనం సాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మరియు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్ అసోసియేషన్ 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. డిఎంహెచ్వో మాట్లాడుతూ, జరగబోయే శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర లో ఫార్మసీ ఆఫీసర్లు ముఖ్య భూమిక ను పోషించి జాతరను విజయవంతం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలో ఫార్మసీ ఆఫీసర్లు ముఖ్యులని,వ్యాధి నిరోధక టీకాల నిలువలు,మందుల పంపిణీ,సర్జికల్ పరికరాల నిర్వహణ మొదలగు విషయాలలో జాగురతతో ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ రణధీర్ తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు వినోదర్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హిమ కిరణ్,కోశాధికారి సంధ్య,ఉపాధ్యక్షులు వెంకటేష్, సతీష్, భాస్కర్, నవీన్,శారద, రాజమణి, మీనా, ప్రశాంతి, శివరంజని, స్వర్ణలత మొదలగు ఫార్మసీ ఆఫీసర్స్, డెమో సంపత్ సిహెచ్ఓ దుర్గారావు, ఎస్ఓ స్వరూప,రాణి,సీనియర్ అసిస్టెంట్ గణేష్, డిడియం ప్రవీణ్,డిఇఓ కిరణ్,సతీష్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఊటీ, కొడైకెనాల్‌కు దీటుగా ములుగు అడవి అందాలు

- బ్లాక్ బెర్రీ ఐ ల్యాండ్,అడవి లో సఫారీ సేవలు ప్రారంభం
- పచ్చని అడవి అందాల వ్యూ పాయింట్ ను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క







**ములుగు బ్యూరో/ ఏటూరునాగారం, జనవరి10(జనం సాక్షి):** తాడ్వాయి మండలం పరిధి లోని జలగలంచ వాగు ప్రాంతంలో అటవీ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చని అడవి అందాల వ్యూ పాయింట్ రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క ప్రారంబిం చారు. పర్యాటకులు ఎక్కడికో వెళ్ళి పర్యటించి పట్టణ ప్రాంతాల్లో కలుషిత వాతావరణంలో గడిపే బదులు ములుగు జిల్లా పచ్చని అడవి అందాల పర్యాటక ప్రదేశం అని కుటుంబ సమేతంగా సరదాగా గడుపుతూ ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుకుంటూ ఆరోగ్యవంతమైన పర్యటన చేసుకునే విధంగా ములుగు జిల్లా స్వాగతం పలుకుతుందని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లాలో బొగత జలపాతం ఎంతోమంది పర్యాటకులను ఆకర్షిస్తూ చాలా ప్రాంతాల ప్రజలు వస్తు వెళుతున్నారు.గత సంవత్సరం పస్రా తాడ్వాయి మధ్యలో జలగలంచ వాగు వద్ద బ్లాక్ బెర్రీ ఐ ల్యాండ్ ప్రారంభించామని,ఇటీవలే తాడ్వాయి హట్స్ వద్ద సఫారీ కూడా అడవి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని అదే విధంగా శనివారం రోజున జలగలంచ వద్ద అడవి అందాలు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఊటీ, కొడైకెనాల్ లాంటి పర్యాటక ప్రాంతాలకు దీటుగా మన అడవి అందాలు ఉంటాయని వివిధ రాష్ట్రాల నుండి వచ్చే వారు గానీ, కుటుంబంతో, స్నేహితులతో సరదాగా గడపడానికి ములుగు జిల్లా ప్రకృతి అందాల తరపున రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,డీఎఫ్ఓ కిషన్ జాదవ్,ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేఖన్,ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి అడవి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం మేడారం పర్యటనకు ఏర్పాట్లు

- సీఎం పర్యటన పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**తాడ్వాయి, జనవరి 10 (జనంసాక్షి) :** ఆసియా ఖండంలోని అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం జాతర కు ఈనెల 18 తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మేడారానికి రానున్నారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన నేపథ్యంలో మేడారంలో కొనసాగుతున్న ఆదివాసీ మ్యూజియం, ఆర్టీసీ పార్కింగ్ స్థలాలు, టెంట్ సిటీ పనులను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మేడారంలో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే సీఎం పర్యటనలో ఎటువంటి లోపాలు జరగకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్ష పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో శాంతిభద్రతలు బందోబస్తు ఏర్పాటులు ప్రోటోకాల్ కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అధికారులను నియమించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## సంక్రాంతి సెలవులకు అప్రమత్తంగా ఉండాలి

- దొంగతనాల నివారణకు సహకరించాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రామీణ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో, ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరిగా ఉన్న ఇళ్ల పరిసరాల్లో పోలీస్ గస్తీని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, బీట్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి, అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రయాణానికి వెళ్లే ముందు తమ ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారం వంటి వాటిని ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచాలని సూచించారు. అలాగే పొరుగువారికి, గ్రామ పెద్దలకు సమాచారం ఇవ్వడంతో పాటు, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు ముందుగానే తెలియజేయడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని తెలిపారు.

సంక్రాంతి సెలవుల సమయంలో దొంగతనాలతో పాటు చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీలు, ఇళ్లలోకి చొరబడి నేరాలకు పాల్పడే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో నేరాలు నమోదైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో సరైన వీధి లైటింగ్ ఉండేలా ప్రజలు చూసుకోవాలని, సీసీటీవీ కెమెరాలు ఉన్న వారు అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఇళ్ల చుట్టూ తిరుగుతూ సమాచారం సేకరిస్తున్నట్లు అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే పండుగల సమయంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలకు తాళాలు సరిగా వేసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగల సమయంలో జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఏవైనా అత్యవసర పరిస్థితులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల అప్రమత్తత, పోలీస్ శాఖ సహకారంతోనే జిల్లా వ్యాప్తంగా నేరరహిత వాతావరణంలో శాంతియుతంగా, సురక్షితంగా సంక్రాంతి పండుగలను జరుపుకోవచ్చని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలియజేశారు.



## భిక్షంపేటలో అడవి పంది మాంసం స్వాధీనం

**మంగపేట జనవరి 10(జనంసాక్షి) :** బుచ్చంపేట గ్రామంలో అటవీ పంది మాంసాన్ని శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఇంచార్జ్ రేంజర్ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బుచ్చంపేట గ్రామంలో అటవీ పంది మాంసాన్ని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు సోయం రమేష్, బంటి యాకయ్య ఇంటిలో తనిఖీలు చేయగా సుమారు ఐదు కేజీల మేర పంది మాంసాన్ని పట్టుకోవడం జరిగిందని అశోక్ వెల్లడించారు. అనంతరం ఆ మాంసాన్ని గొయ్యి తీసి పూడ్చడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం వారు పరారీలో ఉండడం జరిగిందని వారిని త్వరలోనే పట్టుకొని విచారించి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## భూ వివాదంలో నలుగురికి రిమాండ్

**కౌటాల జనవరి 10 (జనంసాక్షి) :** పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్తంపేట్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు లీజు క్వారీపై దాడి చేసిన కేసులో నలుగురుని అరెస్ట్ చేసి రిమాండ్ విధించినట్లు శనివారం కౌటాల ఎస్సై డీ చంద్ర శేఖర్ తెలిపారు. కొమరంభీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామానికి చెందిన తోగం గోవింద్ (54), తార బాయి(50),దేవాజీ (25), రాజు (28) లు జనవరి 8న మధ్యాహ్నం క్వారీ భూమిపై దాడి చేశారు. గొడ్డల్ల తో చొరబడి ఫిర్యాదు దారు పులి బాగభూషణం, కార్మికులపై అసభ్యంగా దూషించి,ఈ భూమి మా స్వంతం,మళ్లీ వస్తే చంపేస్తాం అంటూ బెదిరింపులు చేశారనీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి. చంద్రశేఖర్ కౌన్సల్ కేసు (క్రైమ్ నెం. 04/2026) బీఎన్ఎస్ సెక్షన్లు 308(2), 329(3), 296(ఎ), 351(2) తీ/ష 3(5)లో నమోదు చేశారు. దర్యాప్తు లో 2013లో ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకుని పరిహారం చెల్లించినట్లు తేలింది. గత ఐదేళ్లుగా నిందితులు లీజుదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి న్యాయస్థానం ముందు హాజరు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమ జోక్యాలకు కఠిన చర్యలు తీసుకుంటామని, భూవివాదాలు సివిల్ కోర్టులోనే పరిష్కరించాలని హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు



**మహదేవపూర్: జనవరి 10 (జనంసాక్షి).** కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ లో గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు సంతోషపు నైసీ. వెన్నపురెడ్డి మధుప్రియ లు రిక్రియేషనల్ మ్యాథేమెటికల్ థింకింగ్ అనే ఉపఅంసములో గోల్డెన్ రేడియో అనే ప్రాజెక్టు కు రాష్ట్రస్థాయి మొదటి బహుమతిని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారని గ్రీన్ వుడ్ పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం గైడ్ టీచర్ మొగిలితో పాటు విద్యార్థులను సన్మానించారు. కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ. పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ప్రథమ పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని ఇటువంటి ప్రదర్శనాలు సృజనాత్మకను పెంపొందించి నూతన ఆవిష్కరణలను చేసేందుకు దోహదపడతాయని రాష్ట్ర స్థాయిలో కాకుండా జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి. డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్, ఉపాధ్యాయురాలు ఉపాధ్యాయులు అభినందించారు. ఈకార్యక్రమంలో జేడ్పి హైస్కూల్ పాఠశాల మహాదేవపూర్ ఉపాధ్యాయులు మడ్క మధు పాల్గొన్నారు.

## అటవీ అధికారులా! మజాకా!

- ఎనుకనుంచి ఎం పోయిన పర్వాలేదు ముందునుంచు పోతే కథమే..
- మల్లన్న పట్నానికి పందిరి వేయడానికి గుంజలు తెస్తే పైసలియ్యాలాట
- పైసలిస్తేనే పని లేకుంటే కేసులే..
- ఇదేం విడ్డురమో..
- వెంకటాపూర్ సెక్షన్, బీట్ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



**ములుగు/వెంకటాపూర్,జనవరి10(జనం సాక్షి):** అటవీ శాఖ అధికారులు తీవ్ర వాసుళ్లకు పాటుపడుతున్నట్లు తెలుస్తోంది. వెంకటాపూర్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో నూతన గృహాలు నిర్మించుకుంటున్న వారి వద్దకు వెళ్లి మామూలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన ఓ సెక్షన్ ఆఫీసర్ తో పాటు ఓ బీట్ ఆఫీసర్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తుంది. తాజాగా శనివారం మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్లో నివాసం ఉంటున్న గునిగంటి రఘు మల్లన్న పట్నాలు వేసుకునేందుకు బంధుమిత్రులను ఆహ్వానించారు. ఇదే క్రమంలో ఇంటి ముందు తన పాత కర్రలతో పందిరి వేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఫారెస్ట్ సెక్షన్ బీట్ అధికారులు పాత పందిరి గుంజలను చూశారు. ఇవి ఎక్కడ నుంచి తెచ్చారు. చెప్పండి అంటూ వారిని ఇబ్బందులకు గురి చేశారు. 5000 రూ.లు చెల్లించలాని డిమాండ్ చేశారు. ఆ బదేతల గుంజలు పాతవేనని మొరపెట్టుకున్నప్పటికీ నానా హంగామా సృష్టించారు. ఈ క్రమంలో చుట్టుపక్కల వారు గుమ్మిగుడి ఆ హంగామను ఫోటోలు వీడియోలు చిత్రీకరించారు. ఈ గొడవ ఎటువైపు వెళుతుందోనని భావించిన అటవీశాఖ సెక్షన్ బీట్ అధికారులు తిరిగి సోమవారం రసీదు పట్టుకుని వస్తాం అదే రోజు పైసలు చెల్లించాలని హుకుం జారీ చేస్తూ చల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఇద్దరి అటవీ శాఖ అధికారుల తీరుపై మండల కేంద్రంలో చేర్చాని అంశంగా మారింది. అమాయక ప్రజల నుంచి అక్రమంగా పైసలు వసూలు చేస్తున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ నలుగురు గమ్మి కూడక పోతే బలవంతంగా రూ.లు 5000 తీసుకునే వారని ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నత అధికారులు స్పందించి నానా హంగామా సృష్టించిన సెక్షన్ బీట్ అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సంక్రాంతికి ఊర్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ జానకి షర్మిల



**నిర్మల్ బ్యూరో, జనవరి 10 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు స్వగ్రామాలకు వెళ్తుండటంతో దొంగతనాలకు అవకాశం ఉందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల శనివారం ఒక ప్రకటన లో తెలిపారు . ఊరికి వెళ్లే ముందు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు వంటి విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, లేదా వెంట తీసుకెళ్లాలని తెలిపారు. చోరీల నియంత్రణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, రాత్రి గస్తీని ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. ఇళ్లకు తాళం వేసినప్పుడు బయటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పొరుగువారికి, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

## మోడీ విధానాలతో రైతు కార్మికుల పరిస్థితి అగమ్యగోచరం

- రైతు వ్యతిరేక నూతన విత్తన,విద్యుత్తు చట్టాలను ఉపసంహరించాలి
- 29 కార్మిక చట్టాలను కొనసాగించాలి..
- విబి జి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి..
- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్..
- రైతు కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో- నిరసన..




**వరంగల్ ప్రతినిధి, జనవరి 10 (జనం సాక్షి):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలతో రైతుల కార్మికుల పరిస్థితి ఆందోళన కరంగా మారిందని తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్, నూతన విత్తన, విద్యుత్తు చట్టాలను, విబిజిరామ్‌జి పథకాన్ని ఉపసంహరించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్), అఖిలభారత కార్మిక సంఘాల వేదిక (ఏఐసిటియు), అఖిలభారత వ్యవసాయ కార్మిక సమాఖ్య (ఏ ఐ ఏడబ్ల్యూ ఎఫ్) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక కర్షక కూలీల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రైతాంగం ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న సరైన ధర లేక మార్కెట్ దోపిడీకి గురై దివాలా తీస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అలాంటి రైతాంగాన్ని కాపాడటానికి పంటల మద్దతు ధర చట్టం చేయకుండా తాత్సారం చేస్తూ రైతులకు హాని కలిగించే విధంగా ఇతర కంపెనీలకు కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరే విధంగా నూతన విత్తన చట్టాన్ని అలాగే కేంద్ర విద్యుత్ చట్టాన్ని తీసుకురావడం అన్యాయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు కనీసం వంద రోజులు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సైతం సరిగ్గా అమలు చేయకుండానే వికసిత్ భారత్ జి రామ్ జి పథకంగా మార్చి గత చట్టానికి తూట్లు పొడిచిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి విధానాలను మానుకోవాలని లేకపోతే ప్రజా పోరాటాలతో తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.

ఏఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ కార్మిక వర్గానికి ఎంతో ఉపయోగకరంగా ఉండే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకురావడంతో కార్మిక హక్కులను హరించి పెట్టుబడుదారులకు అనుకూలంగా మార్చినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాపాడుతామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలు తీసుకురావడం దారుణం అన్నారు ఇప్పటికైనా అలాంటి చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఆందోళన కార్యక్రమంలో ఏఐసిటియు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్ర ప్రతాప్ ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబా బాబురావు ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు సుంచు జగదీశ్వర్ జిల్లా ఉపాధ్యక్షుడు మాలోత్ సాగర్ కార్మిక రైతు సంఘాల జిల్లా నాయకులు తాటికాయల రత్నం ఐతం నాగేష్ గణిపాక ఓదెలు మహమ్మద్ మహబూబ్ పాష మహమ్మద్ మాశూక్ ఎగ్గని మల్లికార్జున్ మాలి ప్రభాకర్ జక్క అశోక్ మార్త నాగరాజు మార్తసుధ యాదగిరి లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బండ్రేవుతండా జాతరకు వేలాయే

- అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ జానకి షర్మిల



**సారంగాపూర్, జనవరి 10 (జనం సాక్షి) :** ప్రతి సంవత్సరం పొట్యా గ్రామపంచాయతీ పరిధిలోని బండ్రేవు తండాలో నిర్వహించే నాను మహారాజ్ జాతర ఐదు రోజులు ఉత్సాహంగా గిరిజన తండావాసులు జరుపుకుంటారు. సంక్రాంతి సెలవులు ఉండడంతో పట్టణాల్లో చదువుకున్న యువకులు విద్యార్థులు ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల వారు తండోపతండాలుగా వస్తూ చాలా ఆనందంగా గడుపుతారు. కానీ ఈ జాతరలో ఎక్కువగా జూదం, మద్యపానం, బెట్టింగులు, నిర్వహించడంతో 2025 సంవత్సరంలో నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారం అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంవత్సరం కూడా ఇలాంటివి పునరావృతం కాకూడదని జాతర నిర్వహించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తండా కమిటీ వారు వీటిని దృష్టిలో ఉంచుకొని జాతర ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

# సంక్రాంతి రద్దీ దృష్ట్యా వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

- డ్రోన్ కెమెరాతో హైవేపై నిఘా
- సురక్షితంగా గమ్యం చేరుకోవాలని పువ్వులు అందించి సూచనలు
- రహదారి వెంట గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 10 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా జాతీయ రహదారి 65పై సూర్యాపేట పట్టణ పరిధిలోని ఎఫ్సీఐ గోదాం వద్ద వాహనాల రద్దీని జిల్లా ఎస్పీ కె.నరసింహ సంబంధిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ కెమెరాతో రహదారిపై వాహనాల యొక్క వేగాన్ని రద్దీని పర్యవేక్షించారు. పండుగకు వెళ్లే వాహనదారులు ప్రజలు సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని సంతోషంగా పండుగ జరుపుకోవాలని తెలుపుతూ పుష్పాలు అందించి సూచనలు చేశారు. వాహనాల రద్దీని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రా ప్రాంతానికి వెళ్ళే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వాహనాలు నడపాలని అన్నారు. అధికవేగంతో, నిద్ర మత్తులో వాహనాలు నడపవద్దని అన్నారు. దూర ప్రయాణం వల్ల అలసిపోవడం, నిద్ర మత్తు కారణంగా ప్రమాదాలకు జరిగే అవకాశం ఉంది కాబట్టి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలు కండిషన్ లో ఉండేలా సూచించారు. అత్యవసర సమయంలో రహదారుల అధికారులను, డయల్ 100 కు ఫొన్ చేసి సహాయం పొందాలని తెలిపారు. రోడ్డు ప్రక్కన అనధికారికంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపవద్దని విజ్ఞప్తి చేశారు. భారీ వాహనాలు ఒక క్రమంలో వెళ్ళాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. జిల్లా పరిధిలో జాతీయ రహదారి 65పై విస్తరణ పనులు, మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి కాబట్టి అవసరమైన చోట పోలీసు డైవర్షన్స్ ఏర్పాటు చేసి గమనిక బోర్డులు పెట్టడం జరిగిందని, వాటిని పాటిస్తూ వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని తెలిపారు. పండగకు వెళ్లే సమయంలో, తిరుగు ప్రయాణం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు సంభవించకుండా స్థానిక ప్రజలను అప్రమత్తం చేశామని సూచించారు. రోడ్డు భద్రత కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ట్రాఫిక్ రద్దీని, వాహనాలను పునరుద్ధరించడం కోసం ముఖ్యమైన మళ్లింపులు చేపట్టడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ నుండి గుంటూరు వెళ్లేవారు నార్కెట్ పల్లి నుండి మిర్యాలగూడ మీదుగా వెళ్లాలని తెలిపారు. రాజమండ్రి, వైజాగ్ వైపు వెళ్లేవారు నకిరేకల్ వద్ద జాతీయ రహదారి వైపు తీసుకుని అర్వపల్లి, బంగ్లా ఖమ్మం మీదుగా వెళ్లాలని, రాజమండ్రి, విజయనగరం, కాకినాడ, వైజాగ్, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలను టేకుమట్ల వద్ద ఖమ్మం వైపు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఖమ్మం నుండి సూర్యాపేట వైపుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలు చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ వద్ద సర్వీస్ రోడ్డు నుండి సూర్యాపేట పట్టణం మార్గంలోకి మళ్లించి సూర్యాపేట పట్టణం మీదుగా హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్ళవచ్చని సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారి వెంట గల సూర్యాపేట రూరల్, చివ్వెంల, మునగాల, కోదాడ మండలాల పరిధిలో గల గ్రామాల రైతులు, ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్ళేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, తప్పుడు మార్గంలో వాహనాలు, పశువులను తీసుకువెళ్లడం ప్రమాదమని గమనించాలి అన్నారు. పోలీసు సిబ్బంది రోడ్లపై 24 గంటలు గస్తీ నిర్వహిస్తారని తెలిపారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 లేదా సూర్యాపేట జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 8712686026 కు సమాచారం ఇవ్వాలని అన్నారు.

## చైనా మాంజా అమ్మితే కేసులు తప్పవు



**చండూరు, జనవరి 10 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలే తప్ప, ఇతరుల ప్రాణాల మీదకు తీసుకురావద్దని చండూరు ఎస్.ఐ ఎన్.వెంకన్న స్పష్టం చేశారు. పండుగ సీజన్ దృష్ట్యా పట్టణంలో ఎవరైనా నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చండూరు ఎస్సై గట్టిగా హెచ్చరించారు.

**వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు**

సంక్రాంతి సమీపిస్తుండటంతో చండూరు మండల పరిధిలోని కిరాణా, జనరల్ స్టోర్స్ మరియు పతంగుల దుకాణాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పూర్తిగా నిషేధించిన సింథటిక్/ప్లాస్టిక్ చైనా మాంజాను రహస్యంగా విక్రయించే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. లాభాపేక్ష కోసం చూసి, నిషేధిత వస్తువులను అమ్మితే దుకాణాల సీజ్ చేయడంతో పాటు, లైసెన్సులు రద్దు చేసేలా సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. చైనా మాంజా తయారీలో ప్లాస్టిక్, గాజు పొడి వంటి ప్రమాదకర రసాయనాలు వాడుతారని, ఇది తెగదని, దీనివల్ల పక్షులు గొంతులు కోసుకుని చనిపోతున్నాయని ఎస్సై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోడ్లపై వెళ్లే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల మెడకు ఈ దారం చుట్టుకుని ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్న ఘటనలు అనేకం చూస్తున్నామని గుర్తుచేశారు. పర్యావరణానికి కూడా ఇది తీరని హాని కలిగిస్తుందన్నారు.

**తల్లిదండ్రులకు సూచన**

చివరగా ఎస్సై మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎలాంటి దారం వాడుతున్నారో గమనించాలని కోరారు. సంప్రదాయ కాటన్ దారంతోనే గాలిపటాలు ఎగురవేయాలని, మూగజీవాలకు హాని చేయవద్దని సూచించారు. ఎక్కడైనా చైనా మాంజా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## తెలంగాణ జట్టు కెప్టెన్‌గా హాలియాకు చెందిన తేజు



**హాలియా, జనవరి 10 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా హాలియా పట్టణానికి చెందిన చింతలచెరువు తేజు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 12 నుండి 16 వరకు హర్యానా రాష్ట్రం పానిపట్‌లో జరగనున్న అండర్-17 69వ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తేజు తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. గత నవంబర్‌లో నల్లగొండలో నిర్వహించిన అండర్--17 (రా+ఖీ) 69వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జట్టు తరపున పోటీపడి మెరిసిన తేజు, ఉత్తమ ప్రతిభతో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేసిన తేజు తన ఎంపికకు సహకరించిన నల్లగొండ జిల్లా రా+ఖీ సెక్రటరీ విమల, సీనియర్ ్రాణ బొమ్మపాల గిరిబాబు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఫుట్‌బాల్ అకాడమీ కోచ్ లింగా నాయక్, నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ పేరెంట్స్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపాడు. ప్రస్తుతం తేజు జనగామ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ఫుట్‌బాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు.

## సంక్రాంతికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**భూదాన్ పోచంపల్లి, జనవరి 10 (జనం సాక్షి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా భూదాన్ పోచంపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. పండుగకు బయటి ప్రాంతాలకు వెళ్లే వారు బంగారం, వెండి, నగదు వంటి విలువైన వస్తువులు ఇంట్లో వదిలి పెట్టకుండా తమతో పాటు తీసుకువెళ్లాలని, తాళం వేసి వెళ్లే వారు తమ ఇంటి చిరునామా వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే అదనపు నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే పతంగులు ఎగురవేసే సమయంలో నిషేధిత చైనా మాంజా వినియోగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పోలీసులు నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ నరసింహ



**పాలకవీడు, జనవరి 10 (జనంసాక్షి) :** పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని, సాంకేతికతను వాడుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు." అని జిల్లా ఎస్పీ నరసింహ హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ,పోలీస్ స్టేషన్ల పనితీరును పర్యవేక్షించే క్రమంలో భాగంగా,శనివారం సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పాలకీడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన స్టేషన్ రికార్డులు, ఆయుధ సామాగ్రి, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా, పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లోని ఆయుధాలు,కమ్యూనికేషన్ సెట్లు, ఇతర రక్షణ పరికరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో వీటిని సమర్థవంతంగా వినియోగించేలా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. బాధితులకు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని,వారి సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలు మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు,ఇసుక అక్రమ రవాణా, బెల్ట్ షాపులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రాత్రి పూట గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్బిసిఐ రామారావు,డిసిఆర్ బిసిఐ రాంబాబు, ఎస్సై కోటేష్, ఆర్ఎస్ఐ అశోక్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



**రాజేంద్రనగర్, జనవరి 10 (జనం సాక్షి) :** రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో క్రీడా టోర్నమెంట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ హాజరై ప్రారంభించారు. ఈ పోటీలకు 15 జట్లు పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, టాస్ నిర్వహించి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ బొక్క బాలరెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు జి. బాబురావు, దయాకర్ రావు, రమణ ప్రసాద్, సంతోష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం రూరల్, జనవరి 10 (జనం సాక్షి) :** రెండేళ్ల క్రితం మీరు ప్రజా ప్రభుత్వం కావాలని నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.. ఆనాడు మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గంలో ఎక్కడా తగ్గకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పాలేరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్‌లో రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో రూ. కోటి రెండు లక్షల యాభై వేల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, బస్ షెల్టర్, జంక్షన్ అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నడిమితండాలో రూ. 77.10 లక్షలు, గొల్లగూడెంలో రూ. 37.20 లక్షలు, జలగంనగర్‌లో రూ. 29.30 లక్షలు, బారుగూడెంలో రూ. 24.27 లక్షలు, ఆటోనగర్‌లో రూ. 17.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడి కష్టాలను పట్టించుకోలేదని, రేషన్ కార్డులు అడిగితే మొహం చాటేశారని మండిపడ్డారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులే ఇవ్వకుండా దగా చేసిన గత పాలకుల తీరును ఎండగడుతూ.. తమ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా తెలంగాణలో సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. గతంలో హాస్టళ్లలో పేద పిల్లలకు సరైన తిండి పెట్టలేదని, తమ ప్రభుత్వం వచ్చాక డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచి పేద విద్యార్థులకు అండగా నిలిచామని వివరించారు. సొంత ఇల్లు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని, ఈ ప్రక్రియ దఫాలవారీగా నిరంతరం కొనసాగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. పేదవారికి ఎల్లవేళలా అండగా ఉండే విధంగానే ఈ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల దీవెనలు ఇలాగే కొనసాగాలని కోరారు.

## జేసీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- టాస్ వేసి క్రికెట్ ప్రారంభించిన కోరం



**టేకులపల్లి, జనవరి 10 (జనంసాక్షి) :** మండల పరిధిలోని గంగారం ఉమ్మడి గ్రామ పశీచాయతిలో కీ"శే "జోగ చంద్రశేఖరు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన "జేసీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీసన్ - 1"ను శనివారం కోయగూడెం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ముఖ్య అతిధిగా హాజరై టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. సర్పంచ్ రుక్మిణి, గ్రామ యువత సహకారంతో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంటుకు చంద్రశేఖర్ సతీమణి భాగ్యలక్ష్మి వారి పేరుమీద మొదటి బహుమతిని అందించనున్నారు. ఈ సందర్భంగా కోరం సురేందర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగా రామనాధం, మూతి కృష్ణ, బాడిషా నాగేష్,,ఇరప మల్లయ్య, జోగా వెంగయ్య, ప్రవీణ్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోదాడ, జనవరి 10 (జనం సాక్షి) :** కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గవ వ్యాప్తంగా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూల బొకేలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. మునగాల మండలం నరసింహుల గూడెం గ్రామ సర్పంచ్ కొంచం ఇందిరా, నరసయ్యలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ చిమిర్యాల సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొత్త గురవయ్య, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, సిపిఎం నాయకులు ముత్యాలు, సర్పంచులు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చైనా మాంజా నిల్వచేసినా విక్రయించినా కఠిన చర్యలు



**కొండమల్లేపల్లి, జనవరి 10 (జనంసాక్షి) :** గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాను విక్రయించినా వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అజ్మీరా రమేష్ హెచ్చరించారు. శనివారం కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో వివిధ షాపులలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చైనా మాంజా వల్ల మనుషులకు, పక్షులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. చైనా మాంజా విక్రయిస్తూ పట్టుబడితే ఐదేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో ఫ్యాన్సీ షాపులు, బుక్ స్టాల్స్, జనరల్ షాప్స్ లల్లో గాలిపటాల విక్రయ కేంద్రాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంటుందని ఎక్కడైనా నిషేధిత చైనీస్ మాంజా కనిపిస్తే వెంటనే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత విక్రేతలపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేవలం వ్యాపార లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని వ్యాపారులకు సూచించారు. పర్యావరణ హితమైన సురక్షితమైన నూలు కాటన్ దారాలను మాత్రమే విక్రయించి కొనుగోలు చేయాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల చైనిస్ మాంజ విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్ 100 కు సమాచారం అందించాలని ఎస్ఐ ప్రజలను కోరారు.

# ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- ఎమ్మెల్యే బిఎల్ఆర్
- పక్కాగా నో హెల్మెట్- నో పెట్రోల్ అమలు
- ఎస్పీ శరత్ చంద్ర పవార్
- ఉచితంగా హెల్మెట్ల పంపిణీ, అవగాహన ర్యాలీ



**మిర్యాలగూడ, జనవరి 10 (జనం సాక్షి) :** వాహనదారులు ప్రాణరక్షణ కవచంగా హెల్మెట్లు ఉంటాయని , మహాశివరాత్రి నాటికి ప్రతి ఇంటికి ఉచితంగా హెల్మెట్ అందిస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నో హెల్మెట్ - నో పెట్రోల్ కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పి శరత్ చంద్ర పవార్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 500 మంది ద్విచక్ర వాహనదారులకు బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం 2000 మంది ద్విచక్ర వాహనదారులతో కలిసి ఎమ్మెల్యే, ఎస్పీ, సబ్ కలెక్టర్ లు హెల్మెట్ ధరించి పట్టణంలో ఎన్ఎస్పి క్యాంపు నుండి రాజీవ్ చౌక్ మీదుగా ఫ్లైఓవర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుకోని రోడ్డు ప్రమాదాలతో ప్రాణ నష్టం జరగకుండా ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించినట్లు హెల్మెట్లు వాడటం వలన ప్రాణాలకు రక్షణ కవచంగా పనిచేస్తాయని అన్నారు. రాబోయే మహాశివరాత్రి నాటికి ఇంటికి ఒక హెల్మెట్ చొప్పున పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గతంలో కూడా మిర్యాలగూడ నియోజకవర్గంలో బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సుమారు 22 వేల ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశామన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ వాహనదారులు మొబైల్ వాడటం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్లో ప్రయాణించటం లాంటివి చేయకూడదన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలకు వ్యతిరేకంగా చేసే ఇలాంటి పనుల వలన వాహనదారులు వారు నష్టపోవటమే కాక ఎదుటివారి ప్రాణాలకు ఇబ్బందులు కలిగిస్తారని అన్నారు. విలువైన ప్రాణాలను దక్కించుకునేందుకు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. హెల్మెట్ లేని వాహనాలకు పెట్రోల్ పోయటం జరగదన్నారు. దీనిని పెట్రోల్ బంకులవారు కచ్చితంగా అమలు చేయాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణాలపై పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు, సిఐలు పి నాగ దుర్గాప్రసాద్, నాగభూషణరావు, జె.సోమ నరసయ్య, ఎస్ఐలు లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, శేఖర్, కృష్ణయ్య రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విపణి



## అందరికీ ఇష్టమైన కారు.. అమాంతం పెరిగిన ధరలు

న్యూఢిల్లీ:జనవరి ప్రారంభం నుంచి చాలా కంపెనీలు తమ వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించాయి. ఇందులో భాగంగానే.. టయోటా కంపెనీ తన ఇన్నోవా క్రిస్టా ధరలను సవరించింది.ధర పెరుగుదల రూ.21,000 నుంచి రూ.33,000 మధ్య ఉంది.భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఎంపీవీలలో ఒకటైన టయోటా ఇన్నోవా క్రిస్టా లోయర్ స్పెక్ ఉన్న వేరియంట్ ధరలు రూ.33,000 వరకు పెరిగాయి. డీజిల్ పవర్ లాడర్ ఫ్రేమ్ మిడ్ స్పెక్ వేరియంట్ల ధరలు రూ.21,000 వరకు పెరిగాయి. మరోవైపు జీఎక్స్ వేరియంట్లు ధరలు వరుసగా రూ. 25,000 రూ. 26,000 వరకు పెరిగాయి.ధరల పెరుగుదల తరువాత.. టయోటా ఇన్నోవా క్రిస్టా బేస్ వేరియంటైన జీఎక్స్ 7 సీటర్ వేరియంట్ ధర ఇప్పుడు రూ. 18.66 లక్షల నుంచి రూ. 18.99 లక్షలకు(ఎక్స్-షోరూమ్) చేరింది. సెవెన్ ఎనిమిది సీటర్ మోడల్ ధర వరుసగా రూ. 20.47 లక్షలు రూ. 20.52 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉన్నాయి.ఏడు, ఎనిమిది సీట్ల మోడల్ ధరలు వరుసగా రూ. 23.95 లక్షలు రూ. 24 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉంది. టాప్-ఎండ్ జెడ్ఎక్స్ ఏడు సీట్ల మోడల్ ధర ఇప్పుడు రూ. 25.27 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి రూ. 25.53 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉంది.

## బంపరాఫర్.. రూపాయికే సిమ్ కార్డు!

ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వోడాఫోన్-ఐడియా వంటి టెలికామ్ కంపెనీలు ఎప్పటికప్పుడు తమ కస్టమర్ల కోసం లేటెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్ ప్రవేశపెడుతున్న సమయంలో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఓ కొత్త ఆఫర్ తీసుకొచ్చింది. ఉచితంగా సిమ్ కార్డు అందించనున్నట్లు వెల్లడించింది. "సెలబ్రేషన్ ముగిశాయి, కానీ ఆనందం మాత్రం అలాగే ఉంది!. కేవలం ఒక రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్ పొందండి. దీని ద్వారా అపరిమిత కాల్స్, రోజుకు 2జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు.. 30 రోజుల చెల్లుబాటుతో ఆస్వాదించండి. ఈ ఆఫర్ 2026 జనవరి 31 వరకు మాత్రమే. మీకు సమీపంలోని లేదా రిటైలర్‌ను ఈరోజే సందర్శించండి!" అని బీఎస్ఎన్ఎల్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది.

# రూ.4.50 లక్షల కోట్లు ఆవిరి



ముంబయి:దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా ఐదో రోజూ నష్టాలను చవిచూసింది. అమెరికా భారీ సుంకాల హెచ్చరికలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించడం ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 28 పైసలు తగ్గి 90.18 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడిచమురు ధర 2.9% పెరిగి 63.79 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.50 లక్షల కోట్లు తగ్గి రూ.467.74 లక్షల కోట్ల (5.19 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

వారంలో 2.5% నష్టం: సెన్సెక్స్ 84,022.09 పాయింట్ల వద్ద నష్టాల్లోనే (క్రితం ముగింపు 84,180.96) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 83,402.28 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 604.72 పాయింట్ల నష్టంతో 83,576.24 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 193.55 పాయింట్లు కోల్పోయి 25,683.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 2,185.77 పాయింట్లు (2.54%), నిఫ్టీ 645.25 పాయింట్లు (2.45%) చొప్పున నష్టపోయాయి. తొమ్మిదో రాణించాయి..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 9 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ 2.34%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.22%, అదానీ పోర్ట్స్ 1.98%, భారతీ ఎయిర్‌టెల్ 1.89%, సన్‌ఫార్మా 1.79%, ఎంఅండ్ఎం 1.26% తగ్గాయి. ఏషియన్ పెయింట్స్ 1.36%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.86%, బీఈఎల్ 0.77%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.34%, ఎటర్నల్ 0.32%, టెక్ మహీంద్రా 0.23% చొప్పున పెరిగాయి.

## ముఖేష్ అంబానీ ఒక్కరోజు సంపాదన ఎంతో తెలుసా?

ముంబయి:రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ 'ముఖేష్ అంబానీ' గురించి అందరికీ తెలుసు. చమురు, పెట్రోకెమికల్స్, రిటైల్, డిజిటల్ మొదలైన వ్యాపారాలను నడుపుతున్న ఈ పారిశ్రామిక దిగ్గజం రోజుకు ఎంత సంపాదిస్తారనేది.. బహుశా చాలామందికి తెలుసుకుండక పోవచ్చు. ఈ కథనంలో ఆ వివరాలు తెలుసుకుందాం.1957 ఏప్రిల్ 19న ధీరూభాయ్ & కోకిలాబెన్ అంబానీ దంపతులకు జన్మించిన ముఖేష్ అంబానీ.. ప్రస్తుతం భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ప్రస్తుతం ఈయన సుమారు 113 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలో 16వ అత్యంత ధనవంతుడిగా ఉన్నారు.కొన్ని నివేదికలు ప్రకారం.. ముఖేష్ అంబానీ ప్రతిరోజూ దాదాపు రూ.163 కోట్లు సంపాదిస్తున్నారు. ఈ ఆదాయం ఆయన జీతం నుంచి రాదు. కంపెనీ లాభాలు, వాటా, పెట్టుబడి మొదలైన వాటి నుంచి వస్తుంది. మార్కెట్ హెచ్చుతగ్గులను బట్టి సంపదలో చిన్న వ్యత్యాసం కనిపిస్తుంది.ముఖేష్ అంబానీ ఐదేళ్ల నుంచి కంపెనీలో జీతం తీసుకోలేదు. అయితే షేర్ నుంచి, వాటాల నుంచి మాత్రం ప్రతి సంవత్సరం గణనీయమైన లాభాలు వస్తున్నాయి. సంస్థ లాభాలు, షేర్ విలువ పెరిగినప్పుడు ఈయన సంపద మరింత పెరుగుతూ ఉంటుంది.



## రిపబ్లిక్ డే సేల్‌ను ప్రకటించిన అమెజాన్..

న్యూఢిల్లీ:ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ కొత్త సేల్‌కు సిద్ధమైంది. ఫ్లిప్‌కార్ట్ ఇటీవలే సేల్ తేదీలను ప్రకటించగా.. ఇప్పుడు అమెజాన్ కూడా 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్ 2026'ను ప్రకటించింది. జనవరి 16న సేల్ ప్రారంభించనుంది. సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం డిస్కౌంట్ లభిస్తుందని అమెజాన్ ఓ ప్రకటనలో తెలిపింది.డీల్స్ వివరాలను త్వరలో వెల్లడిస్తామని అమెజాన్ పేర్కొంది. సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, గేమింగ్ కన్సోల్, స్మార్ట్ గ్లాసెస్, వాషింగ్ మెషిన్లు, ప్రొజెక్టర్లు, స్మార్ట్‌టీవీలపై ఆఫర్లు ఉండనున్నాయి. మరోవైపు ఫ్లిప్‌కార్ట్ జనవరి 17న సేల్‌ను ప్రారంభించనుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, బ్లాక్ మెంబర్లకు 24 గంటల ముందే యాక్సెస్ లభించనుంది. అంటే ఈ పండగ సీజన్‌లో రెండు అతిపెద్ద ఇ-కామర్స్ సంస్థల మధ్య మరోసారి పోటీ నెలకొననుంది.






## ఏడాది రీచార్జ్.. ఇదే చవక ప్లాన్!!

భారతదేశపు రెండో అతిపెద్ద టెలికాం సంస్థ అయిన ఎయిర్‌టెల్, తన ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం ఎప్పటికప్పుడు కొత్త, చవకరీఛార్జ్ ప్లాన్లను ప్రవేశపెడుతోంది. దేశవ్యాప్తంగా 390 మిలియన్లకు పైగా వినియోగదారులు ఉన్న ఈ సంస్థ, ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాలిడిటీ ప్లాన్లపై దృష్టి సారిస్తోంది.ఈ క్రమంలో, సిమ్‌ను పూర్తిగా ఒక సంవత్సరం పాటు యాక్టివ్‌గా ఉంచే తక్కువ ధర ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.ఈ ప్లాన్ ముఖ్యంగా ఎక్కువ డేటా అవసరం లేని, కాలింగ్, ప్రాథమిక కనెక్టివిటీ అవసరమయ్యే వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సీనియర్ సిటిజన్లు, తల్లిదండ్రులు, లేదా సెకండరీ/బ్యాకప్ సిమ్ ఉపయోగించే వారికి ఇది ఉత్తమ ఎంపికగా ఉంటుంది. తక్కువ వ్యయంతో మీ మొబైల్ నంబర్‌ను ఏడాది పొడవునా యాక్టివ్‌గా ఉంచడమే ఈ రీఛార్జ్ ఉద్దేశం.ఎయిర్‌టెల్ రూ.2,249 ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీని అందిస్తుంది. రీఛార్జ్ చేసిన రోజు నుండి పూర్తి సంవత్సరం వరకు అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాల్స్ చేయవచ్చు. ఫోన్ వినియోగం ప్రధానంగా కాల్స్, చాటింగ్, పరిమిత ఇంటర్నెట్ అవసరాలకు మాత్రమే ఉంటే, ఈ ప్లాన్ మంచి ఎంపికగా చెప్పవచ్చు.

డేటా, ఎస్ఎంఎస్ ప్రయోజనాలు

ఈ ప్లాన్‌లో రోజువారీ డేటా ఉండదు. బదులుగా, మొత్తం 30జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. దీన్ని 365 రోజుల కాలవ్యవధిలో అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవచ్చు. వాట్సాప్ చాటింగ్, ముఖ్యమైన ఇంటర్నెట్ అవసరాల కోసం ఈ డేటా సరిపోతుంది.అదనంగా3,600 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఇవి బ్యాంక్ అలర్ట్‌లు,ఇతర ముఖ్యమైన సందేశాల కోసం పూర్తిగా సరిపోతాయి.

## గుడ్ల ధరలు



| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.80 | ₹ 5.82 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్



| ₹ 1,26,500 (22 క్యారెట్లు) | ₹ 1,38,000 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్



₹ 2,72,000

# భారత్‌కు వెనెజువెలా చమురు..?

## ఆ దేశంపై దాడి వెనుక ట్రంప్ కుతంత్రం ఇదేనా..?





న్యూఢిల్లీ:ఏదో రకంగా వెనెజువెలాను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఆ దేశ అధ్యక్షుడు మదురోను బంధించి, అపై పదవి పీఠమెక్కకుండా చేసి వెనెజువెలా పై ఆధిపత్యం కనబరించింది అమెరికా.తమ దేశానికి మదురో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న ఒక నింద వేసి.. ఆయనపై నార్కో టెర్రరిస్టు ముద్ర వేసి జైల్లో ఉంచింది.అయితే ఇప్పుడు వెనెజువెలా చమురును ఎలా అమ్ముకోవాలనే యోచన చేస్తోంది ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం. భారత్ ఓకే అంటే వెనెజువెలా చమురును అమెరికా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందనే విషయాన్ని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.అసలు రష్యా చమురును భారత్ ఎందుకు ఆపాలనే దానిపై అమెరికా పెద్దలు స్పష్టంగా ఏమీ చెప్పరు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపడానికే ఒక కుంటిసాకు చెబుతూ వస్తున్నారు. ఉక్రెయిన్‌తో సుదీర్ఘ యుద్ధం నేపథ్యంలో రష్యా ఆర్థిక వ్యవస్థ కాస్త బలహీనపడింది.ఇప్పుడు ఆ దేశ చమురును భారత్ కొనుగోలు చేయకుండా ఆపేస్తే మరింత ఇబ్బందిని పుతిన్ ప్రభుత్వానికి చూపించాలనేది ట్రంప్ మార్క్ ఆలోచన అయి ఉండొచ్చు. అదే సమయంలో వెనెజువెలా చమురును భారత్‌కు సరఫరా చేసి క్యాష్ చేసుకోవచ్చు అనే ఉద్దేశమూ ట్రంప్‌లో కనిపిస్తోంది. అందుకు 500 శాతం సుంకాలంటూ ట్రంప్ భయపెట్టి పనిపెట్టున్నారు.భారత్ ఎంత వరకూ భయపడుతుందో లేదో అనే విషయాన్ని పక్కన పెడితే, వెనెజువెలా చమురులో నాణ్యతపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ చమురును బయటకు తీసిన తర్వాత విక్రయాలు జరపడానికి అధికంగా శ్రమించాల్సి ఉంటుందని, అప్పుడు కానీ అందులో నాణ్యత రాదని అంటున్నారు. ఒకవేళ సాధారణ ప్రాసెస్‌లో వెనెజువెలా చమురును అమ్మకాలు జరిపితే మాత్రం మరింత కాలుష్యానికి కారణం అవుతుందని విశ్లేషకుల అభిప్రాయం.ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అంతా స్వార్థపూరితమే కనిపిస్తోందని కాదనలేని సత్యం. కాస్త పెద్ద దేశాల్ని సుంకాలతో భయపెట్టడం, చిన్న దేశాలపైకి యుద్ధం పేరుతో దాడి చేయడం జరుగుతుంది. ఇరాన్ మొదలుకొని ఇప్పటి గ్రీన్‌లాండ్ వ్యవహారంలో కూడా ట్రంప్ ఇదే ధోరణి అవలంభిస్తున్నారు. పైకి శాంతి ప్రభోధకుడిగా చెప్పుకుంటూ.. తానొక నియంత అని నిరూపించుకుంటూనే ఉన్నారు ట్రంప్. బాగుపడితే మేమే బాగుపడాలి.. మేము అగ్రజులం అనే దుర్గ లక్షణం మాత్రం కనిపిస్తోంది.ఇప్పటికే యూఎన్‌ఓ కఠినమైన ఆంక్షలతో చెలరేగిపోతోంది. తమ మాట వినేవారికి ఒక రకంగా, వినని వారికి మరో రకంగా ట్రీట్‌మెంట్ ఇస్తూనే ఉంది. ట్రంప్ పాలన చేపట్టిన తర్వాత ఆంక్షల పర్వమే కనిపిస్తోంది. భారత్‌కు వెనెజువెలా చమురును అమ్మడానికి కొత్త గవర్నెన్స్‌ను తీసుకొస్తామంటోంది వైట్‌హౌస్. కచ్చితమైన నియమాలతో ఉండే కంట్రోల్డ్ ఫ్రేమ్ వర్క్ తర్వాత భారత్‌కు వెనెజువెలా చమురును అమ్ముతామని తెలిపింది.ఈ అంశంపై భారత్ ఎలా స్పందిస్తుంది అనేది చూడాలి. ఇంకా భారత్‌కు డాన్స్ ఉండటంతో 500 శాతం సుంకాలపై అమెరికా వాణిజ్య కార్యదర్శి లుట్నిక్ స్పష్టం చేసిన తర్వాతే వెనెజువెలా చమురు అంశాన్ని అమెరికా తెరపైకి తీసుకొచ్చింది. అంటే వన్ బై వన్ ప్రణాళిక ప్రకారమే ట్రంప్ వ్యూహం సిద్ధం చేసినట్లు కనబడుతోంది. బలవంతంగా భారత్ చేత ఎంతో కొంత చమురును కొనుగోలు చేయించేందుకు అమెరికా సన్నద్ధమైందనేది వరుసగా జరుగుతున్న పరిణామాల్ని బట్టి అర్థమవుతోంది.2022 తర్వాత భారత్‌కు రష్యా అతిపెద్ద చమురు సరఫరాదారుగా మారింది. రష్యా చమురు తక్కువ ధరలో లభిస్తోంది, అందుకే భారత్ ఎక్కువగా కొనుగోలు చేస్తోంది. 2025 నవంబర్‌లో భారత్ రష్యా నుంచి 7.7 మిలియన్ టన్నుల క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసింది.ఇది భారత మొత్తం చమురు దిగుమతుల్లో 35.1% వాటా కాగా, దాని విలువ 3.7 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉంది. భారత చమురు బిల్లు లో 34% భాగంగా ఉంది. జనవరి-అక్టోబర్ 2025లో రష్యా నుంచి దిగుమతులు గత సంవత్సరం కంటే 17.8% తగ్గాయి. అయితే అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత్ రష్యా చమురు కొనుగోళ్లు చేయడం తగ్గించింది.మరి ఇప్పుడు అమెరికా.. భారత్‌తో వాణిజ్య ఒప్పందంలో కచ్చితంగా వెనెజువెలా చమురు అంశాన్ని లేవనెత్తడం ఖాయం. అమెరికా వరుస గేమ్ ప్లాన్స్ కూడా అందుకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ముందుగా త్వరలో 500 శాతం సుంకాలు పెంపు అనడం,, ఇంకా భారత్‌తో ఒప్పందానికి సమయం ఉందని అనడం, ఇప్పుడు వెనెజువెలా చమురును భారత్‌కు అమ్మడానికి సిద్ధంగా ఉన్నామంటూ అమెరికా వైట్‌హౌస్ వర్గాలు అనడం?.. ఇవన్నీ కూడా ట్రంప్ ముందస్తు వ్యూహం కాక మరేమిటి.?

## పీఎఫ్ భాగ్యం మరింత మందికి దక్కుకుందా?



న్యూఢిల్లీ:దేశంలో ఉద్యోగుల సామాజిక భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసేందుకు సిద్ధమవుతోంది. తప్పనిసరి ఉద్యోగ భవిష్య నిధికు వర్తించే వేతన పరిమితిని పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఇది కార్యరూపం దాలిస్తే, ఇప్పటివరకు ఈపీఎఫ్ పరిధికి బయట ఉన్న లేదా పరిమిత ప్రయోజనాలకే పరిమితమైన లక్షలాది ఉద్యోగులకు అదనపు భద్రత లభించే అవకాశముంది. ప్రస్తుతం, ఒక ఉద్యోగి ప్రాథమిక జీతం డీఏతోకలిపిరూ.15,000 లేదా అంతకంటే తక్కువ ఉంటే మాత్రమే ఈపీఎఫ్ తప్పనిసరిగా వర్తిస్తోంది. ఈ పరిమితిని పెంచితే, మధ్యస్థ వేతనాలు (వేతన రూ.30 వేలవరకూ పెంచే అవకాశం) పొందే ఉద్యోగులు కూడా ఈపీఎఫ్ కవరేజీలోకి వస్తారు. ముఖ్యంగా ప్రైవేట్ రంగం, ఎంఎస్ఎంఈలు, సేవారంగాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుతం ఉన్నరూ.15వేలగరిష్ఠ వేతనపరిమితిచాలాకాలంగామారలేదు. 2014 సెప్టెంబర్‌లోదీన్ని నిర్ణయించారు. గత దశాబ్దకాలంలోజీతాలు, జీవన ఖర్చులు గణనీయంగా పెరిగాయి. కానీ పీఎఫ్‌పరిమితి మాత్రంమారకుండా అలాగేకొనసాగుతూ వస్తోంది.

### వేతనపరిమితిపెంచితే ప్రయోజనాలు

వేతనంతో పాటు సంస్థ వాటా కూడా ఈపీఎఫ్‌లో జమ కావడంతో దీర్ఘకాలిక పొదుపు పెరుగుతుంది. పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత మెరుగవుతుంది.ఈపీఎస్ పరిధి విస్తరించడంతో పెన్షన్ ప్రయోజనాలులభిస్తాయి.ఈపీఎఫ్‌కు చెల్లించే మొత్తాలపై పన్ను రాయితీలు ఉంటాయి. గృహ నిర్మాణం, వైద్యం, విద్య వంటి అవసరాలకు నిబంధనల ప్రకారం ఉపసంహరణ సౌకర్యం ఉంటుంది.వేతన పరిమితి పెంపుతో యాజమాన్యాలపై చెల్లింపుల భారం కొంత పెరగవచ్చు. అయితే, ఉద్యోగుల నిలుపుదల (రిటెన్షన్) మెరుగవడం, సామాజిక భద్రతతో కూడిన స్థిరమైన వర్క్‌ఫోర్స్ ఏర్పడటం వంటి దీర్ఘకాలిక లాభాలు సంస్థలకు దక్కుతాయని నిపుణులు చెబుతున్నారు.ప్రతిపాదనపై కార్మిక సంఘాలు, పరిశ్రమల ప్రతినిధులతో ప్రభుత్వం సంప్రదింపులు జరపనుంది. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇది అమలులోకి వస్తే, దేశంలో సామాజిక భద్రతా వ్యవస్థకు ఇది మరో కీలక మైలురాయిగా నిలవనుంది.

## హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

**అమెరికా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం**

కార్యకలాపాలను మరింత సరళతరం చేసేందుకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్స్ తగ్గడంతో పాటు వీసా దరఖాస్తుల పరిశీలన ఇతర సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పింది. వీసా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఫీజులు సరిదిద్దడమే తమ లక్ష్యమని కూడా వెల్లడించింది. వలసల కట్టడికి ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వివిధ మార్గాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చిక్కులు తప్పవని ఇటీవల భారతీయ ఎంబసీ ఎక్స్ వేదికగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

## బంగ్లాదేశ్‌లో మరో దారుణం

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు నానాటికీ పెరుగుతున్నాయి. ఇటీవలే ఇస్లాం వ్యతిరేక ఆరోపణలతో పలువురు హిందు మతానికి చెందిన వ్యక్తులపై దాడి చేసి చంపిన సంగతి తెలిసిందే.తాజాగా సునామ్‌గంజ్ అనే జిల్లాలో జోయ్ మహాపాత్ర అనే యువకుడిపై దాడి చేసి అనంతరం విషం ఇచ్చి చంపినట్లు అక్కడి మీడియా కథనాలు తెలిపాయి.బంగ్లాదేశ్ హింసతో అట్టుడికిపోతుంది ఇటీవల అక్కడి స్టూడెంట్ లీడర్ ఉస్మాన్ హాదీ మృతితో హిందువులపై తిరిగి మొదలైన దాడులు ఏమాత్రం తగ్గడం లేదు. గడిచిన 40 రోజుల్లోనే 12 మంది హిందువులు హత్యకు గురయ్యారంటే పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ దాడులకు స్పష్టమైన కారణం ఏమి లేకపోయినప్పటికీ.. అక్కడి మత ఛాందసవాదులు హిందువులే టార్గెట్‌గా దాడులు జరుపుతున్నారనేది కాదనలేని సత్యం ఈ నేపథ్యంలో హత్యలను భారత్ పలుమార్లు ఖండించింది మైనార్టీలపై దాడులు అరికట్టాలని కోరింది. ఇటీవల ఆ దేశ మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా అంత్యక్రియలకు సైతం భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ హాజరయి సంతాపం ప్రకటించారు.

## ఆపరేషన్ మదురో..

- అంత ఈజీగా ఎలా పట్టుకెళ్లారంటే..
- సైబర్ దాడితో సులభంగా మదురో పట్టివేత?
- ఎస్-300 రాడార్లను స్పూఫ్ చేసిన అమెరికా
- దాడికి అరగంట ముందే సైబర్ ఎటాక్?

కరాకస్:వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా అంత ఈజీగా ఎలా బంధించిందబ్బా?..వారం గడిచినా కూడా ఈ ప్రశ్న ప్రపంచాన్ని వేధిస్తూ ఉండొచ్చు. అయితే ఇందుకు అమెరికా సైన్యం ఉపయోగించిన ట్రిక్ ఏమిటో ఇప్పుడు బయటకు వచ్చింది!. ముందుగా సైబర్ ఎటాక్ చేసి.. ఆ తర్వాత భౌతిక దాడులకు దిగిందట. అయితే అదేం ఆషామాషీగా జరగలేదు. అందుకోసం తెర వెనుక పెద్ద తతంగమే నడిచింది. అదెంటో చూసేద్దాం మరి..వెనెజువెలాకు ఉన్న రష్యా తయారీ ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థలు, క్షిపణి విధ్వంసక వ్యవస్థలను అమెరికా అసలు అంత తేలికగా ఎలా చేదించగలిగింది?. సైబర్ దాడితో అమెరికా నిర్వీర్యం చేసిందా? రాడార్లను స్పూఫింగ్ చేసి మరీ కారకాస్‌లోకి చొచ్చుకుపోయిందా?..ఈ ప్రశ్నలకు అమెరికా సైబర్ నిపుణులు అవుననే సమాధానమిస్తున్నారు. అమెరికా సైనిక చర్య మొదలు కావడానికి.. అరగంట ముందు సైబర్ ఎటాక్‌తో అసలు తతంగం నడిచినట్లు వివరిస్తున్నారు.అమెరికా సేనలు నేరుగా తరలివచ్చి వెనెజువెలా అధ్యక్షుడు మదురో నివాసంపై నిఘా పెట్టాయి. ఏ సమయంలో అతను ఏ గదిలో ఉంటాడు? పడక గదికి చేరుకునే మార్గాలేమిటి? రాత్రిళ్ల ఎంతమంది అంగరక్షకులుంటారు? నిఘా ఏ విధంగా ఉంటుంది? పనివాళ్లు, వంటవాళ్ల వివరాలు.. ఇలా అన్ని అంశాలపై సమాచారాన్ని సేకరించింది.నిజానికి వెనెజువెలాపై అమెరికా ఈ నెల 3న దాడులు జరిపినా.. కొన్ని నెలల ముందే క్షేత్రస్థాయిలో 90శాతానికి పైగా ఆపరేషన్ పూర్తి చేసిందట. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ వివరాలు కూడా అందాయని తెలుస్తోంది. అందులో దాడి మొదలు పెడితే.. ఎంత సమయంలో టాస్క్ పూర్తవుతుందో వివరించారట. అన్నీ ఓకే అనుకున్నాక ట్రంప్ పచ్చజెండా ఊపగానే.. అమెరికా సేనలు రంగంలోకి దిగాయి.సైబర్ ప్రపంచంలో అమెరికా తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటూ..మైనస్ సున్నమనీగా కొనసాగుతోందని తెలిసింది. వెనెజువెలాపై ఆపరేషన్‌లో భాగంగా.. కారకస్‌లోని మదురో నివాసంపై దాడికి అరగంట ముందే.. అమెరికా సైబర్ కమాండ్ కంట్రోల్ కేంద్రం యాక్టివేట్ అయ్యింది. సైబర్ కమాండ్ సిబ్బంది తొలుత వెనెజువెలా రాజధాని కారకస్‌కు విద్యుత్ సరఫరా చేసే వ్యవస్థపై సైబర్ ఎటాక్ చేశారు. దాంతో.. ఆ నగరం అంధకారంలో మునిగిపోయింది. ఆల్సాంపు చేయకుండా.. ఆ వెంటనే రక్షణ వ్యవస్థను టార్గెట్ చేశారు.రాడార్ స్పూఫింగ్ జరిగిందని.. అమెరికా సేనలు 150 యుద్ధ విమానాల్లో వెనెజువెలా సరిహద్దుల్లోకి ప్రవేశించినా ఒక్కటంటే ఒక్క రాడార్ కూడా పసిగట్టలేకపోయింది. దాంతో.. రష్యా సరఫరా అయిన ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థలు నిర్వీర్యంగా మారిపోయాయి. ఈ ఆపరేషన్ తర్వాత డొనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో "మా ప్రత్యేక నైపుణ్యం కారణంగా.. కారకస్‌లో విద్యుత్ నిలిచిపోయేలా చేశాం" అంటూ పోస్ట్ చేయడం తెలిసిందే. అంతేకాదు.. ఈ దాడి తర్వాత వెనెజువెలా కూడా తమ జాతీయ పవర్‌గ్రిడ్ (గురి డ్యామ్ నెట్‌వర్క్)ను అమెరికా టార్గెట్‌గా చేసుకుందని ప్రకటించింది. విద్యుత్ నిలిచిపోవడం వల్ల వెనెజువెలా సైన్యం కమ్యూనికేషన్ వ్యవస్థలు కూడా పనిచేయలేదని తెలుస్తోంది.అమెరికా సైబర్ కమాండ్ ఈ దాడిలో విజయం సాధించడం ఇదే మొదటిసారి కాదు. వెనెజువెలా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌పై నిఘా ఏళ్ల తరబడిగా కొనసాగుతోందని ఇప్పుడు వెల్లడైంది. తొలుత.. కంప్యూటర్లు, విద్యుత్ సరఫరా వ్యవస్థల్లో మాల్‌వేర్‌ను చొప్పించారు. ఈ మాల్‌వేర్ ద్వారా అమెరికా సైబర్ కమాండ్ విద్యుత్ వ్యవస్థ కంట్రోల్‌లోకి చొరబడి.. 'పింగ్' చేశారు. అంతే.. యావత్ విద్యుత్ వ్యవస్థ ధమాల్ అయిపోయింది. మొత్తం కారకస్ నగరానికి విద్యుత్ నిలిచిపోయింది.

# ఎస్టీ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ11.30 కోట్లు మంజూరు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 10 (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, తండాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి గాను రూ11 కోట్ల 30 లక్షల ట్రైబల్ వెల్ఫేర్ నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ నిధులతో ముఖ్యంగా ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేని అన్‌కనెక్టెడ్ ఎస్టీ తండాలకు రోడ్డు సదుపాయం కలుగుతుందన్నారు. వేములవాడ నియోజకవర్గంలో పలు మండలాల పరిధిలో ఉన్న గిరిజన తండాలకు రోడ్ల మంజూరు కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను కోరగా వారు స్పందించి వెంటనే రూ11.30 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు.కథలాపూర్ మండలం పరిధిలోని ఇప్పపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నుండి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 3 కోట్లు, భూషణ్రావు పేట గ్రామంలో కోనాపూర్ మెయిన్ రోడ్డు నుండి వాసంగుట్ట వరకు రూ1 కోటి 20 లక్షలు, భూషణ్రావుపేట మెయిన్ రోడ్డు కచూరాల బాట నుండి చింతకుంట రాజారాం తండా వరకు రూ 3 కోట్లు 60 లక్షలు మంజూరు అయ్యయన్నారు.కోనారావుపేట మండలం పరిధిలో హనుమన్ తండా నుండి భూక్యా రెడ్డి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 1 కోటి,రుద్రంగి మండల కేంద్రంలో రుద్రంగి నుండి దసరా నాయక్ తండా వరకు సీసీ అప్రోచ్ రోడ్డు మరియు హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ 2 కోట్లు 50 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.గతంలో కూడ వేములవాడ నియోజకవర్గంలో పలు



అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని, రుద్రంగి మండలం కేంద్రంలో కుక్కల గండి తండా బీటీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ 4 కోట్లు 57 లక్షలు, కథలాపూర్ మండలంలో కలికోట మెయిన్ రోడ్డు నుండి పోతారం లొంక రామన్న గుడి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 5 కోట్లు 30 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఈ రోడ్ల నిర్మాణం పూర్తవడం వల్ల గిరిజన గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం లభించడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించిన సిఎం రేవంత్ రెడ్డి,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వేములవాడ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరవేయడం ఖాయం

**బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**



**వేములవాడ, జనవరి 10 (జనంసాక్షి) :** వేములవాడ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి సంఘ భవనంలో మీడియా మిత్రుల సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్య క్షేత్రమైన రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేసి రెండు నెలలు కావస్తున్నా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ఊరంతా కూల్చివేతలు చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఎమ్మెల్యే, తక్షణమే స్పందించి మహాశివరాత్రి లోపు రాజన్న దర్శనాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వేములవాడ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.జిల్లా ఇన్చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఒట్టి మాటలతో కాలయాపన చేస్తోంది తప్ప ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని, ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నేతలు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ వేములవాడలో ఆకాశగంగ పైపు లైను వంటి ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు బీజేపీ హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని ప్రజలకు విన్నవించారు. అంతకుముందు, వెయ్యేళ్ల క్రితం సోమనాథ్ ఆలయంలో పూజలు ప్రారంభమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని భీమేశ్వరాలయంలో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఓంకార జపం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, మాజీ కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, గడ్డమీదశీను,పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి వీర్ గాథ

## అవార్డుకు ఎంపికైన పారమిత విద్యార్థిని

**పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు**



**కరీంనగర్, జనవరి 10 (జనంసాక్షి) :** రక్షణ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించే వీర్ గాథ ప్రాజెక్ట్ 5.0, 2025 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా 1.92 కోట్ల మంది విద్యార్థులు ప్రాథమిక మాధ్యమిక, ఉన్నత విభాగాలలో పాల్గొన్నారు. జిల్లా, రాష్ట్రీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అన్ని రాష్ట్రాల నుంచి 100 మంది విద్యార్థులను "సూపర్ 100" గా ఎంపిక చేయడం జరిగింది. పారమిత హెరిటేజ్ పాఠశాలకి చెందిన 9వ తరగతి విద్యార్థిని కృతి యెన్నం జాతీయ స్థాయిలో వీర్ గాథ 5.0 "సూపర్ 100" విజేతలలో ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోపికృష్ణ తెలిపారు. వీర్ గాథ 5.0 ప్రాజెక్ట్ భారతదేశ యోధులు/శౌర్య అవార్డు విజేతల విజయాల గురించి కవిత, పేరా, వ్యాసం, పెయింటింగ్ వంటి కళ-సమగ్ర కార్యకలాపాలపై నిర్వహించింది. న్యూఢిల్లీలోనీ కర్తవ్య పథ్ లో జరిగే 2026 గణతంత్ర దినోత్సవ పరెడ్ కు ప్రత్యేక అతిథిగా ఆహ్వానిస్తూ "సూపర్ 100" విజేతలను సత్కరిస్తారు. విద్యార్థినికి రూ. 10,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, రష్మిత, రాకేష్, అనుకర్ రావు, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు రాము,గైడ్ టీచర్ వినయ్ ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## కథలాపూర్ మండలానికి నిధుల వరద

- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.7.80 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



**కోరుట్ల జనవరి 10(జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండల పరిధిలో గిరిజన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. పలు అన్‌కనెక్టెడ్ ఎస్టీ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.7 కోట్ల 80 లక్షల ట్రైబల్ వెల్ఫేర్ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కథలాపూర్ మండల పరిధిలోని గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను కోరగా, సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసింది. కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నుంచి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, భూషణ్రావుపేట గ్రామంలో కోనాపూర్ మెయిన్ రోడ్డునుంచి వాసం గుట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి 20 లక్షలు,భూషణ్రావుపేట మెయిన్ రోడ్డు కచూరాల బాట నుంచి చింతకుంట రాజారాం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల 60 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు రవాణా సౌకర్యం స్థానికులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. కథలాపూర్ మండలానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

## రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

**విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి**

**రైతు పొలం బాట కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు.**



**తంగళ్ళపల్లి జనవరి 10 (జనంసాక్షి):** తంగళ్ళపల్లి మండలం గండి లచ్చపేట గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పొలం బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ ప్రమాదాల నివారణలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించడం జరిగింది.నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.వ్యవసాయ పొలాల వద్ద ఉన్నటువంటి ట్రాన్స్ఫార్మర్ల వద్ద సమస్యలు ఏర్పడితే రైతులు నేరుగా మరమ్మతులు చేయవద్దని అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారి ద్వారానే పనులు చేయించాలని సూచించారు. లేదంటే విద్యుత్ ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సెస్ సంస్థ మనందరిదని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగిటి అంజయ్య ,విద్యుత్ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వెన్నెముక సర్జరీకి భయపడాల్సిన పనిలేదు

- అందుబాటులోకి అత్యాధునిక ఎండోస్కోపిక్ సర్జరీ
- మెడికవర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 10 (జనంసాక్షి):** వెన్నెముక సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని, సర్జరీలకు భయపడాల్సిన పనిలేదని మెడికవర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా న్యూరో సర్జన్ డాడా.రాజీవ్ రెడ్డి శనివారం రోజు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... స్పైన్ సర్జరీలపై వివరించారు. నడుం నొప్పి వచ్చిన ప్రారంభంలోనే స్పైన్ సర్జరీ చేయించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. గతంలో మాదిరిగా స్పైన్ ఓపెన్ సర్జరీలు లేవని, ఉత్తర తెలంగాణలోనే మొదటి సారిగా మెడికవర్‌లో అత్యాధునిక ఎండోస్కోపిక్ సర్జరీ అందుబాటులోకి రావడంతోకీ హోల్‌తో తక్కువ సమయంలో ఖచ్చితత్వంతో సర్జరీ పూర్తవుతుందన్నారు. ఒకటి రెండు రోజుల్లోనే పేషెంట్ రికవరీ ఉంటుందని, సాదారణంగా అన్ని పనులు చేసుకునే వీలు కలుగుతుందన్నారు. ఈ సర్జరీతో మజిల్ డ్యామెజ్, బోన్ రిమూవల్ చాలా తక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు, కూలీ పనులు చేసుకునే వారికి డిస్క్‌పై ఒత్తిడి పెరిగి లో బ్యాక్ పెయిన్‌తో బాధపడుతుంటారని కీ హోల్ సర్జరీ వీరికి ఎంతో మేలు చేస్తుందన్నారు. తిరిగి యధావిధిగా పనులు చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. నడుం నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా నిపుణులైన వైద్యులు, ఎండోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్న ఆసుపత్రిలో సర్జరీ చేయించుకుంటే త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపవచ్చన్నారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, క్రిటికల్‌కేర్ నిపుణులు డాక్టర్ పల్లవి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

# అధికారుల అండతో అటవి భూములు మాయం

**చూసి చూడనట్టు పోతున్న అటవీశాఖ అధికారులు**



**గంభీరావుపేట, జనవరి 10 (జనంసాక్షి):** అధికారుల అండతో అడవులను నరుకుతూ ఇష్టారీతిన భూములను మాయం చేస్తున్న సంఘటన మండలానికి చెందిన ముచ్చర్ల గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెలితే గ్రామంలోని కావేటి రేణుక, కావేటి రాములు అనే ఇద్దరు రైతులు తమ పంట పొలాలు గ్రామంలోని అటవి ప్రాంతంలో ఉండడంతో గత కొన్ని సంవత్సరాలుగా పంటలు పండించుకుంటున్నారు. కాగా ఈ మద్యలో భూములకు విపరీతమైన డిమాండ్ రావడంతో పక్కన ఉన్న అటవిపై వారి ఇద్దరి కన్ను పడి పక్కన ఉన్న అడవులను నరుకుతూ భూమి చదును చేసుకుంటూ పంట పండిస్తున్నారు. ఇద్దరి మద్యలో గతంలో తీసిన కందుకం ఉండేది అయితే అక్కడే వచ్చింది ఇద్దరి మధ్య గొడవ. గతంలో కావేటి బాలమల్లు, కావేటి రాములు ఇరువురు కలిసి మద్యలో ఉన్న కందుకంను పూడ్చి అందిన కాడికి భూమిని చదును చేసుకున్నారు. ఇప్పుడు ఇద్దరి మద్యలో ఇంకా కొంచం మిగిలిన కందుకంను రాములు మూడు నాలుగు రోజుల క్రితం పూడ్చాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ కాస్తా పెద్దదై పంచాయతి వరకూ వెళ్ళింది. దీంతో ఫారెస్టు అధికారుల అండ. నిర్లక్ష్యం వేరసి ఇలా ఇష్టారీతిన భూములను చదును చేస్తున్నారని ఒకరిపై ఒకరు గొడవ పడుతున్నారు. విషయంపై ఫారెస్టు అధికారును వివరణ కోరగా అక్కడ జరిగింది మాకు తెలియదని, వెంటనే బీట్ అధికారిని సంఘటన స్థలానికి పెంపించారు. సదరు ఆఫీసరు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులు చెట్లను నరికి భూములను చదిన చెశారని గ్రహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ముచ్చర్ల పరిధిలోని అడవిని నరకడం, అటవీ భూములను చదును చేయడం చూస్తుంటే ఫారెస్టు అధికారుల నిర్లక్ష్యంతో పాటు వారి అండదండలు గ్రామంలోని రైతులపై ఉందనే సందేహం రాక ఉండదూ. ఇప్పటికైన క్షేత్ర స్థాయిలో వి చారణ జరిపి అటవీ భూములను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అభివృద్ధి సంక్షేమానికి పట్టం కట్టండి



- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విప్

**వేములవాడ, జనవరి 10 (జనంసాక్షి):** అభివృద్ధి సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.శనివారం వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం అయిన శాత్రాజ్ పల్లి 1 వ,2 వార్డు పరిధిలో 23 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ నిలబడి వాటిని పరిష్కరిస్తూ ముందుకు పోతున్నారు.శత్రాజిపల్లి లో సూమరు 1 కోటి 43 లక్షలతో పేద ప్రజలకు ఉపయోగ పడేల ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావస్తుందన్నారు.ఇక్కడ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడమా వలన చుట్టూ పక్కల గ్రామాలకు శాత్రాజ్ పల్లి ఒక హబ్ గా మారుతుందని తెలిపారు.త్వరలోనే ఆసుపత్రి ప్రారంభం చేసుకుందామన్నారు.శాత్రాజ్ పల్లి లో సుమారు 15 లక్షలతో ప్రధాన కూడలిలో నూతన జంక్షన్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి అని విప్ తెలిపారు.45 మందికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని వాటి నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.ఇందులో అడుగు స్థలం లేని 11 మందికి బస్ డిపో పక్కన ఇల్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి సుమారు 1,2 వార్డులకు 4 కోట్ల పై చిలుకు నిధులు కేటాయించామని తెలిపారు.గత 50 సంవత్సరాలుగా వేములవాడ పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న చిరకాల కోరిక రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయి,గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి కేవలం రంగు రంగుల వీడియోల్లో మాత్రమే చేపట్టారని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.పట్టణంలో సుమారు 2000 మంది అడుగు జాగా లేని ప్రజలకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు..10 కోట్లతో మురుగు నీరు గుడి చేరవు,మూలవాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గతఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని అందులో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,నూతన రేషన్ కార్డులు మంజూరు చేసిందని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల ఊబిలో ముంచారని విమర్శించారు. కాల్వ లో ఏవైనా పిచ్చి మొక్కలు ఉంటే వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన విప్1 కోటి 43 లక్షలతో నిర్మాణం అవుతున్న 30 పడుకల ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వవిప్ పరిశీలించారు.. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు,మున్సిపల్ కమిషనర్ అన్వేష్,మాజీ కౌన్సిలర్ సంగ హన్మవ్వ ,డీసీసీ ఉప అధ్యక్షులు సంగ స్వామి యాదవ్ నాయకులు లింగంపల్లి కిరణ్,పొన్నాల మోహన్,స్తంభంపల్లి తిరుపతి,కిషన్, తిరుపతి,అంజయ్య కొమురయ్య,లక్ష్మి రాజానీ తదితరులు ఉన్నారు.

## కులదీప్ సింగ్‌కు బెయిల్ ఇవ్వడం సిగ్గుచేటు



**బోధన్, జనవరి 10 (జనంసాక్షి) :** ఉన్నావ్ పై లైంగిక దాడికి పాల్పడిన కుల్దీప్ సింగ్ కు బెయిలు ఇవ్వడం సిగ్గుచేటని పిఓడబ్ల్యూ బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి నాగమణి ఆరోపించారు. శనివారం నాడు బోధన్ పట్టణంలోని రాకాసి పేట్ లో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి మాట్లాడుతూ, అమానుష లైంగిక దాడికి పాల్పడిన కులదీప్ సింగ్ సెంగార్ ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడం సరైనది కాదని, 2017లో ఉన్నావ్ పై లైంగిక దాడికి పాల్పడిన నేరానికి కులదీప్ సింగ్ కు యావత్ జీవ శిక్షను విధించగా, అట్టి శిక్షను నిలిపివేస్తూ ఆయనను విడుదల చేయాలని ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇవ్వడం సరైంది కాదని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కులదీప్ కు బలమైన సంబంధాలు ఉన్న కారణంగా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత చూపాయని అన్నారు. న్యాయ విచారణ సందర్భంలోనే బాధితురాలి సమీప బంధువుల్ని చంపేయడం ద్వారా సాక్షాదారాలను మటుమాయం చేసే ప్రయత్నం జరిగిందని మండిపడ్డారు.అత్యాచార బాధితురాలికి సరి అయిన న్యాయం చేయాలని, కులదీప్ సింగుకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు బీపాషా బేగం, మంజుల, రేణుక, జ్యోతి, కళావతి, కల్పన, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆదరణ చూసి ఓర్వలేకే అసత్య ప్రచారాలు




**కమ్మరపల్లి 10 జనవరి(జనంసాక్షి):** బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పెరుగుతున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారు.మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రోజు విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య,రాష్ట్ర అధికార ప్రతినిధి బస వేణుగోపాల్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి మాట్లాడుతూ ఆరెంజ్ ట్రావెల్స్ జీఎస్టీ విషయంపై గత రెండు రోజులుగా బాల్కొండ నియోజవర్గంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అతి ఉత్సాహం ప్రదర్శిస్తూ విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నిస్వార్ధంగా ప్రజా సేవ చేస్తున్న నాయకుడిపై ఇలా అసత్య ప్రచారాలు చేయడం ఇకనైనా మానుకోవాలని హితవుపలికారు. ఎవరు అవినీతి పరులో నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసునని 2014 కి ముందు మీ ఆస్తులు ఎంత ఇప్పుడు మీ ఆస్తుల లెక్కింత అనేది ప్రజలందరికీ తెలుసున్నారు.వ్యక్తిగత వ్యాపార విషయాలను రాజకీయ కోణం చూస్తూ ప్రజా నాయకుడిని కించపరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఆరంజ్ ట్రావెల్స్ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తూ జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన సంస్థని పేర్కొన్నారు. కరోన లాక్ డౌన్ సమయంలో ఆరెంజ్ ట్రావెల్స్ ఎన్నో ఉచిత ప్రయాణాలు మరెన్నో సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివనోళ్ల శివకుమార్, జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందేర్, సర్పంచ్ రేవతి గంగాధర్, అజ్మీద్ పాషా,సల్లూరు గణేష్ నిమ్మ ప్రసాద్,బుచ్చి మల్లయ్య, వేములవాడ జగదీశ్ ,నరేందర్,గంగారాం, రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ



**శంకరపట్నం, జనవరి 10 (జనంసాక్షి):** రాష్ట్ర యువజన క్రీడా విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి శంకరపట్నం మీదుగా వరంగల్ కు వెళున్న సీఎం కప్ టార్చ్ ర్యాలీలో కేశవపట్నం క్రీడాకారులు పాల్గొన్నారు. కేశవపట్నం గ్రామ ఉపసర్పంచ్ అకుబత్తిని విజయ్ కుమార్ సీఎం కప్ టార్చ్ ను వెలిగించి అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకు వివిధ విభాగాల క్రీడాకారులు టార్చ్ను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా తాడికల్ కి చేరుకున్న టార్చ్ర్యాలిని తాడికల్ క్రీడకారులు ఘనంగా స్వాగతించారు. గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత తిరుపతి ర్యాలిని ప్రారంభించారు. ఈ ర్యాలీ మండలంలోని తాడికల్, వంకాయగూడెం, కేశవపట్నం, మొలంగూర్, కొత్తగట్టు, హుజురాబాద్ మీదుగా ఇతర ప్రాంతలకు వెలుతుంధి. ఈ కార్యక్రమములో కేశవపట్నం వార్డు సభ్యుడు మొయిన్, క్రీడాకారులు వంగోజు సంపత్, పావురాలా శ్రీనివాస్, బొజ్జ చంద్రమౌళి, నాయకులు రాజకోమురయ్య, జనగం బుచ్చయ్య, బొంగోని అభిలాష్, గుర్రం శ్రీకాంత్, తాళ్లపల్లి శ్రీనివాస్, పంజాల పరుశరాములు, బొంగోని చందు, గుర్రం ప్రవీణ్, బొంగోని శ్రావణ్ పాల్గొన్నారు.

# అక్షర జాతరకు 'నీరాజనం'




- రికార్డు స్థాయిలో పుస్తకాల అమ్మకాలు
- 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో రూ. 1.57 కోట్ల ఆదాయం.. రూ.1.31 కోట్ల ఖర్చు

**హైదరాబాద్, (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో అక్షర పండుగ దిగ్విజయంగా ముగిసింది. సోషల్ మీడియా యుగంలోనూ పుస్తక పఠనం తగ్గలేదని, చదువరుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని ఈ ఏడాది జరిగిన 38వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన నిరూపించింది. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో బుక్ ఫెయిర్ సొసైటీ ప్రతినిధులు ప్రదర్శన ముగింపు వివరాలను, సమగ్ర ఆదాయవ్యయాలను అధికారికంగా వెల్లడించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు, కవి యాకూబ్ మాట్లాడుతూ.. "పుస్తక పఠనం కనుమరుగవుతుందన్న వాదనలను ఈసారి వచ్చిన భారీ జనసందోహం పటాపంచలు చేసింది. లక్షలాదిగా తరలివచ్చిన యువతే తెలంగాణలో వస్తున్న జ్ఞానవంతమైన మార్పుకు నిదర్శనం" అని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి అద్దం పట్టేలా ప్రాంగణానికి అందెశ్రీ పేరుతో పాటు, వివిధ వేదికలకు అలిశెట్టి రజిత, వెంకట్ గౌడ్ వంటి మహనీయుల పేర్లు పెట్టి నివాళి అర్పించామన్నారు. సొసైటీ కార్యదర్శి వాసు మాట్లాడుతూ.. 11 రోజుల పాటు సాగిన ఈ ప్రదర్శనలో సుమారు రూ. 8 కోట్లకు పైగా విలువైన పుస్తకాలు అమ్ముడయ్యాయని, ఇది ఒక రికార్డని తెలిపారు. దేశంలోనే మూడవ అత్యుత్తమ బుక్ ఫేర్‌గా హైదరాబాద్ ఎదిగిందని గర్వంగా ప్రకటించారు. 1250 మంది విద్యార్థులతో నిర్వహించిన 'బాలోత్సవ్', డిసెంబర్ 24న జరిగిన 'పుస్తక వాక్' కార్యక్రమాలు ప్రజలలో విశేషమైన చైతన్యాన్ని నింపాయని వివరించారు.

**భవిష్యత్తు లక్ష్యం.. లిటరరీ ఫెస్టివల్**

హైదరాబాద్ బుక్ ఫేర్‌ను త్వరలో పూర్తిస్థాయి 'లిటరరీ ఫెస్టివల్'గా తీర్చిదిద్దుతామని సొసైటీ ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది 'పుస్తక స్ఫూర్తి' చర్చా గోష్ఠుల్లో 300 మంది ప్రముఖులు పాల్గొన్నారని, కొంపల్లి వెంకట్ గౌడ్ వేదికపై రికార్డు స్థాయిలో 54 పుస్తకాలు ఆవిష్కృతమయ్యాయని వివరించారు. సామాజిక బాధ్యతలో భాగంగా చేపట్టిన 'పల్లెకు పుస్తకం' కార్యక్రమం ద్వారా సేకరించిన వేలాది పుస్తకాలను గ్రామాల్లోని గ్రంథాలయాలకు అందిస్తామన్నారు. ఒకప్పుడు కేవలం వ్యాపార వేదికగా ప్రారంభమైన ఈ ప్రస్థానం, నేడు తెలంగాణ మేధోశక్తికి ప్రతీకగా మారిందని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం ఆదాయం: రూ.1,57,85,840/- (స్టాళ్ల రుసుము, స్పాన్సర్లు, టికెట్లు తదితరాల ద్వారా), మొత్తం ఖర్చు: రూ.1,31,60,431/- (నిర్మాణం, పబ్లిసిటీ, మెయింటెనెన్స్ తదితరాలు). ఈ వివరాలన్నింటినీ త్వరలోనే అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి పి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు బి శోభన్ బాబు, సంయుక్త కార్యదర్శులు కె సురేష్, ఎం.సూరిబాబు, కార్యవర్గ సభ్యులు ఎ జనార్ధన్ గుప్త, జి విజయారావు, ఎన్. మధుకర్, ఎన్. కోటేశ్వరరావు,ఆర్.శ్రీకాంత్, యు.శ్రీనివా సరావు, టి.సాంబశివరావు, స్వరాజ్ కుమార్ పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం ప్రభుత్వ వైద్యశాలలు

- నర్సింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో డీఎంఈ
- 2వ రాష్ట్ర స్థాయి నర్సింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ విజయవంతం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిలోఫర్ హాస్పిటల్ ఫర్ విమెన్ అండ్ చిల్డ్రన్‌లో శనివారం 2వ రాష్ట్ర స్థాయి నర్సింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవంతంగా నిర్వహించబడింది. నట్కో బిల్డింగ్ ఆడిటోరియంలో నర్సింగ్‌లో ముఖ్య అంశాలు, పీర్ రివ్యూ జరపగా.. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల నుంచి పెద్దఎత్తున నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. 200 మందికి పైగా డెలిగేట్లు హాజరై, కార్యక్రమాన్ని బాగా అభినందించారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ ఎ. నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, నర్సింగ్ ఆఫీసర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ వైద్యశాలలు లాభాపేక్ష లేకుండా ప్రతి రోగిని అక్కున చేర్చుకొని సేవలు అందిస్తున్నాయని, సేవకు ప్రతిరూపం ప్రభుత్వ వైద్యశాలలు అని ఆయన పేర్కొన్నారు. కాలానుగుణ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఇలాంటి కాన్ఫరెన్స్‌ల ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవాలని సూచించారు. నర్సింగ్ వృత్తిలో రోల్ మోడల్‌గా ఉండాలి, నిబద్ధతతో సేవలు అందించాలి, గౌరవంతో ఒకరినొకరు నేర్చుకోవాలి, నాణ్యమైన, సురక్షితమైన రోగి సేవలు అందించాలని ఉద్ఘాటించారు. నిరంతర విద్య, వర్క్‌షాప్‌ల ద్వారా జ్ఞానం, నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయడం ముఖ్యమని తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి (ప్రెసిడెంట్ ట్రెయిన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగం), డాక్టర్ విద్యులత (డిప్యూటీ డైరెక్టర్, నర్సింగ్ విభాగం గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ), డాక్టర్ జ్యోతి శర్మ (జనరల్ మేనేజర్ నర్సింగ్ విభాగం యశోద హాస్పిటల్ సికింద్రాబాద్), డాక్టర్ విజయ్ కుమార్ (మెడికల్ సూపరింటెండెంట్, నిలోఫర్ హాస్పిటల్), సీఎస్ఆర్ఎమ్‌వో డాక్టర్ ఆనంద్, డాక్టర్ స్వప్న (నియోనెటలాజి విభాగం అధిపతి నిలోఫర్ వైద్యశాల), చీఫ్ నర్సింగ్ ఆఫీసర్లు బాలమణి, కరుణ, డాక్టర్ లాలు ప్రసాద్ (డీసీఎస్‌ఆ ర్ఎంఓ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం సెక్రటరీ జనరల్), లక్ష్మణ్ రుదవత్ (నర్సింగ్ ఆఫీసర్, తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ), ఇతర నర్సింగ్ ఆఫీసర్లు కృష్ణ, సోమేష్, పాండు, నవనీత, మానస, యూనిస్, దీపిక, అనురాధ, ఇందిరా పాల్గొన్నారు.

## మహిళా ఐఏఎస్ అధికారులపై అసభ్య, అనుచిత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

**మంత్రి సీతక్క**



**హైదరాబాద్, (జనంసాక్షి) :** మహిళా ఐఏఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు అసభ్యంగా, అనుచితంగా, దూషణాత్మకంగా వార్తలు, వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజాసేవలో నిమగ్నమైన మహిళా ఐఏఎస్ అధికారుల గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె అన్నారు. మహిళలు ఉన్నత స్థాయిలకు చేరితే వాటిని తట్టుకోలేని ఫ్యూడల్ మానసికతే ఈ రకమైన దుష్ప్రచారాలకు మూలమని ఆమె విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తోందని, అటువంటి పరిస్థితుల్లో మహిళా అధికారులను కించపరిచే వ్యాఖ్యలను, వారి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రచారాన్ని సహించబోమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా ఐఏఎస్ అధికారులు తమ బాధ్యతలను ధైర్యంగా, నిబద్ధతతో నిర్వహిస్తున్నారని, వారి వెనుక రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా నిలుస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ తరహా దూషణలు, అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలపై ద్వేషం, అవమానంతో కూడిన ప్రచారానికి సమాజం మొత్తం వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్యాన్ని, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## ప్రెస్ క్లబ్ జర్నల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, (జనంసాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్ క్లబ్ జర్నల్ ను మంత్రి సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు. తెలుగు ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెల ప్రెస్ క్లబ్ జర్నలను రూపొందించడం అభినందనీయమని పొంగులేటి సందర్భంగా ప్రశంసించారు. ఈ జర్నల్లో జర్నలిస్టులకు సంబంధించిన సమకాలిన అంశాలు పొందుపరచడం సంతోషకరమని పొంగులేటి గారు చెప్పారు. ప్రెస్ క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి మూడు నెలలు అయినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను రూపొందించామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయకుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ప్రెస్ క్లబ్ సభ్యు లందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటు ందని మంత్రికి వివరించారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ జర్నల్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్ల బ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్. ఉమాదేవి, రచన ముదుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై ఎంఎల్ఆర్ఐటీకి అవార్డుల పంట



**మల్కాజిగిరి జనవరి 10(జనంసాక్షి):** విద్యలో సాంకేతికతను జోడించి విద్యార్థులను భావి పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు మేము చేస్తున్న కృషికి ఈ అంతర్జాతీయ అవార్డులే నిదర్శనమని ఎంఎల్ఆర్ఐటి కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.సాంకేతిక విద్యలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందుకు గాను దుండిగల్ లోని ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించిందని ఆ కళాశాల వ్యవస్థాపకులు ఒక ప్రకటనలో తెలిపారు.బెంగళూరులోని గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఐసిటిఐఈఈ 2026 సదస్సులో ఈ కళాశాల పలు ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకుంది.ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తలు పాల్గొన్న ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ద్వారా విద్యా రంగంలో తీసుకొస్తున్న మార్పులపై చర్చించారు. ఇందులో ఎంఎల్ఆర్ఐటీకి ఉత్తమ విద్యార్థి విభాగం (ఈడబ్లుబి) విద్యార్థుల భాగస్వామ్యం, సేవా కార్యక్రమాల్లో అగ్రస్థానంలో నిలిచింది.ఈ ఘనత సాధించిన అధ్యాపక బృందాన్ని, విద్యార్థులను కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యలో సాంకేతికతను జోడించి, విద్యార్థులను భావి పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు మేము చేస్తున్న కృషికి ఈ అంతర్జాతీయ అవార్డులే నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యం గా కృత్రిమ మేధస్సు ఏ ఐ వంటి ఆధునిక రంగాలలో ఎంఎల్ఆర్ఐటీ నిరంతరం ముందుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీవైకి గణనీయమైన అవకాశం ఉంది







- అసంఘటిత రంగంలోని ఉద్యోగులను చురుగ్గా చేర్చుకోవాలి
- తెలంగాణ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ పిలుపు

**హైదరాబాద్, జనవరి 10 (జనంసాక్షి) :** భారత ప్రభుత్వ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) తెలంగాణలోని బ్యాంకులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ల కోసం జనవరి 9న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టాఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పీఎఫ్ఆర్డీఏ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రవేశ్ కుమార్ మాట్లాడుతూ.. అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) ప్రధాన విజయాలను హైలైట్ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత దేశవ్యాప్తంగా ఒక కోటి మంది చందాదారులను అత్యంత వేగంగా చేర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో అన్ని బ్యాంకులు కలిసి ఏపీవై పథకం కింద మొత్తం 8.59 కోట్ల మంది చందాదారులను చేర్చాయి. తెలంగాణలో, బ్యాంకులు కలిసి 2025-26 ఆర్థిక సంవత్సరానికి తమ వార్షిక ఏపీవై లక్ష్యాలలో 61% సాధించాయని, రాష్ట్రం లక్ష్యాలను అధిగమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలో కూడా ఏపీవైకి గణనీయమైన అవకాశం ఉందని నొక్కి చెబుతూ, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులను చురుకుగా చేర్చుకోవాలని ఆయన బ్యాంకులను కోరారు. దీర్ఘకాల ప్రభుత్వ హామీ, హామీతో కూడిన పెన్షన్ ప్రయోజనాలు, అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక భద్రతతో సహా ఏపీవై యొక్క ప్రత్యేక బలాగాలను ఆయన పునరుద్ఘాటించారు, ఆర్థిక సమ్మిళితాన్ని మరింతగా విస్తరించడానికి తీవ్ర ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌బిఐ, ఎస్ఎల్‌బిసి డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియవ్రత మిశ్రా మాట్లాడుతూ, వృద్ధాప్యంలో పౌరులకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ఉన్న ఏపీవై పథకాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని బ్యాంకులు 31.12.2025 నాటికి 2,98,658 మంది చందాదారులను చేర్చాయని ఆయన తెలిపారు. చందాదారులను పెంచడానికి ప్రజలలో అవగాహన కల్పించడమే కీలకమని ఆయన ఇంకా అన్నారు. రాష్ట్రంలోని బ్యాంకులు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు, బ్రాంచులు, బీసీ/సీఎస్పీలు మొదలైన వివిధ వేదికల ద్వారా ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నాబార్డ్ డిజిఎం దీప్తి సునీల్, ఆర్‌బిఐ ఏజిఎం మహమ్మద్ జయౌర్ రెహమాన్, యుబిఐ హెడ్-యుఎల్‌ఏ దీపక్ ఎన్ ఎస్ కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ఆర్డీఏ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రవేశ్ కుమార్, జనరల్ మేనేజర్ దౌలత్ అలీ ఖాన్, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియవ్రత మిశ్రా, నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి సునీల్, ఆర్‌బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహమ్మద్ జయౌర్ రెహమాన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెడ్ - యుఎల్‌ఏ దీపక్ ఎన్ఎస్, ఎస్ఎల్‌బిసి, తెలంగాణ సభ్య బ్యాంకుల అధికారులు, తెలంగాణలోని వివిధ జిల్లాల లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎప్ సెట్ పోటీ పరీక్షల కోసం టి-సాట్ డిజిటల్ కంటెంట్

- జనవరి 12 నుండి మే రెండవ తేదీ వరకు
- 112 రోజులు 450 డిజిటల్ ఎపిసోడ్స్
- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ఎప్ సెట్ (ఈఏపీసీఈటీ) 2026-27 పోటీ పరీక్షల కోసం టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ జనవరి 12 నుండి ప్రసారమౌతోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ విద్యను పూర్తి చేసుకొని ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విద్యను ఎంచుకునే విద్యార్థుల కోసం టి-సాట్ నెట్వర్క్ నాణ్యత కలిగిన డిజిటల్ కంటెంట్ అం దిస్తోందని, వచ్చే విద్యా సంవత్సంలో ఆయా కోర్సులు ఎంచుకునే విద్యార్థులు పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు డిజిటల్ కంటెంట్ తోడ్పడుతుందన్నారు. పేద, మారుమూల ప్రాంత విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం టి-సాట్ వేదికగా కంటెంట్ అందిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సేవలం దిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ఈఏపీసీఈటీ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు జనవరి 12వ తేది సోమవారం నుండి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బొటని, జువాలజీ తదితర సబ్జెక్టులకు సం బంధించి 112 రోజుల పాటు 450 పాఠ్యాంశ భాగాలను టి-సాట్ విద్య ఛానల్‌లో ఉదయం ఏడు గంటలకు, నిపుణ ఛానల్‌లో సాయంత్రం ఏడు గంటలకు ప్రసారం చేయను న్నామని సీఈవో తెలిపారు. ప్రసారాలు టి-సాట్ శాటి లైట్ ఛానల్లతో పాటు యాప్, యూట్యూబ్ లోనూ విద్యార్థులు డిజిటల్ పాఠాలను సద్వినియోగం చేసుకోవాలని వేణుగోపాల్ రెడ్డి కోరారు.

# 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

**పలువురిపై కేసులు నమోదు**




జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా..!

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** పేద ప్రజల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న దందా గుట్టుచప్పుడు కాకుండా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని పామెన శివారులో ఓ గౌడాన్ లో (పీడీఎస్) రేషన్ బియ్యని అక్రమార్కులు దందా కొనసాగిస్తున్న వైనాన్ని జనంసాక్షి పక్కా ఆధారాలతో ప్రచురించింది ఆటోలో తెచ్చి కంటైనర్లతో ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్న వైనాన్ని వెలుగులోకి తేవడంతో స్పందించిన ఎస్ఓటి పోలీసులు ఆ గోడానుపై దాడులు చేసి 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు 15లక్షల ప్రమాద భీమా

**ఆదర్శంగా నిలిచిన సర్పంచ్**



**చిగురుమామిడి జనవరి10 (జనంసాక్షి):** గ్రామంలో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో పని చేస్తున్న గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ముదిమాణిక్యం గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ తన సొంత ఖర్చులతో 15లక్షల రూపాయల ప్రమాద భీమాను చేసి అందరి సమక్షంలో అట్టి పత్రాలను అందజేసి ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యంలో ఈ పాలకవర్గ సమావేశంలో ముది మాణిక్యం గ్రామంలో చదువుకున్న నిరుద్యోగుల కోసం ఉన్న గ్రామపంచాయతీ పాత భవనాన్ని లైబ్రరీగా చేయుటకు తీర్మానించారు. గ్రామపం చాయతీ సిబ్బందికి సర్పంచ్ రమేష్ సొంత ఖర్చులతో ప్రతి ఒక్క పారిశుద్ధ్య కార్మికుల కోసం 15 లక్షల ప్రమాద భీమా కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపసర్పంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదు రెట్లు పెరిగిన లైట్‌హౌస్ పర్యాటకం

## కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడి




ఖైరతాబాద్, జనవరి 10 (జనం సాక్షి) : ఇండియన్ లైట్‌హౌస్ ఫెస్టివల్ 3.0 ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కేంద్ర పోర్టులు, నౌకాయాన, జలమా ర్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడు తూ విశాఖపట్నం భారత్ సముద్ర వారసత్వానికి, తీర ప్రాంత సంస్కృతికి ప్రతీకగా ఎదిగిందని పేర్కొ న్నారు. గత దశాబ్దంలో లైట్‌హౌస్ పర్యాటకం ఐదు రెట్లు పెరిగిందని ఆయన వెల్లడించారు. లైట్ హౌస్ ఫెస్టివల్ ముగింపు సభలో మాట్లాడిన మం త్రి, ప్రజలు, సంస్కృతి, వారసత్వాన్ని పండుగలా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ ఉత్సవాన్ని నిర్వ హించామని చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలు, స్థానిక హస్తకళలు, సంప్రదాయ వంటకాలు, ఫ్యాష న్ షోలు, రాత్రి లైట్ ఇల్యూమినేషన్లతో ఈ ప్రాంగ ణం భారత తీర సంస్కృతికి జీవంత రూపంగా మారిందని తెలిపారు. కుటుంబాలు, యువత, కళాకారులు, వ్యాపారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ఈ వేడుకకు మరింత వైభవం తెచ్చిందన్నారు. ఏపీలో తొలి లైట్‌హౌస్ మ్యూజి యాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్నట్లు సోనోవాల్ ప్రకటించారు. సముద్ర విద్య, వారసత్వ సంరక్షణ, పర్యాటక ప్రోత్సాహానికి కేంద్రంగా ఈ మ్యూజియం నిలవనుందని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 75 లైట్‌హౌస్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయగా, మరో 25 లైట్ హౌస్‌ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోం దని తెలిపారు. ఏపీలో మరిన్ని అనుకూల ప్రాంతా లను గుర్తించనున్నట్లు చెప్పారు. అస్సాంలో బ్రహ్మపుత్ర నది(జాతీయ జలమార్గం-2) వెంట బోగిబీల్, సిల్ఘాట్, పాండు, బిశ్వనాథ్‌ఘాట్‌ల వద్ద నాలుగు కొత్త లైట్‌హౌస్‌లు నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఇది అంతర్గత జలమార్గాల భద్రతను మరింత బలోపేతం చేయనుందని తెలిపారు.

## ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఉప్పల



**గుంటూరు (జనంసాక్షి):** గుంటూరు జిల్లా పొన్నూరులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి దేవాలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి కొంత సమయం గడిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు పద్మజ గారు లింగం రవీందర్ రెడ్డి గారు నరేంద్ర స్వామి స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
11 జనవరి 2026

# మాజీ ఐపిఎస్ భార్యకు టోకరా

- రూ.2.58 కోట్లు కొల్లగొట్టిన సైబర్ మోసగాళ్లు
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 10 (జనంసాక్షి) :** పెట్టుబడుల పేరుతో మాజీ ఐపీఎస్ అధికారి భార్యకు సైబర్ నేరగాళ్లు వలవేసి, దాదాపు రూ.2.58 కోట్లు కొల్లగొట్టారు.స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామంటూ తొలుత వాట్సప్ సందేశం పంపించారు. ఆమెకు అవగాహన లేకపోకవడంతో.. తన భర్త నెంబరును ఆ వాట్సప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. స్టాక్స్‌లో 500శాతం లాభాలు వస్తాయని, ఇది సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని నమ్మించారు. వాట్సప్‌లో నకిలీ సెబీ సర్టిఫికెట్లు పంపించారు. దీంతో సైబర్ నేరగాళ్ల ప్రకటనలు నమ్మి డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5వరకు మాజీ ఐపీఎస్ భార్య లావాదేవీలు నిర్వహించారు. మొత్తం 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్లు పెట్టుబడి పెట్టించారు. ఇన్వెస్ట్‌మెంట్ ఆపడంతో మళ్లీ పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. పెట్టుబడి పెట్టకుంటే ఇప్పటి వరకు పెట్టిన డబ్బు పోతుందని ఆమెను బెదిరించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి భర్త గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించినట్టు సమాచారం. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

# ఇరాన్ సంక్షోభంతో ఎగుమతులపై ప్రభావం

- భారత్ నుంచి నిలిచిపోయిన బాస్మతి రవాణా

**న్యూఢిల్లీ, జనవరి 10 (జనంసాక్షి) :** ఇరాన్‌లో నెలకొన్న సంక్షోభం భారత బియ్యం ఎగుమతులపై పడింది. ప్రస్తుతం ఇరాన్ అంతర్యుద్ధంతో ఉడుకుతున్న సంగతి తెలిసిందే. ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక పరిస్తితి మందగించింది. మరోవైపు అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ దారుణంగా పడిపోయింది. దీంతో విదేశీ ఆహారోత్పత్తుల దిగుమతులపై ఇస్తున్న సబ్సిడీని ఇరాన్ ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఇండియా నుంచి ఇరాన్ కు ప్రీమియం బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఇరాన్ కు ఎగుమతి చేయాల్సిన బాస్మతి బియ్యం భారత గోడౌన్లలోనే నిలిచిపోయింది. దాదాపు రూ.2,000 కోట్ల విలువైన బియ్యం ఎగుమతులు నిలిచిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంలో ఇరాన్ నుంచి స్పష్టమైన హామీ ఇస్తేనే బియ్యం ఎగుమతులు సాధ్యమవుతాయి. ఇండియాలో పండే ప్రీమియం బాస్మతి బియ్యం ఎక్కువగా ఇరాన్ కు ఎగుమతి అవుతుంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాలు అత్యధికంగా బాస్మతి బియ్యం పండిస్తున్నాయి. ఇటీవలి కాలంలో డాలర్ తో పోలిస్తే ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ అత్యల్ప స్థాయికి పడిపోయింది. దీంతో అక్కడి ప్రభుత్వం ఆహార పదార్థాల దిగుమతులకు ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేసింది. ఇదే సమయంలో ఇండియా.. ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించింది. అయితే, ఇరాన్ మాత్రం ఇండియా నుంచి మెడిసిన్స్, టీ పౌడర్, బాస్మతి రైస్ వంటివి దిగుమతి చేసుకుంటూనే ఉంది. ఇండియా నుంచి అత్యధికంగా బాస్మతి రైస్ దిగుమతి చేసుకునే దేశం ఇండియానే. ప్రతి ఏటా 12 లక్షల టన్నులు.. అంటే.. రూ.12,000 కోట్ల విలువైన బియ్యాన్ని ఇరాన్ దిగుమతి చేసుకుంటుంది. కానీ, తాజా పరిస్తితుల నేపథ్యంలో కొద్ది రోజులుగా ఇండియా నుంచి ఎగుమతులు ఆగిపోయాయి.

# డెయిరీ రంగ అభివృద్ధిలో విశిష్ట సేవలు

- హెరిటేజ్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరికి అవార్డు

**అమరావతి, జనవరి10 (జనంసాక్షి) :** భారత డెయిరీ రంగ అభివృద్ధిలో విశిష్ట సేవలకు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరికి ప్రతిష్ఠాత్మక 'అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు-2025'ను సౌత్‌జోన్ ప్రదానం చేసింది. డెయిరీ పరిశ్రమ అభివృద్ధిలో ఆమె చూపిన దూరదృష్టి నాయకత్వం, రైతుల సాధికారతకు చేసిన విశేష కృషి, డెయిరీ ఎకోసిస్టంపై ఆమె కల్పించిన సానుకూల ప్రభావాన్ని గుర్తిస్తూ ఈ అవార్డు వరించింది. ఈనెల 9న కేరళలోని కోజికోడ్‌లో కాలికట్ ట్రేడ్ సెంటర్, డాక్టర్ వర్గీస్ కురియన్ నగర్‌లో నిర్వహించిన సదరన్ డెయిరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్-2026 ప్రారంభ సమావేశంలో ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జె.చించు రాణి చేతుల మీదుగా భువనేశ్వరి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడంపై భువనేశ్వరి స్పందించారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన ఇండియన్ డెయిరీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారత డెయిరీ రంగం అభివృద్ధి, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. తన సతీమణి నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారాయన. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం ఆమె చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం భువనేశ్వరి సహా ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపని సీఎం పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందన్నారు.

# అదుపులోకి వచ్చిన బ్లో ఔట్

- పూర్తిగా ఆగిపోయిన మంటలు
- స్వదేశీ పరిజ్ఞానంతోనే అదుపుచేసిన ఓఎన్‌జిసి
- ఊపిరి పీల్చుకున్న చుట్టుపక్క గ్రామాల ప్రజలు



**కోనసీమ, జనవరి 10 (జనంసాక్షి) :** డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది. బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఔట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు శనివారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

# మియాపూర్‌లో హైడ్రా బుల్డోజర్ ఆపరేషన్

- 3 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వపరం
- శేరిలింగంపల్లిలో వణుకుతున్న ల్యాండ్ మాఫియా





**శేరిలింగంపల్లి, జనవరి 10 (జనంసాక్షి) :** హైడ్రా శేరిలింగంపల్లి పై తనదైన ముద్ర వేస్తూ ఉక్కు పాదంతో కబ్జారాయుళ్ళను తొక్కిపడేస్తుంది. ఈ మధ్యనే మాదాపూర్ డివిజన్ పరిధి దుర్గం చెరువులో అయిదు ఎకరాల కబ్జాను కాపాడిన హైడ్రా ఉదంతం మరువక ముందే మరోసారి తనదైన శైలిలో శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలో 'క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే' ట్వంటి 20 మ్యాచ్ ఆడేసిందనే అనాలి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ విలేజ్ మక్తా మబూబ్ పేటలో ఆక్రమణలపై గత కొంతకాలంగా ప్రజావాణిలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో దీనిపై హైడ్రా ప్రత్యేక దృష్టిని సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మియాపూర్ డివిజన్ పరిధి మక్త మహబూబ్ పేట్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 44 లో 15 ఎకరాలకు పైగా వున్న ప్రభుత్వ భూమిని అందులోని అక్రమ నిర్మాణాలను తొలగించి స్వాధీనపరచుకోవడం ద్వారా ప్రభుత్వపరం చేయడం జరిగింది. గతంలో ఇదే సర్వే నంబర్ కి సంబంధించి ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురి అవుతున్నట్టు హైడ్రా అధికారులకు ప్రజావాణి ద్వారా ఫిర్యాదులు అందినట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలోనే హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాలమేరకు ఇప్పటికే 5 ఎకరాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న చెరువు కట్టపై 200ల మీటర్ల మేర వేసిన 18 షెట్టర్లను హైడ్రా గతంలోనే తొలగించింది. తాజాగా మక్తా మహబూబ్ పేట్ సర్వే నెంబర్ 44 లోని ప్రభుత్వ భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లతోపాటు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్ కు సంబంధించిన వార్తల నేపథ్యంలో హైడ్రా సదరు అక్రమాలపై దృష్టిని సారించి శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు మీడియాకు వివరించారు. తప్పుడు పత్రాలతో సర్వేనెంబర్ 44 లో మొత్తంగా 43 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు గుర్తించిన హైడ్రా... నిజానికి 159 సర్వే నంబర్‌లోని భూమికి సంబంధించిన పత్రాలతో సర్వే నంబర్ 44 లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఎకరంన్నర వరకు కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై ఇప్పటికే కేసు నమోదుచేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్ధారించి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం.

# వరుసగా రెండోరోజూ పెరిగిన రద్దీ

- హైదరాబాద్- విజయవాడ మధ్య వాహనాలు బారులు
- ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని పోలీసుల సూచన



**హైదరాబాద్, జనవరి10 (జనంసాక్షి) :** సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. వరుసగా రెండో రోజు శనివారం ఉదయం హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక కూడళ్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది. ప్రతి ఆదివారం చౌటుప్పల్‌లో సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమం అని పోలీసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు ఒక గంటలో చేరుకోవచ్చు కానీ.. నిరుడు 'భోగి' ముందు రోజు 3 నుంచి 4 గంటల సమయం పట్టింది. అంతకు 2 రోజుల ముందు కూడా చాలా సమయం పట్టింది. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతుండటంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడే బదులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లడం మేలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని.. నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని.. వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

# అక్రమంగా ప్రవేశించేందుకు యత్నం

- సరిహద్దుల్లో చైనా మహిళ అరెస్ట్

**న్యూఢిల్లీ, జనవరి 10 (జనంసాక్షి) :** భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ఓ చైనా మహిళ అరెస్ట్ అయ్యారు. ఆమెను ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా ఇండో-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సశస్త్ర సీమా బల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. సదరు మహిళల వద్ద ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా ఆమె పేరు హువాజియా జీ అని, ఆమెను చైనా దేశీయురాలిగా గుర్తించినట్టు నౌతన్వా స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. సరైన వీసా, పాస్‌పోర్టులు లేకుండానే హువాజియా ఇండియాలోకి చొరబడేందుకు ప్రయత్నించిందనీ, అందుకే ఆమెను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. హువాజియా స్వస్థలం వివరాలు సహా ఆమె భారత పర్యటనకు గల ఉద్దేశమేంటో తెలుసుకునే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు.

# చేపల వేటకు వెళ్లి కుంటలో పడిన చిన్నారులు

- కాపాడబోయిన మహిళ సైతం మృతి..!

**సిద్దిపేట (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లెలో నీటి కుంటలో పడి ముగ్గురు మరణించారు. స్థానికంగా ఉన్న నీటి కుంటలో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు పిల్లలు ప్రమాదవశాత్తూ నీళ్లలో పడిపోయారు. ఆ పిల్లలను కాపాడే క్రమంలో నీటి ఉధృతికి మహిళ కూడా ప్రాణాలు విడిచింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారిని బీహార్‌కు చెందిన ఉమాదేవి మాంజి(32), కిరాని కుమార్(13), బిరాన్ మాంజీ(6)గా గుర్తించారు. 5 నెలల క్రితం వీరి కుటుంబాలు బతుకుదెరువు కోసం బిహార్ నుంచి సిద్దిపేటకు వలస వచ్చాయి. ఈ ముగ్గురి మృతితో వారి రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

# సికింద్రాబాద్‌లో సంక్రాంతి రద్దీ



సంక్రాంతి పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కోలాహలంగా మారింది. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య పెరగడంతో రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. దీంతో రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రైళ్ల ద్వారా స్వగ్రామాలకు బయలుదేరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు జరుగుతున్న ప్పటికీ.. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు, మహిళలు, చిన్నారులు పండుగ జరుపుకొనేందుకు పల్లెబాట పట్టారు. అలాగే బస్టాండ్‌లో కూడా రద్దీ కనిపించింది. బస్సుల కోసం సామన్యులు పరుగులు తీసారు.

# ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

- చరిత్ర పాఠాల నుంచి ప్రేరణ పొందాలి
- మన స్వాతంత్య్ర యోధుల ధీరత్వం పుణికి పుచ్చుకోవాలి
- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో అజిత్ ధోవల్



**న్యూఢిల్లీ, జనవరి 10 (జనంసాక్షి) :** మన దేశ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని యువతకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దబోల్ సూచించారు. ప్రతీకారం మంచిది కాదని.. దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం మన సరిహద్దుల వద్దే కాకుండా.. దేశంపై గతంలో జరిగిన అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్య్ర సమరయోధుల ధీరత్వాన్ని పుణికి పుచ్చుకోవాలన్నారు. చరిత్రలో ఇతర దేశాలు మనపై దాడులు చేసి ఆలయాలు, గ్రామాలను ధ్వంసం చేసినప్పటికీ మన పూర్వీకులు మాత్రం ఏ దేశ ప్రజలకూ ఎటువంటి హాని చేయలేదని అజిత్ డోభాల్ పేర్కొన్నారు. వారి నుంచి పాఠాలు నేర్చుకొని మనం కూడా ఇతరులను ఇబ్బందిపెట్టకుండా ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో నడవాలంటే సరైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారంనాడు జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి అజిత్ డోభాల్ మాట్లాడారు. నాయకత్వం గొప్పదనాన్ని తెలుపుతూ.. 'ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు భయపడను.. కానీ సింహం నేతృత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతాను' అని ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ అన్న మాటలను గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కేవలం పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపిందన్నారు. మరికొన్నేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల వరుసలో నిలుస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం వంటి విషయాల్లో ప్రధాని మోదీ నిబద్ధత, కృషి, నాయకత్వ భావాలు, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మీరు అదృష్టవంతులు, ఇండిపెండెంట్ ఇండియాలో మీరు పుట్టారు. భారతదేశం వలసవాదుల గుప్పిట్లో ఉన్నప్పుడు నేను పుట్టాను' అని 81 ఏళ్ల డోభాల్ అన్నారు. దేశవ్యాప్తంగా 3,000 మంది యువ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భగత్‌సింగ్‌ను ఉరి తీశారని, సుభాష్ చంద్రబోస్ తన జీవితాంతం కష్టపడ్డారని, స్వాతంత్య్ర సముపార్జన కోసం మహాత్మాగాంధీ సత్యాగ్రహం చేశారని డోభాల్ అన్నారు. ప్రపంచంలో జరిగిన దాడులు, యుద్ధాలకు కొన్ని దేశాలు తమ ఇష్టారీతిగా బలప్రయోగానికి దిగడమే కారణమని అన్నారు. 'మీరు శక్తిమంతులైతేనే స్వేచ్ఛగా మనగలుగుతారు. ఆత్మవిశ్వాసం లేకుండా ఎంత శక్తి ఉన్నా, ఆయుధ సంపత్తి ఉన్నా వృథా. అలాంటి గొప్ప నాయకులు మనకు ఉండటం మనం చేసుకున్న అదృష్టం' అని డోభాల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. ఆయన పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ మన అందరికీ స్ఫూర్తి అని డోభాల్ అన్నారు. నాయకత్వం గొప్పతనాన్ని వివరిస్తూ నెపోలియన్ అన్న మాటలను ఆయన గుర్తుచేశారు. ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు కూడా తాను భయపడనని, కానీ ఒక సింహం నాయకత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతానని నెపోలియన్ చెప్పేవారని అన్నారు. మనది ప్రగతిశీల సమాజమని, మనం ఇతరుల నాగరికత, ఆలయాలపై దాడులు చేయమని అన్నారు. భారతదేశంపై గతంలో జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఈ దాడుల్లో లెక్కకుమించి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది ఆలయాలు ధ్వంసమయ్యాయని, గ్రామాలను దోచుకున్నారనీ, మన నాగరికతను అణిచివేశారని అన్నారు. చరిత్ర మనకు సవాళ్లు విసురుతోందన్నారు. అయితే ఇందుకు తగిన్న ÷ర్ ఇవాళ్టి యువతలో ఉందన్నారు. ప్రతీకారం అనేది మంచి పదం కానప్పటికీ, అది శక్తిమంతమైనదని అన్నారు. దేశం కోసం మనం ప్రతీకారం తీర్చుకోవాలి, అందుకోసం విలువలతో కూడిన సమున్నత భారతదేశాన్ని పునర్నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370